

కొట్టుకుపోయిన గుండ్లకమ్మ గేటు నుంచి వృథాగా పోతున్న నీరు (ఫైల్)

ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగానికి నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టులు, ఇతర జలవనరులను ధ్వంసం చేసిన వైసీపీ ప్రభుత్వం చివరకు పర్యవేక్షణను కూడా గాలికొదిలేసింది. అధికారుల నియామకాల్లోనూ అడ్డగోలుగా వ్యవహరించింది. అందుకు ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఇరిగేషన్ ఉన్నతాధికారుల నియామకాలే నిదర్శనం. పట్టించుకునే వారు లేక ఆ శాఖ పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు, వందలాది నీటి వనరుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది ఒకవైపు వర్షాలు లేక, మరోవైపు ప్రధాన వనరు అయిన సాగర్ నుంచి నీరు రాక జలవనరుల పర్యవేక్షణ పెద్దగా అవసరం పడలేదు. అయితే ఈ ఏడాది సాగునీటి పరిస్థితి ఆశాజనకంగా కనిపిస్తోంది. సాగర్ నీటి సరఫరాపై ఇప్పటికే స్పష్టత వచ్చింది. ఇతర వర్షాధార వనరులకు మరోనెల తర్వాత నీరు చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని ఇరిగేషన్‌శాఖ పూర్తి స్థాయి అధికారులతో సిద్ధం కావాల్సి ఉంది.


ఒంగోలులోని జలవనరుల శాఖ ఎస్ఈ కార్యాలయం

- కీలక అధికారుల నియామకాల్లో అడ్డగోలుగా వ్యవహరించిన గత వైసీపీ ప్రభుత్వం
- గుండ్లకమ్మ ఈఈకి రెగ్యులర్ ఎస్ఈ ఇన్‌చార్జి
- మార్కాపురం రెగ్యులర్ ఈఈకి ప్రాజెక్టుల ఎస్ఈ బాధ్యత
- గుంటూరు ఇన్‌చార్జి ఎస్ఈగా అద్దంకి ఎన్నెస్పీ ఈఈ
- దర్శి ఈఈగా ముండ్లమూరు ఈఈకి చార్జ్
- లక్షల ఎకరాల ఆయకట్టు, నీటి వనరుల నిర్వహణ అగమ్యగోచరం



నీటి పారుదలంతా నిర్లక్ష్యమే..!

జలవనరుల శాఖలో పర్యవేక్షణ అస్తవ్యస్తం

ఒంగోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న సాగునీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణ ఒంగోలు కేంద్రంగానే సాగుతోంది. ఇక్కడి సీఈ పర్యవేక్షణలో రెగ్యులర్ జలవనరులకు ఒక ఎస్ఈ, ప్రాజెక్టులకు మరో ఎస్ఈ ఉండాలి. రెగ్యులర్ ఎస్ఈ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 4.42లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఎన్నెస్పీ, 43వేల ఎకరాలు ఉన్న మీడియం ఇరిగేషన్, మరో 1.35లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న మైనర్ ఇరిగేషన్‌లోని 953 చెరువులు ఉంటాయి. వీటి పర్యవేక్షణ కోసం ఎస్ఈ పరిధిలో ఎన్నెస్పీ కోసం చీమకుర్తి, దర్శి, అద్దంకి డివిజన్లు ఉండగా వాటికి ఈఈలు ఉన్నతాధికారులుగా వ్యవహరిస్తారు. ఇక మీడియం, మైనర్ ఇరిగేషన్ల నిర్వహణకు ఒంగోలు, మార్కాపురం కేంద్రాలుగా ఈఈలు ఉన్నతాధికారులుగా ఉండగా, రాళ్లపాడు ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఉంటారు. ఆ రకంగా మొత్తం రెగ్యులర్ జలవనరుల సర్కిల్ పరిధిలో ఒంగోలులోని ఎస్ఈతోపాటు ఐదు డివిజన్ల ఈఈలు కీలకం. కాగా ప్రాజెక్టుల సర్కిల్‌కు సంబంధించి ఎస్ఈ ఆ పరిధిలో గుండ్లకమ్మకు ఇద్దరు, వెలిగొండకు ముగ్గురు క్షేత్రస్థాయిలో ఈఈలు పనిచేయాల్సి ఉంది.

అవసరం కోసం అడ్‌హక్ ప్రమోషన్లు

రెగ్యులర్ ఎస్ఈగా ఉన్న నాగమురళీ మోహన్ గుండ్లకమ్మ విషయంలో ప్రాజెక్టుల ఎస్ఈ అబుల్ సలీమ్‌కు కిందిస్థాయి అధికారిగా పనిచేయాలి. అదేసమయంలో ప్రాజెక్టుల ఎస్ఈ అయిన అబుల్ సలీమ్ తన వాస్తవ పోస్టు అయిన మార్కాపురం రెగ్యులర్ ఈఈ వ్యవహారంలో నాగమురళీమోహన్‌కు కింది అధికారిగా పనిచేయాలి. అవసరాల కోసం ఇలా అడ్డగోలుగా అడ్‌హక్ ప్రమోషన్లు ఇవ్వడం గతంలో ఏప్రభుత్వం చేయలేదు. ఒకరి కింద మరొకరు పనిచేసేలా సమాన హోదా ఉన్న అధికారుల నియామకాలు చేపట్టలేదు. అలా చేయడంతో విధి నిర్వహణలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయన్న విషయాన్ని నాటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

వైసీపీ ప్రభుత్వంలో అన్నింటా వైఫల్యమే..

రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఈ, ఈఈ పోస్టుల ఉద్యోగోన్నతుల సీనియారిటీలో నెలకొన్న వివాదాలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దీంతో కిందిస్థాయి అధికారులకు అడ్‌హక్ ఉద్యోగోన్నతులు ఇచ్చి ఇన్‌చార్జిలుగా పూర్తి అదనపు బాధ్యతలతో కొనసాగించింది. అయితే ఉమ్మడి జిల్లాలో నియామకాలు తలాతోక లేకుండా చేయగా వారే ఇప్పటికీ కొనసాగుతున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ విభాగం ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతల్లో నాగమురళీమోహన్ ఉన్నారు. వాస్తవంగా ఆయన స్థానం గుండ్లకమ్మ ప్రాజెక్టు-2 విభాగం ఈఈ. కాగా ఎస్ఈతోపాటు అదేవిభాగంలోని ఒంగోలు డివిజన్ ఈఈగా కూడా ఇన్‌చార్జి ఉన్నారు. అదే ప్రాజెక్టుల విభాగం ఎస్ఈగా అబుల్ సలీమ్ పరిస్థితి చూస్తే ఆయన అసలు పోస్టు రెగ్యులర్ విభాగం మార్కాపురం డివిజన్ ఈఈ. అంటే ఇద్దరూ రెండు విభాగాలకు సమానంగా ఉన్న ఎస్ఈ స్థానాల్లో ఉన్నప్పటికీ ఒక విభాగంలో ఒకరి కింద ఒకరు పనిచేయాలి.

పని ఒత్తిడితో పట్టించుకోలేదా..

ఇక ఎన్నెస్పీ అద్దంకి డివిజన్ ఈఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడ ఈఈగా ఉన్న ఉమామహేశ్వరరావును ఉమ్మడి గుంటూరు జిల్లా రెగ్యులర్ ఎస్ఈగా నియమించారు. ఆ జిల్లా పరిధిలోని మీడియం, మైనర్ వనరులతోపాటు కేడబ్ల్యూడీ పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు పర్యవేక్షణ ఆయన పరిధిలో ఉంటుంది. ఒంగోలు ఎస్ఈ పరిధిలోని ఆయకట్టు కన్నా అధికంగా ఆయన పర్యవేక్షణలో ఉంది. అలాంటి సమాన హోదా కలిగిన సదరు అధికారి అద్దంకి ఈఈగా ఒంగోలు ఎస్ఈకి కిందస్థాయి అధికారిగా పనిచేయాలి. అంతేకాక గుంటూరు జిల్లాలో ఉండి పని ఒత్తిడితో అద్దంకి డివిజన్ వ్యవహారాలు పట్టించుకునే అవకాశం లేదు.


లైనింగ్ పూర్తిగా దెబ్బతిన్న ఒంగోలు బ్రాంచి కాలువ

రెండు పోస్టులు ఖాళీనే

ఎన్నెస్పీ దర్శి ఈఈ వెంకటరాజు గత నవంబరులో బదిలీ కాగా ముండ్లమూరు డీఈని ఇన్‌చార్జిగా నియమించారు. ఇదిలా ఉండగా రామతీర్థం రిజర్వాయర్ దర్శి ఎన్నెస్పీ-2 సబ్ డివిజన్. అలాగే చీమకుర్తి ఈఈ పర్యవేక్షణలో ఉంటుంది. కాగా ప్రస్తుతం ఆ రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో కడప జిల్లాకు చెందిన రమణారెడ్డిని చీమకుర్తి ఈఈగా నియమించగా ఆయన సెలవులో వెళ్లారు. అక్కడ ఎవరి నియామకం జరక్కపోగా దర్శి-2 సబ్ డివిజన్ డీఈగా చీమకుర్తి డీఈకి ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఇలా కీలక పోస్టులు ఇన్‌చార్జిలుగా అది కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో ఎన్నెస్పీ, గుండ్లకమ్మ, రామతీర్థం, రిజర్వాయర్లు, కాలువల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారింది.


డీజీపీకి పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న ఎస్పీ దామోదర్

నిబద్ధతతో పనిచేయండి

- పోలీసు శాఖ ప్రతిష్టను పెంచండి
- డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 19 : శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి పోలీసు అధికారి నిబద్ధతతో పనిచేసి శాఖ ప్రతిష్టను పెంపొందించాలని డీజీపీ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆయన సోమవారం తిరుపతి శ్రీసిటీ నుంచి విజయవాడ వెళుతూ మార్గమధ్యంలో ఒంగోలు పోలీసు కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ దామోదర్ సాదరస్వాగతం పలికారు. అనంతరం నూతన హంగులతో నిర్మించిన పోలీసు అతిథిగృహాన్ని డీజీపీ పరిశీలించారు. జిల్లాలో పరిస్థితులను ఎస్పీ వివరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ తీసుకున్న చర్యలను డీజీపీ ప్రశంసించారు. ఈ సందర్భంగా తిరుమలరావు మాట్లాడుతూ పోలీసులు పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు రాఘవేంద్రరావు, సూర్యనారాయణ, భీమానాయక్ పాల్గొన్నారు.

ఎస్‌బీ నుంచి 15 మంది అవుట్

- అటాచ్‌మెంట్‌లో ఉన్న 8 మంది గతంలో పనిచేసిన స్టేషన్‌లకు బదిలీ
- వీఆర్‌కు ఏడుగురు

ఒంగోలు (క్రైం), ఆగస్టు 19 : జిల్లాలో పోలీసు శాఖకు అత్యంత ముఖ్యమైన స్పెషల్ బ్రాంచ్‌ను ప్రక్షాళన చేశారు. అక్కడ అటాచ్‌మెంట్‌లో ఉన్న కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై స్థాయి సిబ్బంది ఎనిమిది మందిని వారు గతంలో పనిచేసిన పోలీసు స్టేషన్లకు ఎస్పీ దామోదర్ బదిలీ చేశారు. మరో ఏడుగురిని వీఆర్‌కు పిలిచారు. ప్రస్తుతం అటాచ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎస్‌కే.బాజీబాష, వి.వి.రమణారెడ్డి, సిహెచ్.రాము, కె.సుధాకర్‌రావు, వి.అంజిరెడ్డి, జి.నరసింహారావు, కె.చెన్నకేశవులు, జి.శ్రీనివాసులును వారు గతంలో పనిచేసిన స్టేషన్లకు పంపించారు. అదేవిధంగా స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న బీఎన్‌రెడ్డి, కె.కృష్ణదాసు, బి.అవులయ్య, కె.శ్రీనివాసులు, ఎం.ప్రసాద్‌రెడ్డి, వైవీఆర్.కృష్ణారెడ్డి, సిహెచ్.బాస్కరరావులను వీఆర్‌కు పిలిచారు. మొత్తం 15 మందికి స్పెషల్ బ్రాంచ్‌లో పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది.

యూపీ స్కూళ్లకు సర్దుపోటు

- ఇద్దరు టీచర్లు.. ఎనిమిది తరగతులు
- ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ముప్పు

ఒంగోలు (విద్య), ఆగస్టు 19 : రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుపోటుగా మారింది. అందరూ వ్యతిరేకిస్తున్నా గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవో ప్రకారం జరుగుతున్న ప్రక్రియ పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపనుంది. అసంబద్ధమైన, అశాస్త్రీయమైన ఈ టీచర్ల సర్దుబాటు ప్రక్రియతో యూపీ స్కూళ్ల మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన జరుగుతున్న ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులు తక్కువ మంది ఉన్న యూపీ స్కూళ్లలో ఇద్దరు టీచర్లు ఎనిమిది తరగతులు బోధించాల్సి వస్తుంది. అన్ని తరగతులకు ఇద్దరు టీచర్లు అసలు బోధించగలరా? విద్యార్థుల్లో ఏ మేరకు ప్రమాణాలు పెంపొందించగలరు? విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి మొత్తం స్కూలు అసిస్టెంట్లను తప్పించి ఇద్దరు, ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లను అక్కడ కొనసాగించడం వల్ల ఉపయోగం ఉండదు. పిల్లలకు పాఠాలు చెప్పేందుకు టీచర్లు లేక వారు కూడా ఇతర పాఠశాలలకు వెళితే అవన్నీ మూసివేతకు గురయ్యే ప్రమాదం ఉంది.

91 పాఠశాలలపై సర్దుబాటు పిడుగు

జిల్లాలోని 91 ప్రాథమికోన్నత పాఠశాలలపై సర్దుబాటు పిడుగు పడనుంది. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో మొత్తం 191 యూపీ పాఠశాలలు ఉన్నాయి. 1 నుంచి 8 తరగతులు ఉన్న పాఠశాలల్లో కనీసం 98 మంది విద్యార్థులు ఉంటేనే స్కూలు అసిస్టెంట్లను కొనసాగిస్తారు. అయితే జిల్లాలో 19 పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లను మిగులుగా చూపించి వారి స్థానంలో దామాషా పద్ధతిలో ఎస్జీటీలను నియమిస్తున్నారు. 10 యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతుల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు. 52 యూపీ స్కూళ్లలో 8వ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా లేరు. జిల్లాలో మార్కాపురంలోని 10వ వార్డులోని మునిసిపల్ యూపీఎస్‌లో గరిష్ఠంగా 278 మంది విద్యార్థులు ఉండగా, పెళ్లూరు ఎంపీయూపీఎస్‌లో 1నుంచి 8 తరగతుల్లో కేవలం 23 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

కొన్నిచోట్ల పరిస్థితి ఇదీ..

ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం ఎంపీయూపీఎస్‌లో 1 నుంచి 8 తరగతులకు 93మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 1 నుంచి 5 తరగతులకు 68 మంది, 6వ తరగతిలో 16 మంది, 7లో ఐదుగురు, 8లో నలుగురు విద్యార్థులు ఉన్నారు. వీరికి ప్రస్తుతం తొమ్మిది మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు బోధిస్తున్నారు. ప్రస్తుతం వీరిలో ఐదుగురిని మిగులుగా గుర్తించారు. అంటే ఇక నుంచి అక్కడ నలుగురు టీచర్లే బోధించాల్సి ఉంది. అదే హైస్కూలులో 93 మంది విద్యార్థులు ఉంటే ఏడుగురు అసిస్టెంట్లు, ఒక హెచ్‌ఎం, ఒక పీడీ/పీఈటీని ఇస్తారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ వివక్షతో యూపీఎస్‌లు కుదేలైపోనున్నాయి. అదేవిధంగా పెళ్లూరు ఎంపీయూపీ స్కూలులో 23 మంది విద్యార్థులు ఉండటంతో అక్కడ ఇద్దరు టీచర్లే ఎనిమిది తరగతులకు బోధించాల్సి ఉంది. విద్యార్థులు ఎంతమంది ఉన్నా ఆయా తరగతులకు అన్ని సబ్జెక్టులూ బోధించాల్సిందే. ఈ వాస్తవాన్ని గుర్తించి యూపీ స్కూళ్లకు టీచర్లను కేటాయించాలని సంఘాలు కోరుతున్నాయి.



యూపీఎస్‌లపై వివక్ష

117 జీవో ప్రకారం విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని కేడర్ స్ట్రెంత్ నిర్ణయించడంతో యూపీ స్కూళ్లకు తీవ్ర అన్యాయం జరిగింది. యూపీఎస్‌లో 98 మంది విద్యార్థులు ఉంటేనే వాటిల్లో 3 నుంచి 8 వరకు అంటే ఆరు తరగతులకు ఆరుగురు స్కూలు అసిస్టెంట్లను కేటాయించమన్నారు. 98మంది కంటే తక్కువ మంది ఉంటే 1:30 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఆధారంగా ఎస్జీటీలను కేటాయించమన్నారు. అంటే 97 మంది విద్యార్థులు ఉన్నా ఆ పాఠశాలలకు నలుగురు ఎస్జీటీలను మాత్రమే కేటాయిస్తారు. అదే హైస్కూళ్లలో అయితే 6 నుంచి 10 తరగతులకు 92మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న ప్రతి సబ్జెక్టుకు కనీసం ఒకరు చొప్పున ఏడుగురు స్కూలు అసిస్టెంట్లను కొనసాగిస్తారు. ఈ వివక్షను టీచర్లు, సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.



వేతన వెతలు

- ఉపాధి కూలీలకు నిలిచిన చెల్లింపులు
- మూడు నెలలుగా అందని వైనం
- జిల్లాలో రూ.88.50 కోట్లు పెండింగ్
- కేంద్రం నిధులు ఇవ్వకపోవడమే కారణం

ఒంగోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఊతం ఇచ్చే ఉపాధి పనులు చేసిన వారికి ఇంచుమించు మూడు నెలలుగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈఏడాది సాధారణ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో పనులు జరిగిందే తక్కువ. వాటికి కూడా డబ్బులు రాక కూలీలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా వారంవారం కూలి డబ్బులు చెల్లించాల్సి ఉండగా గత వైసీపీ పాలనలో నెలకు ఒకసారి ఇచ్చారు. ఈసారి దాదాపు రెండున్నర నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం సుమారు రూ.88.50 కోట్ల మేర వేతన బకాయిలు ఉన్నట్లు సమాచారం.

జిల్లాలో మొత్తం మండలాలు	38
ఉపాధి పనులు జరిగే పంచాయతీలు	719
మొత్తం జాబ్‌కార్డులు (కుటుంబాలు)	4.36 లక్షలు
జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీలు	8.03 లక్షలు
పనులకు వచ్చిన కుటుంబాలు	2.71 లక్షలు
పనులకు హాజరైన కూలీలు	4.60 లక్షలు
వార్షిక పని దినాల లక్ష్యం	1.56 కోట్లు
ఇప్పటి వరకు చేసిన పని దినాలు	1.06కోట్లు
మొత్తం కూలీలకు లభించిన వేతనం	రూ 221.62కోట్లు
పెండింగ్‌లో ఉన్న సొమ్ము	రూ 88.50 కోట్లు

సగటున ఒక్కొక్కరికి రోజుకు రూ. 208 వేతనం

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కోటి 56 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించారు. మొత్తం 38 మండలాల్లోని 729 గ్రామ పంచాయతీల పరిధిలో 4.36 లక్షల జాబ్ కార్డులు ఉండగా వాటిలో 8.03 లక్షల మంది కూలీల పేర్లు నమోదయ్యాయి. అందులో 2.71లక్షల కుటుంబాలకు సంబంధించి 4.60 లక్షల మంది పనులకు రాగా ఇప్పటి వరకు కోటి ఆరు లక్షల పనిదినాలు కల్పించారు వార్షిక లక్ష్యంలో 67.98శాతం పనిదినాలు కల్పించగా సగటు ఒక్కొక్కరికి రోజుకు రూ.208 వేతనం లభించింది. ఆ ప్రకారం మొత్తం చేసిన పని దినాలకు రూ221.62 కోట్ల మేర కూలి సొమ్ము రావాల్సి ఉంది. అయితే రెండున్నర నెలలుగా కూలీలకు వేతనాలు అందడం లేదు.



మే 20 నుంచి నిలిచిన చెల్లింపులు

అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఈ ఏడాది మే 20నుంచి జిల్లాలో ఉపాధి పనులు చేసిన కూలీలకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. కేంద్రం నుంచి నిధులు రావడంలో జాప్యం వల్ల ఈ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండున్నరవేల కోట్ల మేర ఉపాధి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. అయితే తక్షణం ఆ నిధులను విడుదల చేసినా అవి రాష్ట్రానికి చేరి వాటిని జిల్లాల వారీ కేటాయించి కూలీల ఖాతాలకు జమ చేయడానికి కనీసం వారం పట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఎప్పటి నుంచి ఎప్పటి వరకు పెండింగ్ వేతనాలు చెల్లిస్తారన్న స్పష్టత కూడా ఆతర్వాత తేలనుంది. దాదాపు మూడు నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కూలీలు కూడా ఉపాధి పనులకు ఆసక్తి చూపడం లేదు. ఈపరిస్థితుల్లో తక్షణం వేతన బకాయిలు చెల్లించి కూలీలకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. వేతన సొమ్ము విడుదల చేయాలని కోరుతూ కొన్నిచోట్ల ఆందోళనలు కూడా చేస్తున్నారు.

మాక్ పోలింగ్ మాకొద్దు..


మాక్ పోలింగ్‌ను బహిష్కరించి వెళ్లిపోతున్న వైసీపీ నాయకులు

వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కించాలి

- హైకోర్టును ఆశ్రయించిన బాలినేని
- ప్రక్రియను నిలిపివేయాలని వినతి
- స్టే ఇచ్చేందుకు నిరాకరించిన న్యాయస్థానం
- వివరాలు సమర్పించాలని ఈసీకి ఆదేశం
- విచారణ నేటికి వాయిదా
- వెరిఫికేషన్‌ను బహిష్కరించిన వైసీపీ

మెయిన్‌లో..


విద్యార్థులకు భోజనాన్ని వడ్డిస్తున్న పోతుల, చిడిపోతు తదితరులు

మధ్యాహ్న భోజనం ప్రారంభం

టంగుటూరు, ఆగస్టు 19 : టంగుటూరులోని పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మాట్లాడుతూ ఇక్కడ ప్రభుత్వపరంగా మధ్యాహ్న భోజనానికి అవకాశం లేకున్నా విద్యార్థుల పరిస్థితులను అర్థం చేసుకొని కొనసాగిస్తున్నామన్నారు. ఇందుకు దాతల సహకారం అభినందనీయమన్నారు. విద్యాప్రమాణాల మెరుగునకు ఒకవైపు దాతలు, మరోవైపు కళాశాల అధ్యాపకులు తీవ్ర కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ చక్రపాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాదాతలు చిడిపోతు వెంకటేశ్వర్లు, కరవది సుబ్బారావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ, నేతలు

భూ బాధితులకు న్యాయం చేయాలి

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 : గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కుంభకోణాలు, అక్రమ భూ కబ్జాలు, నకిలీ స్టాంపులు, అన్యాక్రాంతమైన ఆస్తులపై వేసిన సిట్ విచారణను వేగవంతం చేసి, బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని సీపీఐ నేతలు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జేసీని కలిసిన జిల్లా ప్రతినిధులు తదితర అంశాలకు సంబంధించి వినతిపత్రం అందజేశారు. అయితే జిల్లా వ్యాప్తంగా జరిగిన భూ కుంభకోణాలపై విచారణ చేసి, బాధితులకు సత్వర న్యాయం అందించాలని కోరారు. సెప్టెంబరు 1 నుంచి జరగనున్న రెవెన్యూ భూ సదస్సులలో వీటిపై సమగ్ర విచారణ జరిపి, భూ బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. వెంకట్రావు, పీవీఆర్ చౌదరి, కే. వీరారెడ్డి, కొత్తకోట వెంకటేశ్వర్లు, సలార్, బి. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.


వెంకయ్యకు నివాళులర్పిస్తున్న అతిథులు

జంపాల మృతి కళారంగానికి తీరని లోటు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 19: సీనియర్ రంగస్థల నటుడు జంపాల వెంకయ్య అకాల మరణం కళారంగానికి తీరని లోటని పలువురు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం సాయంత్రం స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో పట్టణ సాంస్కృతిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వెంకయ్య సంతాప సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్ర ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రంగస్థలంలో తన హావ భావాలతో, పదునైన సంభాషణలతో ఎంతోమంది ప్రేక్షకుల అభిమానం చూరగొన్న గొప్ప నటుడు జంపాల వెంకయ్య అన్నారు. ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు ఈదర హరిబాబు మాట్లాడుతూ జంపాల వెంకయ్య మరణం జిల్లా కళారంగానికి తీరనిలోటని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాటిబండ్ల ఆనందరావు, ధేనువకొండ సుబ్బయ్య, అన్నమనేని ప్రసాద్, పొన్నూరి వేంకట శ్రీనివాసులు, రజితమూర్తి, కర్నాటి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాల గ్రంథాలయానికి అందించిన పుస్తకాలతో దాత శ్రీనివాసరావు

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

నాగులుప్పలపాడు, ఆగస్టు 19 : ప్రభుత్వ పాఠశాల గ్రంథాలయానికి మారెళ్ళ విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తకాలను అందజేశారు. బి.నిడమానూరు గ్రామంలోని కూనం రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని గ్రంథాలయానికి గ్రామానికి చెందిన మారెళ్ళ విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మారెళ్ళ శ్రీనివాసరావు, అనిత దంపతులు రూ. 25 వేల పుస్తకాలను సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ కరీం సాహెబ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాత శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటూ పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు తమ ట్రస్ట్ ద్వారా ప్రతి నెలా ట్యూషన్ ఫీజు చెల్లించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వీ గ్రాండ్ ఇన్‌ఫ్రా ప్రారంభం



వీగ్రాండ్ ఇన్‌ఫ్రా ప్రారంభంలో ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 : అభివృద్ధి చెందు తున్న నగరంగా ఒంగోలు మారబోతుందని, అందులో భాగంగానే వీ గ్రాండ్ ఇన్‌ఫ్రా రూపుదిద్దుకోబోతున్నదని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల పేర్కొన్నారు. సోమవారం కొప్పోలు రోడ్‌లో నూతనంగా నిర్మించబోతున్న ఇన్‌ఫ్రాను దామచర్ల ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమి పూజ చేసిన ఎమ్మెల్యే మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పావులూరి నాగేశ్వరరావు, తులసీ వినోద్ కుమార్, సిహెచ్. చంద్రశేఖర్, పలువురు పాల్గొన్నారు.

సమస్యలను స్థానికంగానే పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 : స్థానికంగా వచ్చే అర్జీలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. స్థానిక స్పందన హాలులో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జేసీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 197 అర్జీలు రాగా సంబంధిత అధికారులతో మాట్లాడిన జేసీ త్వరితగతిన వాటిని పరిష్కరించాలని తెలిపారు. దరఖాస్తులను నిర్దేశించిన సమయంలో పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత శాఖాధికారులు అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి తప్పనిసరిగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. ప్రజలను తరచూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం సరికాదని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో పరిష్కరించలేని అర్జీలను మాత్రమే జిల్లా స్థాయికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోపాలకృష్ణ



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి

● ఎస్పీ దామోదర్

ఒంగోలు(క్రైం)ఆగస్టు19 : ప్రజా ఫిర్యాదులపై అలసత్వం వహించకుండా సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమంలో 69 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదిదారులతో స్వయంగా మాట్లాడి వారిసమస్యలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా పోలీసు స్టేషన్‌ల అధికారులతో మాట్లాడి చట్ట పరిధిలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

● జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని కనిగిరి మండలానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రూ. 8.5 లక్షలు నగదు తీసుకొని మోసం చేసారని ఓ మహిళ ఎస్పీకి ఫిర్యాదు చేశారు .

● కట్నం కోసం అత్తింటి వారి వేధింపులతో పాటు తన భర్త మానసికంగా,శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారని కంభం మండలానికి చెందిన ఓ మహిళ ఎస్పీకి విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఒంగోలు డీఎస్పీ ఆర్ .శ్రీనివాసరావు, దిశ సీఐ ఖాజావలి, అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే దామచర్ల


రక్తదాన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 : జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మీడియా కెమెరామెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి దామచర్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎంసీఏ అధ్యక్షులు వేల్పుల నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా దామచర్ల మాట్లాడుతూ మీడియా రంగంలో రాణిస్తూ, అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటూ సమాజంలో నాల్గవ స్తంభంగా ఉన్న మీడియా మిత్రులు, ఫొటో, వీడియో, జర్నలిస్టులు సమస్యలు పరిష్కరిస్తానని హామీఇచ్చారు. వృత్తిని కాపాడు కోవడం కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, వారి కృషిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వానికి, పాలకులకు మధ్య వారధిగా, సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తున్న మీడియా రంగ ప్రతినిధులకు అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి వెంకట సూర్య నారాయణ, ఎంసీఏ మాజీ చైర్మన్ ఇస్తేకర్ బాషా, ప్రధాన కార్యదర్శి అచ్చుకాల రాజశేఖర్, కోశాధికారి ప్రతాప్ రెడ్డి, ఫొటో, వీడియో జర్నలిస్టులు హరి, లక్ష్మణ్, అజయ్, కిరణ్, వెస్పా, ఉబ్బా అశోక్, బాబి, బెల్లం అనిల్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్విస్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు రక్తదానం చేశారు.

ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

ఒంగోలు నగర ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రక్తదాన శిబిరం నిర్వహించడంతోపాటు, సీనియర్ ఫొటోగ్రాఫర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి అసోసియేషన్ ప్రెసిడెంట్ దగ్గుబాటి వెంకట్రావు అధ్యక్షత వహించారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవం


దామచర్లకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలుపుతున్న తెలుగుమహిళలు

-పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల దంపతులు

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 19: స్థానిక కర్నూల్ రోడ్‌లోని షిరిడీ సాయిబాబా మందిర 35వ వార్షికోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ చైర్మన్ టీవీ శ్రీరామమూర్తి, సుబ్బలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, నాగ సత్యలత దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు దంపతులు, ఆకుతోట చంద్ర దంపతులు, ఆలయ ట్రస్ట్ సభ్యులు రాజశేఖర్ దంపతులు, ఆంజనేయులు దంపతులు, సాయిరాం దంపతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దామచర్లకు రక్షాబంధన్ శుభాకాంక్షలు

ఒంగోలు (కార్పొరేషన్) : ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్‌కు తెలుగు మహిళలు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు సోమవారం ఆయన నివాసంలో కలిసి రాఖీలు కట్టి, తమ సోదరి భావాన్ని వెల్లడించారు. అలాగే మేయర్ గంగాడ సుజాత ఎమ్మెల్యే దామచర్లకు, జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్‌కు రాఖీ కట్టారు. సోమవారం దామచర్ల నివాసంలో మేయర్‌తో పాటు ఇటీవల వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన మహిళా కార్పొరేటర్లు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.


విగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా దక్షిణామూర్తి, కాలభైరవ విగ్రహాల ప్రతిష్ఠ

టంగుటూరు, ఆగస్టు 19 : టంగుటూరు శివాలయం ప్రాంగణంలో దక్షిణామూర్తి, కాలభైర స్వామిల విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 6గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 8.47 గంటలకు దక్షిణామూర్తి, కాలభైరవ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. 11.45 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఎండుకొబ్బరి, ఆవునెయ్యి, ఇతర సామగ్రి తెచ్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12గంటల నుంచి అన్న సంతర్పణ జరిగింది. ప్రముఖ వ్యాపారి బెల్లం కోటయ్య, బెల్లం జయంత్‌బాబు, మక్కెన హరిబాబులు సతీసమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మక్కెన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఓనర్ల అసోసియేషన్ నాయకులు

గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల పొట్టకొట్టవద్దు

● బయ్యర్లను కోరిన అసోసియేషన్ నాయకులు

చీమకుర్తి,ఆగస్టు 19 : బయ్యర్లు సిండికేట్‌గా మారి గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల పొట్ట కొట్టవద్దని ఓనర్ల అసోసియేషన్ నాయకులు కోరారు. మర్రిచెట్లపాలెం వద్ద ఓనర్ల అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని సోమవారం ప్రారంభించారు. ఓనర్ల సమావేశంలో ఉండగానే సిండికేట్ అయిన కొంతమంది బయ్యర్లు ఓనర్లను నష్టపరచే విధంగా లోడింగ్ ప్రక్రియకు ఉపక్రమించారనే విషయం తెలిసింది. దీంతో అప్రమత్తమైన ఓనర్లు హుటాహుటిన లోడింగ్ చేస్తున్న ప్రదేశానికి వెళ్లి లోడింగ్‌ని అడ్డుకున్నారు. గిట్టుబాటు ధరలకే కొనుగోలు చేసి లోడింగ్ చేసుకోవాలని బయ్యర్లను కోరారు.ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని బయ్యర్ల సిండికేట్‌కు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్యాక్టరీ ఓనర్లకు న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకొని పరిశ్రమను కాపాడాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, మందా రామారావు, అహ్మద్ బాష, ప్రసాదరాజు,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

ఒంగోలు, ఆగస్టు 19: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులను అంతర్జాతీయ, జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదిగేవిధంగా తీర్చిదిద్దాలని స్కూల్‌కాంప్లెక్స్ కోర్సు డైరెక్టర్ చల్లా బ్రహ్మయ్య అన్నారు. ఒంగోలు నగరం త్రోవగుంట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్‌పై సోమవారం ఒంగోలు నగరం ,ఒంగోలు మండలం ,కొత్తపట్నం మండలాల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వ్యాయామవిద్యపై ఉద యం నుంచి సాయంత్రం వరకు శిక్షణ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు కడియాల ప్రసాదును, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులను స్కూల్ కాంప్లెక్స్ కోర్సు డైరెక్టర్ చల్లా బ్రహ్మయ్య శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు 21మందిపైగా పాల్గొన్నారు.


త్రోవగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమంలో పాల్గొన్న వ్యాయామ ఉపాధ్యాయులు

పంట నమోదును పక్కాగా పూర్తిచేయాలి

● మంచికలపాడులో పరిశీలించిన జేసీ గోపాలకృష్ణ

చీమకుర్తి,ఆగస్టు 19 : ఈ-పంట నమోదు ప్రక్రియను పక్కాగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని మంచికలపాడు గ్రామంలో పంట నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. త్వరగా పంటనమోదును పూర్తి చేయాలని వ్యవసాయశాఖాధికారులను ఆదేశించారు. పంట నమోదు జరిగితే రైతులకు అన్ని విధాల ప్రయోజనం చేకూరుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకులు పి. వెంకట్రావు,టెక్నికల్ ఏవో శ్రీనివాస్‌నాయక్, మండల ఏవో డీవీ భాస్కర్, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సజ్జ పంటను పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

అవీ..ఇవీ..

స్కూల్ కాంప్లెక్స్ అజెండాను పాటించాలి


విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న రమేష్

కొండపి, ఆగస్టు 19 : స్కూల్ కాంప్లెక్స్‌ల అజెండాను ఉపాధ్యాయులు పాటించాలని సమగ్ర శిక్ష ఒంగోలు అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని కె.ఉప్పలపాడు జడ్పీస్కూల్‌లో జరిగిన ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థుల అభ్యసన, ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం కొండపిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ల్యాబ్‌ను చూశారు. ఆయన వెంట కె.ఉప్పలపాడు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వి.సుసన్నకుమార్, ఎంఈవో-2 పి.రామారావు ఉన్నారు.

టంగుటూరు విద్యార్థినికి సైనిక్ స్కూల్‌లో ప్రవేశం


విద్యార్థినిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

టంగుటూరు, ఆగస్టు 19 : టంగుటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చల్లాపల్లి లాస్యప్రియకు జమ్మూకశ్మీర్‌లోని నగ్‌రాట్‌లో ఉన్న సైనిక్ స్కూల్‌లో ప్రవేశం లభించింది. ఇటీవల సైనిక్ స్కూల్‌లో ప్రవేశానికి నిర్వహించిన పరీక్ష రాసిన ఆ బాలిక సీటు సాధించింది. ఈసందర్భంగా సోమవారం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో లాస్యప్రియను హెచ్.తులసీప్రభ, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో పీడీ యరమాల అరుణ, ఉపాధ్యాయులు వి.రామారావు, వైఎల్ శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు, కె.పుష్పలత, పాఠశాల స్టాఫ్ కార్యదర్శి జి యాకోబు పాల్గొన్నారు.

మోసానికి మారుపేరు జగన్మోహన్‌రెడ్డి

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 : మోసానికి మారుపేరు జగన్మోహన్ రెడ్డి అని తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షులు నూకసాని బాలాజి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేసిన ఘనుడు అన్నారు. ఏడాదిలో ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చి ఐదేళ్ళుగా చేయలేకపోయాడన్నారు. నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ విషయంలోనూ మోసం చేశాడని, అటువంటి వ్యక్తి ప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత జగన్మోహన్ రెడ్డికి లేదని బాలాజి పేర్కొన్నారు. వెలిగొండను ప్రారంభించింది. పూర్తి చేసింది తెలుగుదేశం పార్టీ నేనని గుర్తు చేశారు.

పీడీసీసీబీ జనరల్ మేనేజర్‌కు డాక్టరేట్


అవార్డు అందుకుంటున్న రాఘవయ్య

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 : ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు జనరల్ మేనేజర్ కుంభా రాఘవయ్యకు పాండిచ్చేరి పీస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. కారంచేడు గ్రామానికి చెందిన రాఘవయ్య, ప్రాథమిక విద్యాభ్యాసం చిలకలూరిపేటలోని ఏఎంజీ పాఠశాలలో జరిగింది. ఆయన విద్యతోపాటు, ఆటలు, పాటలు, కళలు, నటనలో, గాయకుడుగా పలు అవార్డులు అందుకున్నారు. కాగా ప్రస్తుతం ఒంగోలులోని పీడీసీసీ బ్యాంకు మెయిన్ బ్రాంచ్‌లో జనరల్ మేనేజరుగా పనిచేస్తున్నారు. ఆయన కృషిని, సేవలను గుర్తించిన పాండిచ్చేరి ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ డాక్టర్ రేట్‌ను ప్రదానం చేయగా, బ్యాంకు సిబ్బంది ఆయనను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీవారినామాలకు శంకుస్థాపన


శ్రీవారినామాలకు శంకుస్థాపన చేస్తున్న గ్రామస్థులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 19 : మండలకేంద్రమైన నాగులుప్పలపాడులో శ్రీవారినామాలు శంకుస్థాపన కార్యక్రమం సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు ఓరుగంటి శ్రీనివాసులు చార్యులు బృందం వేదమంత్రాలతో అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించి నామాల శంకుస్థాపన క్రతువును నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం ప్రసాద వియోగం చేశారు. కార్యక్రమంలో మారెళ్ళ వెంకట శేషయ్య, గొల్లపూడి పెద్ద సుబ్బయ్య, చుండూరి నాగేశ్వరరావు, పి.ఆంజనేయులు, గూడూరు ఝాన్సీ, ఉప్పుటూరి హరినాథ్, పోలినేని శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో 4 అర్జీలు

మద్దిపాడు, ఆగస్టు 19: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినోత్సవంలో నాలుగు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సృజన కుమార్ తెలిపారు. సమస్యలు తక్షణం పరిష్కరిస్తామని ఆయన అన్నారు. గ్రామాల్లో వీఆర్‌వోలు రెవెన్యూ సమస్యలపై దృష్టిపెట్టాలని కోరారు. అర్జీపెట్టిన వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

మద్దిపాడు ఎస్ఐ శివరామయ్య బాధ్యతల స్వీకరణ

మద్దిపాడు ఎస్సైగా శివరామయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, గ్రామాల్లో పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే సమాచారం అందించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పని సరిగా పాటించాలన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని ఆయన కోరారు.

వైభవంగా వీరమ్మతల్లి కొలుపులు

● మంత్రి స్వామి పూజలు


పూజలు చేస్తున్న మంత్రి స్వామి

వెలగపూడి (టంగుటూరు) ఆగస్టు 19 : వెలగపూడిలో వీరమ్మతల్లి కొలుపులు వైభవంగా ముగిశాయి. చివరి రోజైన ఆదివారం రాత్రి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కామని విజయ్‌కుమార్, సీనియర్ నాయకుడు బెజవాడ వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ నాయకులు కాపు శ్రీను, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ డివిజన్ కమిటీల నియామకం

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నగరంలోని పలు డివిజన్ కమిటీలను సోమవారం నియమించింది. ఈ మేరకు నగర అధ్యక్షులు గుంటూరి ప్రభుదాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కరుణా కాలనీ, ప్రగతి కాలనీ కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా ప్రభుదాస్ మాట్లాడుతూ కరుణా కాలనీ అధ్యక్షులుగా గుంటూరి రజనీ కుమార్, ఉపాధ్యక్షులుగా గంగవరపు అంకయ్య, అలాగే ప్రగతి కాలనీ అధ్యక్షులుగా పులకూరి ఎలీషా, ఉపాధ్యక్షులుగా పులుకూరి దానియేలును నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తిరువీధి బాబు, ఐదుపోగుల శిఖామణి, తేళ్ళ అహరోన్, కాకర్లమూడి ఎలియాజర్, పాలపర్తి లక్ష్మయ్య ఆయా కాలనీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ సంఘాల నేతలు

దోషులను కఠినంగా శిక్షించాలి

● పలు సంఘాలు నిరసన ర్యాలీ

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 :కొలకత్తాలో మెడికల్ విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనలో దోషులపై సమగ్ర విచారణ జరిపి, కఠినంగా శిక్షించాలని స్త్రీ విముక్తి సంఘటన, జనసాహితీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈమేరకు ఆ రెండు సంఘాలు సంయుక్తంగా స్థానిక ఈమనిపాలెం నుంచి జీజీహెచ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి, జూనియర్ డాక్టర్లు చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా జనసాహితీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ జీవీ కృష్ణయ్య , స్త్రీ విముక్తి సంఘటన జిల్లా కార్యదర్శి పి. శాంతకుమారి, రైతుకూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. లలితకుమారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షురాలు డి. రేణుక, ఏఐఎస్టీయూ జిల్లా నాయకులు ఎంఎస్.సాయి, పేరయ్య, ఐ. విజయసారథి, రఘుబాబు, పి.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్యాలెస్‌లో కూర్చొని తప్పుడు ట్వీట్లా ? దామచర్ల

అమరావతి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఫేక్ ప్రచారంతో రాజకీయ లబ్ధిపొందాలనుకునే జగన్‌రెడ్డి దుర్మార్గపు ఆలోచనలను ప్రజలు విశ్వసించరని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్ట్ గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ట్వీట్ చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో మిగిలిపోయిన 10-20శాతం పనులు పూర్తి చేసి, వెలిగొండ ద్వారా నీళ్లివ్వలేకపోయిన నువ్వు.. బెంగళూరు యలహంక ప్యాలెస్‌లో కూర్చొని, ట్వీట్లు చేయడానికి సిగ్గనిపించడం లేదా అని నిలదీశారు. సర్వేరాళ్లపై బొమ్మలు, సలహాదారులకు, సొంత మీడియాకు చేసిన ఖర్చు ఎంత? సాగునీటి ప్రాజెక్ట్‌లకు ఖర్చు చేసిందెంతో జగన్‌కు దమ్ముంటే ప్రకటించాలని సవాల్ చేశారు. సాగునీటి రంగానికి, రైతాంగానికి జగన్ ఐదేళ్ల పాపపు పాలన ఒక శాపంగా మారిందని, ఈ సంగతి ఫేక్ రాజకీయం చేసే, అంతరాత్మ లేని జగన్‌కు తప్పా.. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి తెలుసునని వ్యాఖ్యానించారు. తప్పుడు ప్రచారంతో ఎల్లకాలం రాజకీయం సాగదనే విషయం జగన్ గుర్తుంచుకోవాలని సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ

రైతులకు అందుబాటులో ఉండాలి

సిబ్బందిని ఆదేశించిన ఏడీఏ మోహన్‌రావు

చెరుకూరు(పర్చూరు), ఆగస్టు 19 : రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని పర్చూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. మోహన్‌రావు ఆదేశించారు. సోమవారం మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ నేపథ్యంలో ఆర్‌బీకే వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం వరి పైర్లను ఆయన పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఆయనతోపాటు వీఏఏఎస్, రైతులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

వీరన్నపాలెం(పర్చూరు), ఆగస్టు 19 : పర్చూరు మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీ కృష్ణుని ఆలయంలో మంగళవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వా మివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బాలరాజు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

అద్దంకిటౌన్, ఆగస్టు 19 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. బాలరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని శింగరకొండపాలెం పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. తాగునీరు శుభ్రత, మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలని, దోమతెరలను వాడాలని సూచించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడి మృతి

బల్లికురవ, ఆగస్టు 19 : అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు వద్ద సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో అద్దంకి మం డలం చక్రాయపాలెంకు చెందిన పిడతల నాగార్జున(32) మృతి చెందారు. ఎస్‌ఐ జీవీ చౌదరి తెలిపిన వివరాల మేరకు.. చక్రాయపాలెంకు చెందిన నాగార్జున మరో వ్యక్తితో కలిసి సంతమాగులూరు అడ్డరోడ్డులో ఉన్న మరో బైకు కోసం వెళ్లి తిరిగి తమ స్వగ్రామానికి వస్తుండగా నాగార్జున నడుపుతున్న బైకు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. దీంతో నాగార్జున తలకు బలమైన గాయమై మృతిచెందారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ

ఆయ్ చిత్ర యూనిట్ సందడి

ఒంగోలు(కల్చరల్), ఆగస్టు 19: ఒంగోలులో ఆయ్ చిత్ర యూనిట్ సందడి చేసింది. సోమవారం రాత్రి స్థానిక గుంటూరు రోడ్‌లోని రవిప్రియ మాల్‌లో చిత్ర డైరెక్టర్ కంచిపల్లి అంజి మాట్లాడుతూ ఆయ్ సినిమా బ్లాక్ బస్టర్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకులు ఆదరించారని అన్నారు. సినిమా ప్రదర్శిస్తున్న ప్రతి థియేటర్‌కు చిత్ర హీరో నార్నె నితిన్, హీరోయిన్ సారికతోపాటు చిత్రంలోని నటులు సందర్శిస్తున్నారన్నారు. ఆయ్ చిత్రం కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందించామని, కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రమని అన్నారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ చిత్ర హీరో నర్నే నితిన్‌ను గజమాలతో సత్కరించారు. అనంతరం రవిప్రియ మాల్ 6వ వార్షికోత్సవ పోస్టను చిత్ర యూనిట్ ఆవిష్కరించారు.



గాంధీ పార్కులో విభిన్న తరహాలో నిరసన తెలుపుతున్న వైద్య విద్యార్థులు



జూడాల వినూత్న నిరసన

ఒంగోలు (కార్పొరేషన్), ఆగస్టు 19 : కొలకత్తాలో మెడికల్ విద్యార్థినిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా ఒంగోలులోని జీజీహెచ్ వైద్యులు చేపట్టిన నిరసన సోమవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా స్థానిక జీజీహెచ్ ఆవరణలో వినూత్న తరహాలో ప్లకార్డులతో నిరసన తెలియజేసిన జూడాలు, అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఇదిలా ఉండగా, సాయంత్రం స్థానిక గాంధీ పార్కులో మోకాళ్లపై నిలబడి ప్ల కార్డులతో వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జూడా సంఘం నాయకులు మాట్లాడుతూ దోషులను కఠినంగా శిక్షించే వరకు ఆందోళన విరమించేది లేదని తెలిపారు. వైద్యరంగ రక్షణ కోసం ప్రత్యేకమైన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు.

అన్యాక్రాంత భూములను స్వాధీనం చేసుకోవాలి

● మీ కోసంలో ఆర్డీవోకు సీపీఐ నేతల వినతి

కనిగిరి ఆగస్టు 19: కనిగిరి ప్రాంతంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, జీపీ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్‌కు భూముల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా వెంచర్ల వేయటంతో పాటు వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. అనుమతులు లేకుండా వెంచర్లు వేసి ప్రజలకు లక్షల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. మరికొందరైతే పేద లకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యవసాయే తర భూములుగా మార్చారన్నారు. ఈ భూముల్లో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించి స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఖాసీం వలి, బండి తిరుపాలు పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మ తల్లి కొలుపులు

మద్దిపాడు, ఆగస్టు 19: మద్దిపాడు గడియపూడి కాలనీ రజక సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంకమ్మతల్లి కొలుపులు ఘనంగా జరిగాయి. అంకమ్మ తల్లికి సాంప్రదాయం ప్రకారం పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున చీరె సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రజకసంఘ పెద్దల ఆధ్వర్యంలో జాతరను కోలాహలంగా నిర్వహించారు. అదేవిధంగా అంకమ్మ తల్లి కథాకాలక్షేపం భక్తులను అలరించింది. కొలుపులలో దాదాపు నాలుగు గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల ప్రక్షాళనలో జాప్యం

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నవైనం
- మెతక వైఖరి అవలంబిస్తున్న అధికారులు
- వారంరోజులకే మూతపడిన కొన్ని షాపులు

దర్శి, ఆగస్టు 19: రేషన్ డీలర్ల ప్రక్షాళన కార్యక్రమం దర్శి నియోజకవర్గంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కొంతమంది డీలర్లు ఇప్పుడు కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల ఈ నెలలో వారం రోజులకే అనేక రేషన్ షాపులు మూతబడ్డాయి. రేషన్ సరుకులు అందక కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవటంలో సంబంధిత అధికారులు మెతకవైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంతకాలం డీలర్ల నుంచి నెలసరి మామూళ్లు తీసుకున్న అధికారులు అక్రమాలు చేసిన డీలర్లపై చర్యలు తీసకునేందుకు జంకుతున్నారు. దీంతో కొంతమంది డీలర్లు యదేచ్ఛగా రేషన్ బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారు.

దర్శి నియోజకవర్గంలో 152 రేషన్ షాపులు ఉన్నాయి. అందులో 51 మంది రెగ్యులర్ డీలర్లు, 101 మంది తాత్కాలిక డీలర్లు ఉన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 60 మంది డీలర్లు రాజీనామాలు చేశారు. మిగిలిన తాత్కాలిక డీలర్లు అలాగే కొనసాగుతున్నారు. తమకు అధికారుల అండ ఉంటున్నందున ఇబ్బందిలేదనే ఉద్దేశంతో చలామణి అవుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు టీడీపీ సానుభూతి పరులైన డీలర్లను బలవంతంగా రాజీనామాలు చేయించారు. సక్రమంగా రేషన్ ఇస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారు. కొన్నిచోట్ల రెగ్యులర్ డీలర్లను కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారు. అందుకు సమ్మతించని రెగ్యులర్ డీలర్లు కొంతమంది కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈక్రమంలో అధికారులు ఉద్దేశపూర్వకంగా వారే బియ్యం నిల్వలు తెచ్చి షాపులో పెట్టి అక్రమకేసులు పెడుతుండటంతో, వారి అక్రమాలను అడ్డుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఇబ్బంది పెట్టిన అధికారులు ఇప్పుడు మాత్రం మీనవేషాలు లెక్కిస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారులు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగుతుండటంతో పాత డీలర్లపై ఉన్న మమకారంతో వారిపై చర్యలు తీసుకోవటం లేదు. తమకేమీ కాదనే ఉద్దేశంతో కొందరు డీలర్లు కార్డుదారులకు రేషన్ సక్రమంగా ఇవ్వకుండా నేరుగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. కొద్దిరోజుల తర్వాత అయినా ఎలాగూ తొలగిస్తారనే ఉద్దేశంతో మరికొందరు అలాగే అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరిగే విధంగా పర్యవేక్షించాల్సిన అధికారులు ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. అధికారులు, కొందరు డీలర్లు వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు అవాక్కవుతున్నా రు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటుతున్నా రేషన్ పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన జరగకపోవటం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్న డీలర్లపై టీడీపీ నాయకులు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. స్థానిక అధికారులు మెతక వైఖరి అవలంబిస్తుండటంతో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు ఇదే వైఖరి అవలంబిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

కేబుల్ వైర్లు చోరీ

ముండ్లమూరు, ఆగస్టు 19: మండలంలోని శంకరాపురం, పోలవరం గ్రామాల్లో రైతులకు చెందిన 30 మోటార్లకు సంబందించిన కేబుల్ వైర్లు చోరీ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. రెండు గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్ళి తమ మోటార్లు ఆన్ చేసేందుకు చూడగా వాటికి సంబందించిన కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. వీటి విలువ రూ.3 లక్షల మేర ఉంటుందని రైతులు తెలిపారు. ఇటీవల మండలంలోని పలుగ్రామాల్లో ట్రాన్స్‌ఫారాలు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతుండటంతో రైతులు నష్టపోతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పొమూరు, ఆగస్టు 19: మండలంలోని బొట్లగూడూరు గ్రామ శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.5,820 నగదు, ఐదు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. మండలంలో ఎవరైన చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

అలరించిన అష్టావధానం

కురిచేడు, ఆగస్టు 19: మండలంలోని బోదనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అష్టావధాని ఇలపావులూరి శేష శ్రీధరశర్మ సోమవారం అష్టావధానం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కడియం పాపారావు అధ్యక్షతన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అష్టావధానం జరిగింది. పృచ్ఛకులుగా బండా వేంకటక్రిష్ణ శాస్త్రి, డి.పావని, ప్రసాదరావు, శివకుమారి, ప్రసన్నాంజనేయులు, శ్రీనివాసులు, శరత్‌బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వేమా చిన్ననారయ్య, పొట్లపాడు జడ్పీ ఉన్న త పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంచాల బుల్లెమ్మ, విశ్రాంత తెలుగు పండిట్ సుబ్బారెడ్డి, జేబీ రామారావు పాల్గొన్నారు. పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి పాఠశాలకు 20 కుర్చీలు అంద జేశారు.

23న గ్రామ సభలు

పొమూరు, ఆగస్టు 19: జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద గ్రామాల్లో నూతన పనులను గుర్తించి తీర్మానాలు చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించినట్టు ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈనెల 23న అన్ని గ్రామ పంచాయతిల్లో గ్రామ సభలు నిర్వహించాలని సూచించినట్లు సురేష్ తెలిపారు.

సాగుకు ప్రతికూలత

- ఖరీఫ్‌ను వెంటాడుతున్న వర్షాభావం
- అదును దాటిపోతుందని రైతుల ఆందోళన

పీసీపల్లి, ఆగస్టు 19: ఖరీఫ్ సాగుకు ప్రతికూలత నెలకొంది. వర్షాభావం వెంటాడుతోంది. సీసీపల్లి మండలంలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 7,159హెక్టార్లు కాగా, ఇప్పటివరకు కేవలం 692 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. మిగిలిన 6,467 హెక్టార్లలో దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచారు. సుమారు 2,000 హెక్టార్ల వరకు భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. వర్షం పడుతుందనే ఆశతో తాజాగా మండలంలోని వివిధ గ్రామాల్లో 260హెక్టార్లలో రైతులు కంది సాగుకు సన్నద్ధమయ్యారు.

జూన్ నుంచి ఆగస్టు 15 వరకు కంది పంటను సాగుచేసేందుకు అనువుగా ఉంటుంది. ఈక్రమంలో ఇప్పటికే కంది సాగుకు అదును దాటిపోయిందని రైతులు అంటున్నారు. ఇప్పుడు వర్షాలు పడినా ప్రత్యామ్నాయ పైర్లు సాగుచేయాల్సిందే తప్ప కంది సాగుచేస్తే దిగుబడులు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు.


పడమటిపల్లి గ్రామంలో బీడుగా మారిన సాగుభూమి

సరిపడా చినుకు లేక..

ఈ ఏడాది భూములు పదునెక్కేలా సరైన అదునులో చినుకు రాల్లేదు. గత ఏడాదితో పోలిస్తే జూన్‌లో నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్ర వేశించినప్పటికీ అదునులో సరిపడా వర్ష పాతం నమోదు కాలేదు. ఆగస్టు నెలలో 80.5 మి.మీ. సాధారణ వర్షపాతం నమో దు కావాల్సి ఉండగా, 70.2మి.మీ. నమో దైంది. దీంతో పంటను సాగుచేయలేక పోయారు. జూలై నెలలో సాధారణం కం టే ఎక్కువ వర్షపాతం నమోదైనా పొలం దుక్కులు దున్నుకునేందుకే రైతులకు సమయం సరిపోయింది.

మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షం తేలికపాటి జల్లులకే పరిమితమైంది. ఈపరిస్థితు ల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేందుకైనా అవకాశం ఉంటుందా? అని రైతులు ఆందోళన చెందుతు న్నారు. వర్షాభావంతో మండలంలోని పలుగ్రామాల్లో బీడు భూములుగా దర్శన మిస్తున్నాయి.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

- డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు

తాళ్లూరు, ఆగస్టు 19: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు సోమవారం ఆత్మ సౌజన్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. పశువులకు నాణ్యమైన పశుగ్రాసం అందుతుందన్నారు. పంటల సాగుకు తక్కువ నీటి అవసరం ఏర్పడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు ఉన్నందున రైతులు ప్రకృతి సేద్యాన్ని పెద్దఎత్తున చేపట్టాలన్నారు. భూసార పరీక్షలు చేయించి సమతుల్య ఎరువులను వాడాలన్నారు. విచక్షణరహితంగా ఎరువులు, పురుగుల మందులు వాడొద్దని సూచించారు.

డీఆర్‌సీ టెక్నికల్ ఏవో ఏశైలజారాణి మాట్లాడుతూ రైతాంగం జీవనఎరువులను వాడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, డీఆర్‌సీ ఏవో వెంకటశేషమ్మ, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ పి.నరసింహులు, వీఏఏలు కె.సుమ, డి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు

వెంటనే మురుగు తొలగించండి

బల్లికురవలో పర్యటించిన జిల్లా పంచాయతీ అధికారి

బల్లికురవ, ఆగస్టు 19 : తక్షణమే మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు ఉన్న మురుగు నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన గ్రామాల్లో అటకెక్కిన పారిశుధ్యం వార్తపై కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ బల్లికురవ మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ముందు ఉన్న మురుగు నిల్వలను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలు లేకపోవడంవల్లే మురుగు నీరు నిల్వ ఉంటోందని, తక్షణమే రోడ్డు పక్కన కాలువలను తీయించి మురుగు నీరు లేకుండా చేయాలన్నారు. వారంరోజులపాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీలలో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, సర్పంచ్ పందిరి అంజిబాబు, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీవో రవికుమార్


ఎండిన పొగాకు మొక్కలు

వర్షాభావంతో ఎండుతున్న పొగాకు

- బోర్లలోనూ అడుగంటిన జలాలు
- నష్టాల్లో కూరుకుపోతున్న రైతన్నలు

మార్కాపురం రూరల్, ఆగస్టు 19: పశ్చిమ ప్రకాశంలో వర్షాభావంతో రైతులు సాగుచేసిన పొగాకు పంట నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో మార్కాపురం మండలంలో గత నెలలో కురిసిన చిరు జల్లులకు కొందరు రైతులు వారి భూములలో పొగాకు నారు నాట్లు వేశారు. వర్షం పడుతుందేమోనని ఆశగా అప్ప టి నుంచి ప్రతిరోజు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. వర్షాలు కురవకపోవడంతో బోర్లలో కూడా నీరు అడుగంటి పోయింది. దీంతో నీరు లేక నాటిన పొగాకు మొక్కలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. వేల రూపాయలు పెట్టుబడులు పెట్టి పొగాకు పంటను సాగు చేస్తే వర్షాలు పడక పోవడంతో నాటిన పది రోజులకే ఎండిపోయాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కాపురం మండలంలో ఏడాది మొత్తం 424 ఎకరాలలో రైతులు పొగాకు పంటను సాగు చేయడం ప్రారంభించారు. ముఖ్యంగా మండలంలోని గజ్జలకొండ గ్రామంలో 210, పెద్దయాచవరం ఇలాకాలో 50, నాయుడుపల్లి ఇలాకాలో 60, తిప్పాయపాలెం 60, చింతగుంట్ల 30 ఎకరాలలో పొగాకు పంటను సాగు చేశారు. పొగాకు నారు నాటి నప్పటి నుంచి వర్షాలు పడకపోవడంతో రైతు లు సాగుచేసిన పొగాకు పంట అధిక శాతం ఎండిపో యింది. పంట సాగు చేయడం కోసం ఎకరాకు సుమారు రూ.35వేల వరకు ఖర్చు అయినట్లు రైతులు తెలిపారు.

వర్షం వస్తుందని పొగాకు నాటాం

రెండున్న ఎకరాలలో 20 రోజుల కిందట చిన్నపాటి వర్షాలు పడడంతో పొగాకు నాటాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు వర్షాలు కురవలేదు. దీంతో నాటిన పొగాకు మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి. రెండున్నర ఎకరాలకు పొగాకు నారు కొనుగోలు ఖర్చు సుమారు రూ.45 వేలు అయ్యింది. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.


చిలక నాసర్‌రెడ్డి, పడమటిపల్లి, గజ్జలకొండ

ఎండిపోయిన పైర్లకు నష్టపరిహారం ఇవ్వాలి

వర్షాలులేక ఎండిపోయిన పొగాకు మొక్కలను ప్రభుత్వం పరిశీలించి నష్టపరిహారం అందించాలి. రెండున్న ఎకరాలలో పొగాకు మొక్కలను నాటా. వర్షాలు పడతాయని ఆశగా ఎదురుచూసినప్పటికీ వర్షాలు కురవలేదు. బోరు నీరు రాక మొక్కలు పూర్తిగా ఎండిపోయాయి.


ముక్కమళ్ల చెంచులక్ష్మీ, బోడపాడు

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి


విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన రవి

బేస్తవారపేట, ఆగస్టు 19 : విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన మండలంలోని గలిజేరు గుళ్ల పంచాయతీ పరిధిలోని శింగరిపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకొంది. ఓ రైతు చేనుకు కంచె ఏర్పాటు చేసుకోగా, మోటారుకు వెళ్లే సర్వీసు వైరు కంచెను తాకింది. దీంతో కంచెకు విద్యుత్ సరఫరా అయ్యింది. ప్రమాదవశాత్తు తీగను గొర్రెల కాపరి (18) తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే 2 గొర్రెలు కూడా మృతిచెందాయి. శింగరి పల్లి గ్రామానికి చెందిన రవి తండ్రి నారు సోమయ్య కేన్సర్ వ్యాధితో మృతిచెందగా భార్య రామలక్ష్మీ అనారోగ్యంతో మృతిచెందింది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. కాగా వీరు నాయనమ్మ దగ్గర ఉంటున్నారు. పెద్దకుమారుడు రవి 10వ తరగతి పూర్తి చేసుకుని రవి గొర్రెల కాపరిగా ఉంటూ విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుడి తమ్ముడు 10వ తరగతి చదువుతున్నాడు. తాను బతికుండగానే కొడుకును కోడలును పోగొట్టుకున్నానని, మనుమళ్లతో జీవిస్తున్నానని, చేతికంది వచ్చి తనను చూసుకుంటాడనుకున్న పెద్దమనుమడు విద్యుత్‌షాక్‌తో మృతిచెందాడని రవి నాయనమ్మ రామలక్ష్మమ్మ వాపోయారు. ఇక తనకు దిక్కెవరంటూ, చిన్నమనుమడి పరిస్థితి ఏమిటంటూ తల్లడిల్లిపోతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు బేస్తవారపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మా పొలాన్ని మాకివ్వండి

- తహసీల్దార్‌కు బాధితురాలి ఫిర్యాదు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నారిశెట్టి చిన్నమ్మి

కంభం, ఆగస్టు 19 : తమకు ప్రభుత్వం ఇచ్చిన భూమిని తిరిగి తమకు స్వాధీనం చేయాలని మండలం రావిపాడుకు చెందిన నారిశెట్టి చిన్నమ్మి సోమవారం స్పందనలో తహసీల్దార్ కిరణ్‌కు వినతిపత్రం అందచేశారు. తన భర్త నరసయ్య గ్రామంలో గతంలో తలారిగా పనిచేసేవారన్నారు. దీంతో ప్రభుత్వం 1988లో సర్వే నెంబరు 206/2లో ప్రభుత్వ బంజరు భూమి సుమారు 4.80 ఎకరాలకు సాగు పట్టా ఇచ్చిందన్నారు. అయితే నా భర్త 8 సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడన్నారు. తమ భూమిని కాజేయాలనే ఉద్దేశ్యంతో నాటి అధికారుల సహకారంతో అక్రమంగా ఆన్‌లైన్ చేయించుకున్నాడన్నారు. దీనిపై తాము ఫిర్యాదు చేయగా, ఆ భూమిని ప్రభుత్వ భూమిగా గుర్తిస్తూ బోర్డు పెట్టారన్నారు. అయితే తమకు ఉపాధిగా ఉన్న భూమి లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. తాము ఎంతో కష్టపడి బాగు చేసుకున్న బంజరు భూమిని తిరిగి తనకు స్వాధీనం చేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ కిరణ్ రికార్డులను తనిఖీ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

పొదిలి, ఆగస్టు 19 : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పొదిలిలో ఘనంగా నిర్వహించారు. పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి మండలాల ఫొటో, వీడియోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో సోమవారం కెమేరా సృష్టికర్త లూయిస్ డాగూరే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా శ్రీపతి నగర్ కాలనీలో ఉన్న 40 నిరుపేద కుటుంబాల వారికి దుప్పట్లు పంపిణీ చేశారు. నిరుపేదలను గుర్తించి ఇలాంటి సహాయం చేసినందుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ రావూరి శ్రీకాంత్, ట్రెజరర్ అశోక్, బాబు, ప్రసాద్, క్రిష్ణ, చినారికట్ల శ్రీను, షేక్ ఖాశిం, వినుకొండ శ్రీను, యద్దనపూడి బ్రహ్మం, తోట సుబ్బారావు, బసవయ్య తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

మార్కాపురం, ఆగస్టు 19: రెండు మోటారు సైకిళ్ల ఢీకొనడంతో ఇరువురికి గాయాలైన ఘటన సోమవారం సాయంత్రం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు, మండలంలోని కందివారిపల్లి గ్రామానికి చెందిన కందుల వెంకటేశ్వరరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు పట్టణానికి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. ఈ క్రమంలో ఎస్టేట్ సమీపంలోకి వచ్చే సరికి పక్కనే ఉన్న గల్లీలో నుంచి బైక్‌పై ఓ యువకుడు వేగంగా వచ్చి వెంకటేశ్వరరెడ్డి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టాడు. దీంతో భార్యభర్తలిద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనంలో క్షతగాత్రులను మార్కాపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థినులకు అవగాహన


విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్లు

మార్కాపురం రూరల్, ఆగస్టు 19: విద్యార్థినుల పట్ల ఎవరైన అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని సీఐ ఆవుల వెంకటేశ్వర్లు సూచించారు. మండలంలోని రాయవరం పంచాయతీ పరిధిలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థినులకు ప్రస్తుతం సమాజంలో పరిస్థితు లపై విద్యార్థులు ఎలా మెలగాలనే విషయంపై అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎవరైనా మీపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులకు విషయాన్ని తెలియజేయాలన్నారు. అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యుల అనుమతి లేకుండా తెలియని వారితో ప్రయాణం చేయకూడదని బాలికలకు వివరించారు.

గర్భిణీకి రక్తదానం

గిద్దలూరు, ఆగస్టు 19 : నంద్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో గర్భిణికి అత్యవసర పరిస్థితి ఏర్పడడంతో తాటిచెర్లమోటులో పనిచేస్తున్న విద్యుత్‌శాఖ ఉద్యోగి నక్కా రమేష్‌బాబును నంద్యాలకు పంపి రక్తదానం చేయించి ఆదుకున్నట్లు 'మేమున్నాము సేవా సమితి' అధ్యక్షులు చల్లా అశోక్‌రెడ్డి తెలిపారు.

ప్రేమానురాగాల మధ్య రాఖీ పౌర్ణమి



ఎమ్మెల్యే అశోక్‌రెడ్డికి రాఖీ కడుతున్న సోదరి గీత, మహిళలు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 19 : అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ప్రేమానురాగాలతో ఘనంగా నిర్వహించారు. చెల్లెళ్ళు తోడపుట్టిన అన్నదమ్ములకు రాఖీలు కట్టారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తు ముల అశోక్‌రెడ్డికి ఆయన సోదరి గీత రాఖీ కట్టి ఆశీర్వాదం తీసుకుని శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పట్టణంలోని మెప్మా కార్యాలయానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే ముత్తుముల నివాసానికి వెళ్లి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అన్నాచెల్లెలు అనుబంధానికి ప్రతీక అని, నియోజకవర్గంలోని ఆడపడుచులందరికీ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.


రాఖీలు కడుతున్న విద్యార్థులు

మార్కాపురం వన్‌టౌన్ : రాఖీపౌర్ణమిని పురస్కరించుకుని రక్షా బంధన్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. అన్నలకు చెల్లెల్లు, అక్కలు రాఖీలు కట్టారు. స్థానిక వాసవీ విద్యానికేతన్‌లో డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ కందెపు రంగయ్య ఆధ్వర్యంలో రక్షా బంధన్ ప్రాముఖ్యత, ఆవశ్యకత వివరించి ఒకరికొకరికి రాఖీలు కట్టించారు. పురాణాలలో వివరాలను వెల్లడించి 'నేను నీకు రక్షా.. నువ్వు నాకు రక్షా.. మనం దేశానికి రక్షా' అనే నినాదాలతో కంకణాలను కట్టారు. ప్రతి విద్యార్థి సహాయ సహకార గుణాలు కలిగి ఉండాలని ఆపద సమయంలో ఆదుకోవాలని రంగయ్య అన్నారు.

క్రీడాకారులకు ఎంపీ మాగుంట ప్రోత్సాహం

31 క్రికెట్ టీంలకు కిట్లు పంపిణీ


క్రికెట్ కిట్‌లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 19 : ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసరెడ్డి క్రీడలకు ప్రోత్సాహం ఇస్తున్నారని టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు అన్నారు. నియోజకవర్గంలో 31 క్రికెట్ టీంలకు క్రికెట్ కిట్లు సోమవారం ఎర్రగొండపాలెంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నెలలో ఒంగోలులో జరిగిన ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ స్థాయి క్రికెట్ లీగ్ పోటీలలో ఎర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి 31 టీంలు పాల్గొన్నాయన్నారు. పాల్గొన్న 31 టీంలకు క్రికెట్ కిట్లను ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి పేరున స్థానిక టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, నియోజకవర్గంలో ద్వితీయశ్రేణి టీడీపీ నాయకులు శనగా నారాయణరెడ్డి, బీవీ.సుబ్బారెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, చెవులు అంజయ్య, షేక్ మస్తాన్‌వలి, కొత్త భాస్కర్, పోక వెంకటసుబ్బయ్య, పి.రసూల్ ఖాన్, గుంటి.రాము, నిమ్మల ఈదన్న పాల్గొని పంపిణీ చేశారు. క్రీడలను ప్రోత్సహిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

వైభవంగా లక్ష బిల్వార్చన, నవధాన్యార్చన పూజలు

త్రిపురాంతకం, ఆగస్టు 19: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం త్రిపురాంతకేశ్వరస్వామి, శ్రీబాలాత్రిపుర సుందరీ దేవి అమ్మవారి ఆలయాలలో శ్రావణ పౌర్ణమి పూజలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు విశ్వన్నారాయణ, పాలంక ప్రసాదశర్మల ఆధ్వర్యంలో త్రిపురాంతకేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన అమ్మ వారి ఆలయంలో సామూహిక నవధాన్యార్చన నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాలలో ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


లక్ష్మి, పద్మావతి సమేత వేంకటేశ్వరుడు


లక్ష బిల్వార్చనలో పాల్గొన్న భక్తులు

వైభవంగా వేంకటేశ్వరుని కళ్యాణం

మార్కాపురం వన్‌టౌన్ : మార్కాపురంలోని శివాజీనగర్‌లో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ఆలయంలో కనులపండువగా కళ్యాణం నిర్వహించారు. స్వామి జన్మనక్షత్రం, శ్రవణానక్షత్రం పురస్కరించుకుని అర్చకులు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ, పూజలు నిర్వహించి కళ్యాణ ఘట్టాలు నిర్వహించారు.

వెలిగొండపై మాట్లాడే అర్హత జగన్‌రెడ్డికి లేదు

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు


విలేకర్లతో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 19 : వెలిగొండప్రాజెక్టును గురించి మాట్లాడే అర్హత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తి చేయకుండా, పూర్తయినట్లు ఎన్నికల ముందు తూతూమంత్రంగా నాటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించాడన్నారు. తద్వారా పశ్చిమ ప్రకాశం ప్రజలను మోసం చేశాడన్నారు. ట్విట్టర్‌లో వెలిగొండ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు ఆర్&ఆర్ ప్యాకేజీ ఇవ్వమని నీతులు చెప్పే అర్హత లేదని అన్నారు. 2019ఎన్నికల ముందు ఆర్&ఆర్ ప్యాకేజి ఒక కుటుంబానికి 18 లక్షలు ఇస్తానని చెప్పి అధికారంలోకి ఐదేళ్ల భూ నిర్వాసితులను జగన్‌రెడ్డి నిలువునా మోసం చేశాడన్నారు. వెలిగొండప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం జలవనరుల శాఖ గెజిట్‌లో చేర్చమని చెప్పిన నీవు నిర్లక్ష్యం చేస్తే, ప్రతిపక్షంలో ఉన్న మేము అప్పటిలో డిల్లీ వెళ్లి గెజిట్‌లో చేర్పించామని అన్నారు. ఎన్నికల్లో పార్టీని గెలిపించుకోలేని జగన్మోహన్‌రెడ్డికి వెలిగొండప్రాజెక్టు గురించి మాట్లాడే అర్హత లేదని ధ్వజంమెత్తారు. ఈ సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షులు చేకూరి సుబ్బారావు, టీడీపీ ద్వితీయ శ్రేణినాయకులు శనగా నారాయణరెడ్డి, చిట్యాల వెంగళరెడ్డి, కంచర్ల సత్యనారాయణగౌడ్, మంత్రునాయక్, మస్తాన్ వలి, నాగరాజు చలమయ్య, పాల్గొన్నారు.

పంటల ఉత్పాదకత పెంచాలి : ఏవో

గిద్దలూరు టౌన్, ఆగస్టు 19 : కొర్ర, సజ్జ, కంది, మొక్కజొన్న మొదలైన పంటల సుస్థిరమైన ఉత్పత్తి, ఉత్పాదకత పెంచుట పౌష్టికాహార భద్రత అని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పాముల పల్లె గ్రామంలో ఆహారం, పోషకాహార భద్రతలో భాగంగా రైతులు సాగు చేసిన కొర్ర పంటను క్లస్టర్ డెమో కార్యక్రమాన్ని నిర్వహిం చారు. నేల సారవంతం, పునరుద్దరణే ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. వివిధ రకాలైన వైవిధ్యమైన పంటలు పండించి రైతుల ఆదాయ వనరులు పెంపొం దించడానికి సాంకేతికత పరిజ్ఞానం పెంపొందించడానికి సమగ్ర పంటల యాజమాన్యం, ప్రాసెసింగ్ పద్దతులు అవలంభించడం వలన రైతుల నికర ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఖాశిం, సుభాని పాల్గొన్నారు.

జాతీయస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు దోర్నాల విద్యార్థులు


జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెద్దదోర్నాల, ఆగస్టు 19: జాతీయ స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు దోర్నాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ నారాయణ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విజయాన్ని ఆహ్వానిస్తూ నిర్వహించిన అభినందన సభలో హెచ్‌ఎం నారాయణ రెడ్డి మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జూలై 28న నంద్యాలలో అండర్-14, 17 కేటగిరిలో నిర్వహించిన జంప్‌రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటి ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు. స్వర్ణం, రజిత పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. ఎం విజయలక్ష్మీ, షేక్ అ ౦ ు ఎ ా (గోల్‌మెడల్), కే కృష్ణవేణి సిల్వర్, జీ.రిషి రజితం సాధించడంతో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జాతీయ స్థాయి పోటీలు సెప్టెంబరు 12నుండి 14 వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరగనున్నాయన్నారు. అక్కడ కూడా రాణించాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థుల విజయం కోసం కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయులు పీ రామానాయక్, హెచ్ రామానాయక్‌లను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది నాగమూర్తి, విజయమాణిక్యం, అనసూయ, కిరణ్‌కుమార్, పోలయ్య, చంద్రమౌళి,మహేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

భగీరథ మహర్షి విగ్రహావిష్కరణ


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 19: స్థానిక తర్లుపాడు రోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురు నూతనంగా ఏర్పాటు చేసిన రాజర్షి భగీరథ మహర్షి విగ్రహాన్ని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సగర ఉప్పర భగీరథ వంశస్తుల సేవా సంఘం ఆధ్వర్యంలో ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శ్రమకు, పట్టుదలకు నిదర్శనమైన భగీరథుని విగ్రహం ఏర్పాటు చేయటం ద్వారా యువతకు స్ఫూర్తిని ఇచ్చిందన్నారు. జనసేన నియోజకవర్గ అధ్యక్షులు ఇమ్మడి కాశీనాథ్ మాట్లాడుతూ.. సగర సంఘం సేవా కార్యక్రమాలు అభినందనీయం అని వాటిని మరింత విస్తరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ ఇంఛార్జ్ కందుల రామిరెడ్డి, సగర సంఘం గౌరవ అధ్యక్షులు ఎస్.రమాకృష్ణ, అధ్యక్ష, కార్యదర్శులు కొప్పుల వెంకటేశ్వర్లు, ఎం.వీరాంజనేయులు, కోశాధికారి మట్టం వెంకటేశ్వర్లు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, శ్రీశైల సగరసత్రం అధ్యక్షుడు పి.కృష్ణయ్య, కర్నూలు జిల్లా నాయకుడు డాక్టర్ గిద్దయ్య, మల్లికార్జున, బాలశంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

గిద్దలూరు, ఆగస్టు 19 : పట్టణంలోని షరాఫ్ బజారులో టీస్టాల్ నడుపుకుంటున్న ఎం.శ్రీనివాసులు అనే చిరువ్యాపారి మృతిచెందాడు. అంత్యక్రియల నిమిత్తం పట్టణంలోని అమ్మవారిశాల కమిటీ రూ.6వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబీకులకు అందజేసింది. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ అధ్యక్షులు గర్రె సత్యనారాయణ, గౌరవాధ్యక్షులు వాడకట్టు రంగసత్యనారాయణ, కోశాధికారి రాచపూటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతపై విద్యార్థులకు అవగాహన


రక్త పరీక్షలు నిర్వహించి చికిత్స అందిస్తున్న వైద్యులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 19: మండలంలోని రాయవరం గ్రామం వద్ద ఉన్న గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రక్తహీనతపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గజ్జలకొండ పీహెచ్‌సీ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యులు కిషోర్‌కుమార్‌రెడ్డి, సాయిచరణ్‌లు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పాఠశాలలో విద్యార్థినీలకు రక్తపరీక్షలు నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ.. కిశోర బాలికలు రక్తహీనతకు గురైతే తరచూ జలుబు, దగ్గు, జ్వరం, నీరసం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. విద్యార్థినులు రక్తహీనత లేకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కస్తూర్బా పాఠశాలలో 191 మందికి, జ్యోతిరావు పూలే పాఠశాలలో 130 మందికి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాలలో 320 మందికి రక్తంలో హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వారికి తగిన చికిత్స అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో శ్రీకాంత్, హెల్త్ సూపర్‌వైజర్ టి.విమలమ్మ, పెద్దన్న, హెల్త్ అసిస్టెంట్ కాశయ్య, పీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులు అందజేత


ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న పిచ్చయ్య

గిద్దలూరు, ఆగస్టు 19 : రాచర్ల మండలం యడవల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ప్రతిభ ఉన్న విద్యార్థులకు యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మొర్రి పిచ్చయ్య ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతూ అత్యధిక మార్కులు సాధిస్తున్న విద్యార్థులకు పూర్వ విద్యార్థిగా ఉండి ప్రస్తుతం హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మొర్రి పిచ్చయ్య ప్రోత్సాహక బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ గౌసబాషా, విద్యాకమిటీ చైర్మన్ దుగ్గాని శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఉత్తమ డీఈకి ఘనసన్మానం


డీఈని సన్మానిస్తున్న సిబ్బంది

కంభం, ఆగస్టు 19 : తాను పని చేసే వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ రాష్ట్రమంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా చేతుల మీదుగా స్వాతంత్ర్యదినోత్సవం రోజున ఉత్తమ అధికారిగా అవార్డు పొందిన కంభం ఇరిగేషన్ డీఈ జాకీర్‌అహమ్మద్‌ను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఇరిగేషన్ జేఈ రామారావు మాట్లాడుతూ అంకిత భావంతో పనిచేస్తున్న డీఈ జాకీర్‌అహమ్మద్ కృషిని గుర్తించిన జిల్లా అధికారులు ఉత్తమ అధికారిగా అవార్డు, ప్రశంసపత్రం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. జాకీర్‌అహ్మద్ మాట్లాడుతూ కార్యాలయంలోని అందరి సహకారం వల్లనే తనకు ఈ గౌరవం దక్కిందన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

- ఉచిత వైద్యశిబిరంలో 128 మందికి వైద్యపరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ కోటేనాయక్

ఎర్రగొండపాలెం, ఆగస్టు 19 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అంటువ్యాధులు దూరంగా ఉంటాయని వెంకటాద్రిపాలెం వైద్యాధికారి కోటేనాయక్ అన్నారు. మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో ఉచిత వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 128 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పి వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 19 : కోల్‌కత్తా ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలిని అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం మానవ హారంగా ఏర్పడి నిందితుడికి విచారణ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

ప్రేమానురాగాలకు ప్రతిరూపం రక్షాబంధన్

పామూరు, ఆగస్టు 19: సోదర ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే రక్షాబంధన్ సంప్రదాయమైన విలువలకు మరింత ఉట్టిపడేలా చేస్తుంది. రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా చిన్నా, పెద్దా తేడా లేకుండా సోదరులకు రాఖీ కట్టి దీవెనెలు పొందారు. మానవతా విలువలు మంటగలుస్తున్న నేటి ఆధునిక యుగంలో రాఖీ పౌర్ణమి తన విశిష్టతను చాటుతూ సోదర ప్రేమ పటిష్టతను తెలియచేస్తుందని పలువురు తెలిపారు. రాఖీ పౌర్ణమి రోజున అక్కా చెల్లెళ్ల తమ అన్నదమ్ముల నుదుటన తిలకం దిద్ది, చేతికి రక్షాబంధన్‌ను కట్టి మిఠాయిలు తినిపించారు. గతంలో హిందువులు మాత్రమే జరుపుకొనే ఈ వేడుకలను ఇప్పుడు ముస్లింలు సైతం జరుపుకొంటూ అందరితో ఆనందం పంచుకోవడం విశేషం.


దొనకొండలో అన్నకు రాఖీ కడుతున్న చెల్లెలు

దొనకొండలో.. దొనకొండ, ఆగస్టు 19: రక్షాబంధన్ వేడుకలను మండలంలో సోమవారం ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ప్రతి ఇంట్లో సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి సోదరుల ఆశీస్సులు పొంది ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఇళ్లల్లో సందడి వాతావరణం నెలకొంది.

కనిగిరిలో.. కనిగిరి, ఆగస్టు 19: రాఖీపౌర్ణమి వేడుకలు సోమవారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఐకిడ్స్ స్కూల్‌లో చిన్నారులకు రాఖీపండుగ విశిష్టతను తెలియచేసేలా రక్షాబంధన్ కార్యక్రమంలో సోదరీసోదరుల మధ్య ఉండే ఆప్యాయతలను ఉపాధ్యాయినులు వివరించారు. ఈసందర్భంగా చిన్నారులు చేసిన నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు జబీన, చాంద్‌తార, ఉషా, పూజిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

దొనకొండ ఎస్‌ఐగా విజయ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్

దొనకొండ, ఆగస్టు 19: దొనకొండ ఎస్‌ఐగా కె.విజయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. తాళ్ళూరు ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ దొనకొండకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. పేకాట, బెట్టింగులు తదితర అసాంఘిక కార్యకలాపాలను అరికడతామని చెప్పారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్‌ను పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

విద్యుత్ మోటార్ చోరీ

కురిచేడు, ఆగస్టు 19: కురిచేడులోని నమఃశ్శివాయపురం రోడ్డులో సబ్‌స్టేషన్‌కు సమీపంలో కమలాకరరావు అనే రైతుకు చెందిన విద్యుత్ మోటారు చోరీకి గురైంది. ప్రస్తుతం పంటలు సాగు చేస్తున్నందున మోటారు అవసరం ఎక్కువగా ఉంది. ఈక్రమంలో విద్యుత్ మోటార్ చోరీకి గురికావడంతో ఆందోళన వ్యక్తం చేశారు.

నాగార్పమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

పామూరు, ఆగస్టు 19: మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో నూతనంగా నాగార్పమ్మతల్లి దేవస్థాన నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశా రు. టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు పాల్గొని భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పువ్వాడి జయమ్మ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు పునాటి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు, పువ్వాడి వెంకటేశ్వర్లు, సిద్ధయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్‌లకు ప్రాధాన్యమివ్వాలి


మాట్లాడుతున్న ఎంఈవో కొండారెడ్డి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 19: ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో కిచెన్ గార్డెన్‌లను పెంచడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంఈవో రాజాల కొండారెడ్డి సూచించారు. సోమవారం జరిగిన డీజీపేట, సీఎస్‌పురం స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు, స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యుల సహకారంతో కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయన్నారు. శ్రమదానం కింద మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. విద్యార్థులకు ఈనెల 27 నుంచి ఫార్మాటివ్ పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్లు ఎస్‌కే ఖాదరున్నీసా బేగం, జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు జాతీయ నులిపురుగుల దినోత్సవం

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 19: జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు మింగించాలని ఎంఈవో ఆర్.కొండారెడ్డి తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 ఏళ్ల లోపు వారందరికి 20, 28 తేదీల్లో నులి పురుగుల మాత్రలు వేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యాభివృద్ధికి కృషి చేయాలి

తాళ్లూరు, ఆగస్టు 19: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు పాటుపడాలని ఎంఈవో-2 ఎల్.సుధాకర్‌రావు అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ కార్యక్రమాల గురించి చర్చించారు. సమావేశంలో ఆర్పీలు కె.శేషు, కె.చంద్రిక, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పి.సుబ్బారావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్లు చోరీ

ముండ్లమూరు, ఆగస్టు 19: మండలంలోని శంకరాపురం, పోలవరం గ్రామాల్లో రైతులకు చెందిన 30 మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లు చోరీ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. రెండు గ్రామాలకు చెందిన రైతులు పొలాలకు వెళ్ళి తమ మోటార్లు ఆన్ చేసేందుకు చూడగా వాటికి సంబంధించిన కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

వీటి విలువ రూ.3 లక్షల మేర ఉంటుందని రైతులు తెలిపారు. ఇటీవల మండలంలోని పలుగ్రామాల్లో ట్రాన్స్‌ఫారాలు, కేబుల్ వైర్లు చోరీకి గురవుతుండటంతో రైతులు నష్టపోతున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పామూరు, ఆగస్టు 19: మండలంలోని బొట్టగూడూరు గ్రామ శివారులో సోమవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఇన్‌చార్జ్ ఎస్‌ఐ బి.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వారి నుంచి రూ.5,820 నగదు, ఐదు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. మండలంలో ఎవరైన చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.

తహసీల్దార్‌కు సన్మానం

పామూరు, ఆగస్టు 19: పామూరు నూతన తహసీల్దార్ బీవీ రమణారావును స్వయం కృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా తమ సంస్థ ద్వారా చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. మొక్కలు నాటడం, బాలకార్మిక వ్యవస్థపై అవగాహన ర్యాలీ, పారా లీగల్‌గా న్యాయసలహాలు, బాల్యవివాహాలపై అవగాహన తదితర సేవా కార్యక్రమాల గురించి వివరించారు.

భక్తి శ్రద్ధలతో హోమాలు

పామూరు, ఆగస్టు 19: మండలంలోని ఇనిమెర్ల గ్రామంలో శ్రీరామచంద్ర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రెండో రోజు పలుకార్యక్రమాలు నిర్వహించారు. ఆదిత్యాది నవగ్రహ, అభిషేకాలు, హోమాలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లూరు ఎస్‌ఐగా మల్లికార్జునరావు

తాళ్లూరు, ఆగస్టు 19: తాళ్లూరు ఎస్‌ఐగా ఎస్.మల్లికార్జునరావును నియమిస్తూ జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఉత్తర్వులు జారీచేశారు. వీఆర్‌లో ఉన్న ఆయనను తాళ్లూరుకు బదిలీ చేశారు. రెండున్నర నెలలుగా ఇక్కడ అటాచ్డ్ ఎస్‌ఐగా పనిచేస్తున్న కె.విజయ్‌కుమార్‌ను దొనకొండకు బదిలీ చేశారు.

సాగుకు ప్రతికూలత

- ఖరీఫ్‌ను వెంటాడుతున్న వర్షాభావం
- అదును దాటిపోతుందని రైతుల ఆందోళన


పడమటిపల్లి గ్రామంలో బీడుగా మారిన సాగుభూమి

పీసీపల్లి, ఆగస్టు 19: ఖరీఫ్ సాగుకు ప్రతికూలత నెలకొంది. వర్షాభావం వెంటాడుతోంది. పీసీపల్లి మండలంలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 7,159హెక్టార్లు కాగా, ఇప్పటివరకు కేవలం 692 హెక్టార్లలో మాత్రమే పంటలు సాగయ్యాయి. మిగిలిన 6,467 హెక్టార్లలో దుక్కులు దున్ని సిద్ధంగా ఉంచారు. సుమారు 2,000 హెక్టార్ల వరకు భూములు బీళ్లుగా దర్శనమిస్తున్నాయి. వర్షం పడుతుందనే ఆశతో తాజాగా మండలంలోని వివిధ గ్రామాల్లో 260 హెక్టార్లలో రైతులు కంది సాగుకు సన్నద్ధమయ్యారు.

జూన్ నుంచి ఆగస్టు 15 వరకు కంది పంటను సాగుచేసేందుకు అనువుగా ఉంటుంది. ఈక్రమంలో ఇప్పటికే కంది సాగుకు అదును దాటిపోయిందని రైతులు అంటున్నారు. ఇప్పుడు వర్షాలు పడినా ప్రత్యామ్నాయ పైర్లు సాగుచేయాల్సిందే తప్ప కంది సాగుచేస్తే దిగుబడులు రావని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సరిపడా చినుకు లేక..

ఈ ఏడాది భూములు పదునెక్కేలా సరైన అదునులో చినుకు రాల్లేదు. గత ఏడాదితో పోలిస్తే జూన్‌లో నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించినప్పటికీ అదునులో సరిపడా వర్షపాతం నమోదు కాలేదు. ఆగస్టు నెలలో 80.5 మి.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 70.2మి.మీ. నమోదైంది. దీంతో పంటను సాగుచేయలేకపోయారు. జూలై నెలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైనా పొలం దుక్కులు దున్నుకునేందుకే రైతులకు సమయం సరిపోయింది.

మండలంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల కురిసిన వర్షం తేలికపాటి జల్లులకే పరిమితమైంది. ఈపరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేందుకైనా అవకాశం ఉంటుందా? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాభావంతో మండలంలోని పలుగ్రామాల్లో బీడు భూములుగా దర్శనమిస్తున్నాయి.

రేషన్ డీలర్ల ప్రక్షాళనలో జాప్యం

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నవైనం
- మెతక వైఖరి అవలంబిస్తున్న అధికారులు
- వారంరోజులకే మూతబడిన కొన్ని షాపులు

దర్శి, ఆగస్టు 19: రేషన్ డీలర్ల ప్రక్షాళన కార్యక్రమం దర్శి నియోజకవర్గంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. గత ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కొంతమంది డీలర్లు ఇప్పుడు కూడా అదే తీరుగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల ఈ నెలలో వారం రోజులకే అనేక రేషన్ షాపులు మూతబడ్డాయి. రేషన్ సరుకులు అందక కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవటంలో సంబంధిత అధికారులు మెతకవైఖరి అవలంబిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంతకాలం డీలర్ల నుంచి నెలసరి మామూళ్లు తీసుకున్న అధికారులు అక్రమాలు చేసిన డీలర్లపై చర్యలు తీసకునేందుకు జంకుతున్నారు. దీంతో కొంతమంది డీలర్లు యథేచ్ఛగా రేషన్ బియ్యాన్ని దారి మళ్లిస్తున్నారు.

దర్శి నియోజకవర్గంలో 152 రేషన్ షాపులు ఉన్నాయి. అందులో 51 మంది రెగ్యులర్ డీలర్లు, 101 మంది తాత్కాలిక డీలర్లు ఉన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 60 మంది డీలర్లు రాజీనామాలు చేశారు. మిగిలిన తాత్కాలిక డీలర్లు అలాగే కొనసాగుతున్నారు. తమకు అధికారుల అండ ఉంటున్నందున ఇబ్బందిలేదనే ఉద్దేశంతో చలామణి అవుతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు టీడీపీ సానుభూతి పరులైన డీలర్లను బలవంతంగా రాజీనామాలు చేయించారు. సక్రమంగా రేషన్ ఇస్తున్న వారిపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెట్టారు. కొన్నిచోట్ల రెగ్యులర్ డీలర్లను కూడా రాజీనామా చేయాలని ఒత్తిడి తెచ్చారు. అందుకు సమ్మతించని రెగ్యులర్ డీలర్లు కొంతమంది కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. ఈక్రమంలో అధికారులు ఉద్దేశపూర్వకంగా వారే బియ్యం నిల్వలు తెచ్చి షాపులో పెట్టి అక్రమకేసులు పెడుతుండటంతో, వారి అక్రమాలను అడ్డుకునేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎంతో ఇబ్బంది పెట్టిన అధికారులు ఇప్పుడు మాత్రం మీనవేషాలు లెక్కిస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారులు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా కొనసాగుతుండటంతో పాత డీలర్లపై ఉన్న మమకారంతో వారిపై చర్యలు తీసుకోవటం లేదు. తమకేమీ కాదనే ఉద్దేశంతో కొందరు డీలర్లు కార్డుదారులకు రేషన్ సక్రమంగా ఇవ్వకుండా నేరుగా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. కొద్దిరోజుల తర్వాతయినా ఎలాగూ తొలగిస్తారనే ఉద్దేశంతో మరికొందరు అలాగే అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. రేషన్ పంపిణీ సక్రమంగా జరిగే విధంగా పర్యవేక్షించాల్సిన అధికారులు ఇంత జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. అధికారులు, కొందరు డీలర్లు వ్యవహరిస్తున్న తీరును చూసి ప్రజలు అవాక్కవుతున్నా రు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటుతున్నా రేషన్ పంపిణీ వ్యవస్థ ప్రక్షాళన జరగకపోవటం పట్ల ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. అడ్డగోలుగా వ్యవహరిస్తున్న డీలర్లపై టీడీపీ నాయకులు ఇప్పటికే ఫిర్యాదులు చేశారు. స్థానిక అధికారులు మెతక వైఖరి అవలంబిస్తుండటంతో జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు. అధికారులు ఇదే వైఖరి అవలంబిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

మహిళలకు భద్రత కల్పనలో ప్రభుత్వాలు వైఫల్యం


పామూరులో రాస్తారోకో చేస్తున్న మహిళలు

పామూరు, ఆగస్టు 19: మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందుతున్నాయని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సయ్యద్ షమ్మి ఆరోపించారు. కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి సీఎస్‌పురం రోడ్డు కూడలిలో సోమవారం రాస్తారోకో చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ని నిర్భయ చట్టాలు చేసినా మహిళలపై దాడులు, హత్యాలు, అత్యాచారాలు తగ్గడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.మాల్యాద్రి, జేవీవీ నాయకులు కె.శంకర్, జి.రమణయ్య, ఐద్వా మండల అధ్యక్షురాలు భానుమతి, షేక్ మదారమ్మ, ఖాదర్ ఉన్నీసా, మస్తాన్‌బీ, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.


దర్శిలో తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

దర్శిలో నిరసన ర్యాలీ

దర్శి, ఆగస్టు 19: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం దర్శిలో నిరసన ర్యాలీ చేశారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా డీవైఎఫ్‌ఐ నాయకుడు సందు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మహిళా డాక్టర్‌పై హత్యాచారం చేసిన నిందితులను అరెస్టు చేయకుండా పశ్చిమబెంగాల్ ప్రభుత్వం నిర్లక్ష్యవైఖరి అవలంబిస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలు, బాలికలపై రోజురోజుకు హత్యాచారాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అనంతరం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు పాల్, షేక్ పీరాసాహెబ్, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

- డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు



మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్‌రావు

తాళ్లూరు, ఆగస్టు 19: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రామ్మోహన్‌రావు పేర్కొన్నారు. మండలంలోని తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు సోమవారం ఆత్మ సౌజన్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. పశువులకు నాణ్యమైన పశుగ్రాసం అందుతుందన్నారు. పంటల సాగుకు తక్కువ నీటి అవసరం ఏర్పడుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు ఉన్నందున రైతులు ప్రకృతి సేద్యాన్ని పెద్దఎత్తున చేపట్టాలన్నారు. భూసార పరీక్షలు చేయించి సమతుల్య ఎరువులను వాడాలన్నారు. విచక్షణరహితంగా ఎరువులు, పురుగుల మందులు వాడొద్దని సూచించారు.

డీఆర్‌సీ టెక్నికల్ ఏవో ఏశైలజారాణి మాట్లాడుతూ రైతాంగం జీవనఎరువులను వాడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, డీఆర్‌సీ ఏవో వెంకటశేషమ్మ, ప్రకృతి సాగు ఇన్‌చార్జ్ పి.నరసింహులు, వీఏఏలు కె.సుమ, డి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూములను స్వాధీనం చేసుకోవాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

కనిగిరి ఆగస్టు 19: కనిగిరి ప్రాంతంలో అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను స్వాధీనం చేసుకోవాలని సీపీఐ నాయకులు గుజ్జుల బాలిరెడ్డి, జీపీ రామారావు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఇర్విన్‌కు భూముల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో అక్రమంగా వెంచర్ల వేయటంతో పాటు వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. అనుమతులు లేకుండా వెంచర్లు వేసి ప్రజలకు లక్షల్లో అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. మరికొందరైతే పేదలకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి వ్యవసాయేతర భూములుగా మార్చారన్నారు. ఈ భూముల్లో స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వ, అసైన్డ్ భూములను గుర్తించి స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఖాసీంవలి, బండి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్

- ఏడీఈ కె.పిచ్చయ్య

ముండ్లమూరు, ఆగస్టు 19: మండలంలోని రైతులకు తొమ్మిది గంటల పాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించటం జరుగుతుందని దర్శి డివిజన్ ట్రాన్స్‌కో ఏడీఈ కె.పిచ్చయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఉమామహేశ్వర అగ్రహారం సబ్ స్టేషన్‌ను సందర్శించారు. అధిక లోడును నివారించేందుకు ప్రత్యేకంగా మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కనెక్షన్‌ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేసి ట్రాన్స్‌ఫారాలు అందజేస్తామన్నారు. మండలంలో ఇప్పటికీ 45 ట్రాన్స్‌ఫారాలకు పైగా చోరీకి గురయ్యాయన్నారు. రైతులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వెంటనే ఎఫ్‌ఐఆర్ కాపీనీ తమకు అందజేసినట్లయితే ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తామన్నారు. నివాస ప్రాంతాలమీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలను వినియోగదారులు ఫిర్యాదు చేసినట్లయితే వెంటనే తొలగిస్తామని చెప్పారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు ప్రతినెలా క్రమంతప్పకుండా బిల్లులు చెల్లించాలన్నారు. చెల్లించని వారి కనెక్షన్‌లను తొలగిస్తామని చెప్పారు. మండలంలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ ఏ.వీరబ్రహ్మం, లైన్ ఇన్‌స్పెక్టర్ సాంబయ్య, లైన్‌మెన్‌లు ఆంజనేయులు, కోటేశ్వరరావు, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

దర్శి, ఆగస్టు 19: మహిళల ఆత్మగౌరవం, భద్రతకు టీడీపీ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఎన్నో మహిళాభ్యుదయ పథకాలు అమలు చేస్తుందని ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం ఓ ప్రకటన విడుదలచేశారు. తెలుగుదేశం ఆవిర్భావం నుంచి మహిళాభ్యున్నతే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. మహిళలకు ఎన్టీఆర్ ఆస్తిహక్కు కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మహిళల అభ్యున్నతి కోసం సీఎం చంద్రబాబు 20 ఏళ్ల క్రితమే డ్వాక్రా సంఘాలు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. నియోజకవర్గ ప్రజలకు ఆమె రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. అన్నా చెల్లెళ్ళ అనుబంధానికి ప్రతిరూపంగా నిలిచిందన్నారు. నియోజకవర్గ మహిళల అభ్యున్నతి కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని డాక్టర్ లక్ష్మి పేర్కొన్నారు.

అలరించిన అష్టావధానం

కురిచేడు, ఆగస్టు 19: మండలంలోని బోదనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అష్టావధాని ఇలపావులూరి శేష శ్రీధరశర్మ సోమవారం అష్టావధానం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు కడియం పాపారావు అధ్యక్షతన పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో అష్టావధానం జరిగింది. పృచ్ఛకులుగా బందా వేంకటకృష్ణ శాస్త్రి, డి.పావని, ప్రసాదరావు, శివకుమారి, ప్రసన్నాంజనేయులు, శ్రీనివాసులు, శరత్‌బాబు వ్యవహరించారు.

కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వేమా చిన్ననాసరయ్య, పొట్లపాడు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంచాల బుల్లెమ్మ, విశ్రాంత తెలుగు పండిట్ సుబ్బారెడ్డి, జేబీ రామారావు పాల్గొన్నారు. పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పాఠశాలకు 20 కుర్చీలు అందజేశారు.

23న గ్రామ సభలు

పామూరు, ఆగస్టు 19: జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద గ్రామాల్లో నూతన పనులను గుర్తించి తీర్మానాలు చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించినట్టు ఎంపీడీవో బి.సురేష్ తెలిపారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈనెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని సూచించినట్లు సురేష్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పీసీపల్లి ఎంపీడీవో కేతు శ్రీనివాసులరెడ్డి, ఈవోపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈలు పాల్గొన్నారు.

ఉపాధి పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభలు నిర్వహించి పంచాయతీల ద్వారా తీర్మానాలు ఆమోదింప చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి సూచించినట్టు ఎంపీడీవో సురేస్ తెలిపారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

టంగుటూరు, ఆగస్టు 19: టంగుటూరులోని పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు మాట్లాడుతూ ఇక్కడ ప్రభుత్వపరంగా మధ్యాహ్న భోజనానికి అవకాశం లేకున్నా విద్యార్థుల పరిస్థితులను అర్థం చేసుకొని కొనసాగిస్తున్నామన్నారు. ఇందుకు దాతల సహకారం అభినందనీయమన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపాల్ చక్రపాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విద్యాదాతలు చిడిపోతు వెంకటేశ్వర్లు, కరవది సుబ్బారావు, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వైభవంగా దక్షిణామూర్తి, కాలభైరవ విగ్రహాల ప్రతిష్ఠ

టంగుటూరు, ఆగస్టు 19: టంగుటూరు శివాలయం ప్రాంగణంలో దక్షిణామూర్తి, కాలభైర స్వామిల విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 6గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 8.47 గంటలకు దక్షిణామూర్తి, కాలభైరవ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. 11.45 గంటలకు మహాపూర్ణాహుతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఎండుకొబ్బరి, ఆవునెయ్యి, ఇతర సామగ్రి తెచ్చుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం 12గంటల నుంచి అన్న సంతర్పణ జరిగింది. ప్రముఖ వ్యాపారి బెల్లం కోటయ్య, బెల్లం జయంత్‌బాబు, మక్కెన హరిబాబులు సతీసమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


నాచు, జమ్ము పేరుకుపోయిన తాగునీటి చెరువు



జాడలేని కుళాయి!



ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని చెప్పిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు విస్మరించింది. పల్లెల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చేసరికి దారుణంగా విఫలమయ్యారు. జలజీవన్ మిషన్ పథకం పనులను అటకెక్కించారు. ఐదేళ్లు పనులను సాగదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జలజీవన్ పథకంపై పల్లె ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికల ముందు కూటమి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా స్వచ్ఛజలం అందిస్తామని ఇచ్చిన హామీని అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించాల్సి ఉంది.


ఓవర్ హెడ్ ట్యాంక్

- అటకెక్కిన జలజీవన్ పథకం
- నీటి పథకాల పనుల సాగదీత
- పల్లెల్లో తాగునీటికి వెతలు
- నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
- మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
- కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షల గృహాలు
- కుళాయిల శాతం 43.66
- రాష్ట్రంలోనే చిట్ట చివరన పల్నాడు జిల్లా

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జల్ జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యంగా ఈ పథకం రూపొందించారు. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పల్నాడు జిల్లాలోని బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజకవర్గాలలోని అనేక గ్రామాలలో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు సేవిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్ జీవన్ పథకం లక్ష్యం. గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తికీ 40 లీటర్లు నీరు ఇచ్చే విధంగా రూపొందించారు. వీటి సామర్థ్యం పెంచాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన పనులను గుర్తించి చేపడుతున్నారు. 2019లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరు శాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని కేంద్రం సంకల్పించింది. ఇందుకు ఉమ్మడి జిల్లాలో రూ. 1021.38 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేశారు. కేంద్రం తన వాటాగా సుమారు రూ. 275 కోట్లు నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా సుమారు రూ. 105 కోట్లు విడుదల చేసింది. ఇంకా మిగతా నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయకపోవడం మిషన్ అమలులో జాప్యం జరుగు తోంది. నిధుల కొరత వెంటాడుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటి వరకు 4,51,267 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతున్నది. 43.68 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,637 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాలలో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామమాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపు లైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. అయితే పనులు ఇంకా నత్తనడకన సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.

బాపట్ల జిల్లాలో..

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 76,033 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాలో 1,48,325 గృహాలకు మాత్రమే కుళాయి కనక్షన్‌లు ఉన్నాయి. 19.82 శాతం నుంచి 40.64 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 2,16,463 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్‌లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ 205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి. 10 గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఇచ్చారు. అమృతలూరు మండలం కొరుతాడిపర్రు, ఇంకొల్లు మండలం భీమవరం, ఇడుపులపాడు, జే పంగులూరు మండలం చందలూరు, నూజెళ్లపల్లి, రామకుర్రు, కారంచేడు మండలం కుంకలమర్రు, పర్చూరు మండలం అడుసుమల్లి, యద్దనపూడి మండలం వింజనంపాడు గ్రామల్లో మాత్రమే నూరు శాతం ఇళ్లకు కుళాయి కనెక్షన్‌లు ఇచ్చినట్టు అధికారులు తెలిపారు.

పల్నాడు జిల్లాలో ..

పల్నాడు జిల్లాలోని గ్రామాలలో 4,34,399 గృహాలు ఉన్నాయి. జల్ జీవన్ పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించిన్పటి నుంచి ఇప్పటి వరకు 87,052 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,218 గృహాలకు కుళాయిలు ఉండగా ఇంకా 2,89,328 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. 33.43 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో రాష్ట్రంలోనే పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గుర్తించారు. ఇందుకు సంబంధించి రూ 508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు. కేవలం 13 గ్రామాల్లోనే నూరు శాతం గృహాలకు కుళాయిల కనెక్షన్ ఉన్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వెల్లడించింది. అమరావతి మండలం జూపూడి, చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు, కుక్కపల్లి వారిపాలెం, పొతవరం, తాతపూడి, వేలూరు, యడ్లపాడు మండలం సందెపూడి, సొలస, మాచవరం మండలం చెన్నాయపాలెం, నాదెండ్ల మండలం చిరుమావిళ్ల, రెంటచింతల, వినుకొండ మండలం విఠంరాజు పల్లి గ్రామల్లో నూరు శాతం కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయని అధికారులు తెలిపారు.


జలజీవన్ మిషన్ పథకం పైపులు

గుంటూరు జిల్లాలో ...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటి వరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్‌లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతంకు కుళాయిల సంఖ్య పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కనెక్షన్‌లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి. ఈ గ్రామల్లో నూరు శాతం కుళాయిలు ఉన్నట్టు అధికారులు తెలిపారు. చేబ్రోలు మండలం గొడవర్రు, కాకుమాను మండలం బీకేపాలెం, బోడిపాలెం, గరికపాడు, పాండ్రపాడు, రేటూరు, అన్నవరం, బొమ్మువానిపాలెం, కుంచవరం, మంగళగిరి మండలం కృష్ణాయపాలెం, పెదకాకాని మండలం అనమర్లపూడి, తక్కెళ్లపాడు, తంగెళ్లమూడి, వెనిగండ్ల, పెదనందిపాడు మండలం కొప్పర్రు, పొన్నూరు మండలం దొప్పలపూడి, జెడవల్లి, ప్రత్తిపాడు మండలం గొట్టిపాడు, కొండవీడు, తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం, మల్కాపురం, వెలగపూడి, వట్టిచెరుకూరు మండలం కొవెలమూడి, కుర్నూతల, వట్టిచెరకూరు, యామర్రు గ్రామాల్లో ఇంటింటికి కుళాయి నీరు సరఫరా అవుతోందని సదరు అధికారులు తెలిపారు.

పోషణ కష్టాలు



- అంగన్వాడీలకు ఆగిన సరుకుల సరఫరా
- జులై నెలలో సగం కేంద్రాలకే కందిపప్పు
- మూడో వంతు కేంద్రాలకు ఆగిన పామాయిల్
- సగం కేంద్రాలతో సరిపుచ్చిన పౌర సరఫరాల శాఖ
- వైసీపీ నిర్వాకంతో కుదేలైన పౌర సరఫరాల కార్పొరేషన్
- ఇప్పటికే దెబ్బతిన చౌక సరుకుల పంపిణీ
- తాజా పరిస్థితులతో అంగన్వాడీలపైనా తీవ్ర ప్రభావం

గుంటూరు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ నిర్వాకంతో నిర్వీర్యమైన వ్యవస్థల జాబితాలో తాజాగా అంగన్వాడీ కేంద్రాలు కూడా చేరుతున్నాయి. అర్థాకలి జీవితాలు గడిపే పేద సాద తల్లులు, పిల్లల ఆకలి తీర్చి పోషణనిచ్చే అంగన్వాడీ కేంద్రాలు నేడు పోషణ కరువై అల్లాడుతున్నాయి. అంగన్వాడీలకు రావాల్సిన సరుకులు రాక మళ్లీ అదే అర్థాకలితో తల్లులు, పిల్లలు అగచాట్లు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకు కారణం పౌర సరఫరాల శాఖ కుదేలైపోవడమే కారణంగా తెలుస్తోంది.

● కందిపప్పు కనుమరుగు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 23 కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం 4,405 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని 50 వేల మంది గర్భిణులు, 55వేల మంది బాలింతలు, లక్షా 10 వేల మంది మూడేళ్లలోపు చిన్నారులు, లక్షా 32వేల మంది 3 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు వీటిద్వారా ప్రతినెలా పోషకాహారాన్ని అందిస్తున్నారు. పోషణ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రతినెలా 5 లీటర్ల పాలు, 25 గుడ్లు, కిలో కందిపప్పు, 3 కిలోల బియ్యం, అరలీటరు మంచినూనె అందిస్తారు. వీటితోపాటు బాపట్ల జిల్లాలో భాగమైన చీరాల డివిజన్లో మరో వెయ్యి అంగన్వాడీ కేంద్రాలు వున్నాయి వీటిలో సుమారు లక్షమంది బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పోషణ పొందుతున్నారు. ప్రస్తుతం వారిలో సగం మందికి ఈనెల కందిపప్పు, మూడింట ఒక వంతు మందికి పామాయిల్ అందలేదు.

● గుంటూరు జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలకు 24,418 కిలోల కందిపప్పును అందించాల్సి వుండగా, 8,817 కిలోల కందిపప్పు మాత్రమే అందజేశారు. అరకిలో పామాయిల్ ప్యాకెట్లు 17,494 కేటాయించగా 15,560 ప్యాకెట్లు, ఒకలీటరు ప్యాకెట్లు 1,911కుగానూ 1,119 ప్యాకెట్లు మాత్రమే పంపిణీ చేయగలిగారు. పల్నాడు జిల్లాలో 34,990 కిలోల కందిపప్పుకుగానూ 27,885 కిలోల కందిపప్పును, 21,118 అరలీటరు పామాయిల్ ప్యాకెట్లకుగానూ 17,745 ప్యాకెట్ల పామాయిల్, 4,022 లీటర్ ప్యాకెట్లకుగానూ 1,792 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. బాపట్ల జిల్లాలో 20,845 కిలోల కందిపప్పుకుగానూ 18,799 కిలోలు, 13,378 పామాయిల్ అరలీటరు ప్యాకెట్లకుగానూ 10,379 ప్యాకెట్లు, 2,126 లీటరు ప్యాకెట్లకుగానూ 631 ప్యాకెట్లు మాత్రమే సరఫరా చేశారు. దీంతో మూడు జిల్లాలో వున్న సగం అంగన్వాడీ కేంద్రాల్లో ఈనెల గర్భిణులు, బాలింతలకు అందాల్సిన పోషణ అందలేదు.

● సంక్షోభంలో పౌర సరఫరాల కార్పొరేషన్

గత వైసీపీ ప్రభుత్వం పౌర సరఫరాల కార్పొరేషన్‌ను కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. కార్పొరేషన్‌పేరుతో వేల కోట్ల రూపాయల అప్పులు తెచ్చి సంస్థను నిర్వీర్యం చేసింది. దీంతో ప్రతి నెలా సరఫరా చేసి సబ్సిడీ సరుకులు సరఫరా కూడా చేయలేని దీనావస్థకు పౌర సరఫరాల శాఖ దిగజారింది. కూటమి ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపడుతున్నప్పటికీ సంక్షోభ తీవ్రత కారణంగా సరైన పరిష్కారం కూడా లభించని పరిస్థితి ఏర్పడింది. అన్ని విధాలుగా సంక్షోభంలో కూరుకుపోయిన పౌర సరఫరాల శాఖ గత రెండేళ్లుగా పేద ప్రజలకు చౌక డిపోల ద్వారా అందించాల్సిన కందిపప్పు, పామాయిల్‌ను కూడా అందించకుండా ఆపేసింది. ఇప్పుడు ఆ సంక్షోభం అంగన్వాడీ కేంద్రాలను చుట్టుముడుతోంది. వైసీపీ హయాంలో ఏడాది క్రితం ఇదే పరిస్థితి వుండగా ఎన్నికలకు రెండు మూడు నెలల ముందు నుంచి పరిస్థితి కొంత మెరుగుపడినట్లు కనిపించింది. తీరా చూస్తే అదే పరిస్థితి మళ్లీ పునరావృతమవుతోంది. ఈ పరిస్థితిని చక్కదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాం గం చర్యలు తీసుకోక పోతే అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ కార్య క్రమం పూర్తిగా నీరుగారి పోయే ప్రమాదం కనిపిస్తోంది.

అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

కలెక్టర్ జె.వెంకటమురళీ


ప్రజల వద్ద నుండి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ జె.వెంకటమురళీ, జేసీ సుబ్బారావు

బాపట్ల,ఆగస్టు 19 : బాధితులు నుంచి వచ్చిన అర్జీలు తక్షణమే నాణ్యతతో పరిష్కరించి మేలు జరిగేలా చూడాలని కలెక్టర్ జె వెంకటమురళీ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి అర్జీ దారులు తమ సమస్యలను పరిష్కరిచాలంటూ వినతిపత్రాల ద్వారా కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 91 అర్జీలు రాగా రెవెన్యూ సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్‌రికార్డ్స్, పోలీసు, సీపీ, డీసీఎల్, మార్కెటింగ్, పురపాలకశాఖ, నీటిపారుదల, గృహనిర్మాణం, చేనేత, దేవాదాయ, పంచాయతీరాజ్, స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలకు సంబంధించి నమోదయ్యాయని తెలిపారు. కలెక్టర్ తన పరిధిలో వాటికి అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి పరిశీలన, విచారణ చేయాలంటూ సంబంధితాధికారులకు పురమాయించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ప్రజాసమస్యలు పరిష్కరించటంలో అలసత్వం చేయరాదని అధికారులకు సూచనలు చేశారు. అర్జీదారులకు మీ పరిధిలో పరిష్కారం జరిగితే జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ఎందుకు వస్తారని కలెక్టర్ ప్రశ్నించారు. అర్జీదారుల సమస్యను సంతృప్తికర రీతిలో పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బీ సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాఖీ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉండవల్లిలో మంగళగిరి నియోజకవర్గానికి చెందిన తెలుగు మహిళల ఆధ్వర్యంలో మంత్రి లోకేశ్‌కు హారతి ఇచ్చి రాఖీలు కట్టారు. ప్రజాదర్బార్‌లోనూ లోకేశ్‌కు పలువురు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా అక్కా చెల్లెమ్మలకు మంత్రి నారా లోకేశ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.



మొక్కలు ఎక్కడ..?


● వాడరేవు, రామాపురం మధ్య రోడ్డుకు ఇరువైపుల కనిపించని గతంలో నాటిన మొక్కలు

- కాగితాలకే పరిమతమైన జగనన్న పచ్చతోరణం
- క్షేత్రస్థాయిలో కనిపించని వనాలు
- ఖర్చు ఘనం.. ఫలితం శూన్యం

చీరాల, ఆగస్టు 19 : జగనన్న పచ్చతోరణం పేరుతో గత ప్రభుత్వ హయాంలో మొక్కలను నాటి, సంరక్షించేందుకు చేపట్టిన ప్రక్రియ ప్రహసనంగా సాగింది. నాటిన మొక్కలు కాగితాలలో పదిలంగా ఉన్నాయి. అయితే క్షేత్ర స్థాయిలో ఒక్క మొక్క కనిపించడం లేదు. ఖర్చు ఘనం, ఫలితం శూన్యమని ప్రజలు పెదవి విరుస్తున్నారు. కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా గతంలో జరిగిన అక్రమాలను వెలికితీసి తగిన చర్యలు చేపట్టటంతో పాటు, అవసరమైనచోట మొక్కలు సంరక్షణ చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

కరిగిన నిధులు..కనిపించని మొక్కలు

ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చేసిన నిధుల వినియోగం భారీ స్థాయిలో ఉన్నాయి. కేటాయించిన నిధులు మంచుముక్కలా కరిగిపోయాయి. నాటిన మొక్కలు కనిపించడం లేదు. సక్రమంగా నాటకపోవడం, తరువాత సంరక్షణ లేకపోవడం అందుకు కారణం. వీటిపై చర్యలు చేపట్టాల్సిన అధికారులు కింద నుంచి పై స్థాయి వరకు మౌనంగా ఉన్నారు. నిధుల వినియోగంలో పారదర్శకత లేదు. అందరి భాగస్వామ్యం ఉండడమే అందుకు కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

మొక్కుబడిగా సోషల్ ఆడిట్

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పరిధిలో జరిగిన పనులకు సంబంధించి ఇటీవల ఆయా మండల కేంద్రాల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్‌లో డొల్లతనం వెల్లడైంది. కొన్నిచోట్ల జిల్లా అధికారులు ఆ చర్యలను సమర్థించడం విమర్శలకు తావిచ్చింది. తీరంలో చేపట్టిన పనులకు సంబంధించి విమర్శలు వెల్లువెత్తాయి. నాటిన మొక్కలు, తీసిన చెరువులు కనిపించకపోవడం అందుకు కారణం. ప్రాథమికంగా నర్సరీలలో మొక్కలను ఏపుగా పెంచాలి. ఆ తరువాత వర్షాలు సక్రమంగా ఉన్నపుడు గుంతలు లోతుగా తీయించి అవసరమైన మంచిమట్టిని జోడించి మొక్కలు నాటాలి. పశువుల నుంచి రక్షణకు కంచె ఏర్పాటు చేయాలి. తరువాత బెట్ట సమయాల్లో నీటి తడులు ఇవ్వాలి. ఇవన్నీ క్షేత్ర స్థాయిలో చేస్తున్నారా అంటే లేదనే సమాధానం వస్తోంది.

నాటిన మొక్కల్లో సగం బతికినా

నాటిన మొక్కల్లో సగం బతికినా జిల్లా అంతటా పచ్చదనం, ఆహ్లాదం గణనీయంగా ఉండేది. అయితే ఆ పరిస్థితి ఎక్కడా లేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. తమ ప్రాంతాల్లో, రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటిన తరువాత సంరక్షణ చర్యలు చేపట్టని అధికారులు, సిబ్బందిని ప్రశ్నించడంగానీ, సంరక్షణలో తాము భాగస్వాములు కావడంగానీ లేదు. ఎవరికి వారు వినియోగించే డబ్బు మనది కాదులే అనే భావనతో ఉండటమే మొక్కల పెంచే ప్రక్రియ రాజుగారి పాలల్లో నీళ్లుగా మారుతోంది. ఈ ప్రభుత్వమైనా గత చేతివాటాలను నియంత్రించి భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా టీడీపీ పాలన


సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

కొల్లూరు, ఆగస్టు 19 : సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా తమ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పేర్కొన్నారు. సోమవారం కొల్లూరులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని చెప్పారు. రోడ్లన్నీ అస్తవ్యస్తంగా ఉన్నా పట్టించుకోలేదని, టీడీపీ హయాంలో పుష్కరాలు సమయంలో వేసిన రోడ్లు తప్పితే ఇప్పటి వరకు ఎటువంటి అభివృద్ధి కనిపించలేదన్నారు. బడుగు, బలహీన వర్గాలు, పేదల ప్రజలకు అండగా ఉండేది ఎల్లప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమేనన్నారు. అనంతరం డ్వాక్రా సంఘాల మహిళలు ఎమ్మెల్యే ఆనందబాబుకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు ఘైనేని మురళీకృష్ణ, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్ పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేయండి

» డీజీపీ ద్వారకా తిరుమలరావు

ఒంగోలు(క్రైం), ఆగస్టు 19 : శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి పోలీసు అధికారి నిబద్ధతతో పనిచేసి పోలీసు ప్రతిష్ఠను పెంపొందించాలని డీజీపీ ద్వారక తిరుమలరావు పేర్కొన్నారు. సోమవారం తిరుపతి శ్రీసిటీ నుంచి విజయవాడ వెళుతు మార్గమధ్యంలో ఒంగోలు పోలీసు కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఏఆర్ దామోదర్ డీజీపీకి సాదర స్వాగతం పలికారు. నూతన హంగులతో నిర్మించిన పోలీసు అతిథిగృహాన్ని పరిశీలించారు. జిల్లాలో పరిస్థితులను ఎస్పీ వివరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ తీసుకున్న చర్యలను డీజీపీ ప్రశంసించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీసులు పారదర్శకత్యం, జవాబుదారీతనంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు రాఘవేంద్రరావు, సూర్యనారాయణ, భీమానాయక్ పాల్గొన్నారు.

ఎస్బీ నుంచి 15 మంది అవుట్

ఒంగోలు(క్రైం), ఆగస్టు 19: ఎస్పీకి అత్యంత ముఖ్యమైన స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన చేశారు. అక్కడ అటాచ్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎనిమిది మందిని వారు గతంలో పనిచేసిన పోలీసు స్టేషన్లకు బదిలీ చేయగా, మరో ఏడుగురిని వీఆర్‌కు పిలిచారు. ప్రసుత్తం అటాచ్‌మెంటలో పనిచేస్తున్న యస్‌కె.భాజీభాష, వివి.రమణారెడ్డి, సిహెచ్.రాము, కె.సుధాకర్‌రావు, వి.అంజిరెడ్డి, జి.నరసింహారావు, కె.చెన్నకేశవులు, జి.శ్రీనివాసులును వారు గతంలో పనిచేసిన స్టేషన్లకు పంపిస్తూ ఎస్పీ ఏఆర్.దామోదర్ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా స్పెషల్ బ్రాంచ్ పనిచేస్తున్న బీఎన్‌రెడ్డి, కె.కృష్ణదాసు, బి.అవులయ్య, కె.శ్రీనివాసులు, యం.ప్రసాద్‌రెడ్డి, వైవీఆర్.కృష్టారెడ్డి, సిహెచ్ .బాస్కరరావులను వీఆర్‌కు పిలిచారు. మొత్తం 15 మందికి స్పెషల్ బ్రాంచ్‌లో పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంది.

స్థానిక సంస్థల ఎన్నికలను జరిపించాలి


విలేకరులతో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ వాసు

బాపట్లరూరల్, ఆగస్టు 19 : చీరాల నియోజకవర్గంలోనే అగిన స్థానిక సంస్థల ఎన్నికలను జరిపించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రాన్ని చీరాల నియోజకవర్గం వేటపాలెం మండలం కొత్తపేట మాజీ సర్పంచ్ చుండూరువాసు అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో విలేకర్లతో మాట్లాడుతూ 2021 సంవత్సరంలో రాష్ట్రం మొత్తం స్థానిక సంస్థ ఎన్నికలు జరపగా చీరాల నియోజకవర్గంలోని 24గ్రామపంచాయతీలకు, రెండు మండలపరిషత్‌లకు ఎన్నికలు జరిపించకుండా నిలిపివేశారన్నారు. అప్పటి నుండి మా చీరాల నియోజకవర్గంలో స్థానిక సంస్థలకు ప్రత్యేకాధికారుల పేర్లుతో పరిపాలన సాగిస్తున్నారని ప్రత్యేకాధికారులకు సరైన అవగాహన లేక వాళ్ళు పూర్తిగా ఆఫీస్‌లకు మాత్రమే పరిమితమవ్వటంతోపాటు వారి స్వంతశాఖల పనులకు తోడు స్పెషలాఫీసర్ పోస్టను అదనంగా నిర్వహించలేక గ్రామాలలో చాలా పనులు నిలిచిపోయాయని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామ సభలు జరపకుండా ప్రజాభిష్టానికి వ్యతిరేకంగా జారీ చేసి జీవో మీద చీరాల నియోజకవర్గంలోని వేటపాలెం మండలంలోని కొంతమందిని కోర్టును ఆశ్రయించగా వేటపాలెం మండలంలోని గ్రామపంచాయతీలకు కోర్టు బైఫరికేషన్ మీద స్టే మంజూరు చేసిందని చీరాల మండలంకు ఎటువంటి అభ్యంతరం లేవన్నారు. కోర్టు తీర్పు కూడా ఇచ్చి 4 సంవత్సరాలు అయినప్పటికి ఈ రెండు మండలాలకు ఎన్నికలు జరపలేదని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిపించకపోవటం వల్ల గత 5 సంవత్సరాలు నుండి మా గ్రామపంచాయతీలకు సుమారు 70కోట్ల మెర నిధులు అగిపోయాయని ఫలితంగా గ్రామంలో పారిశుధ్యం, వీధిలైట్లు నిధులు లేక కునరిల్లుతున్నాయని తెలిపారు. ఇప్పటికైన గత ప్రభుత్వం విడుదల జీవోను రద్దు చేసి వెంటనే ఎన్నికలు జరిపించాలని వారు కోరారు.

ఐదేళ్ల తర్వాత తెరుచుకున్న చర్చి

మార్టూరు, ఆగస్టు 19 : మండలంలోని కోనంకి ఎస్సీ కాలనీలో ఐదేళ్ల కిందట మూసివేసిన తెలుగు బాప్టిస్ట్ చర్చి తలుపులు సోమవారం తెరుచుకున్నాయి. ఈచర్చిలో కొన్ని కారణాలు వలన గత ఐదేళ్ల కిందట కొంత మంది మధ్య వివాదం జరిగింది. దీంతో కాలనీలో శాంతి భద్రతల సమస్య ఏర్పడింది. అప్పటి పోలీసులు రంగప్రవేశం చేసి ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు చేపట్టారు. దాంతో కారణాలు ఏమైతేనేం చర్చి తలుపులు మూతపడ్డాయి. ఎట్టకేలకు సోమవారం గ్రామ పెద్దలు కోటపాటి సురేష్, ఉప్పలపాటి చక్రపాణి లు, కాలనీలోని పెద్దలతో సంప్రదింపులు జరిపి ఒక కమిటీగా ఏర్పడి తిరిగి చర్చిని తెరిచేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిపై స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

కొవ్వొత్తులతో ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

చినగంజాం, ఆగస్టు 19 : కోల్‌కతా ఘటనను ఖండిస్తూ రైల్వేగేటు సెంటర్‌లో జనసేన మండల నాయకులు, కార్యకర్తలు సోమవారం కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, సీపీఎం జిల్లా నాయకుడు జి.ప్రతాప్‌కుమార్, ఘంటా వెంకటేష్, కుర్రి వాసుదేవరావు, తోట అశోకచక్రవర్తి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

చినగంజాం, ఆగస్టు 19 : భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో వేంకటేశ్వరస్వామి తిరునక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకొని సోమవారం శ్రీనివాస కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు ఉత్సవ విగ్రహాలను విశేషంగా అలంకరించి, విశేష పూజలు నిర్వహించారు. వేదపండితులు పరాశరం రామాచార్యులు వేదమంత్రోచ్చరణతో దంపతులచే కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పిచ్చయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

రాఖీ వేడుకలో విషాదం

» కార్ డ్రైవర్ నిర్లక్ష్యంతో చిన్నారి దుర్మరణం


నందిని(ఫైల్)

వేటపాలెం(చీరాలటౌన్), ఆగస్టు 19: రాఖీ వేడుకలో విషాదం చోటు చేసుకుంది. అన్నకు రాఖీ కట్టేందుకు వచ్చిన కుటుంబంలోని చిన్నారి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందింది. ఈ ఘటన సోమవారం రాత్రి వేటపాలెం జాతీయ రహదారిలోని నాయినిపల్లి వద్ద జరిగింది. అందిన వివరాల ప్రకారం.. చినగంజాంకు చెందిన టంగు వెంకటేశ్వరరెడ్డి, లలిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. అయితే వీరు చీరాల పరిధిలోని పచ్చమొగిలిలోని అన్నకు రాఖీ కట్టేందుకు లలిత, ఆమె భర్త, ఇద్దరు కుమార్తెలతో ద్విచక్ర వాహనంపై వచ్చారు. తిరిగి రాత్రి సమయంలో వెళుతుండగా ఒంగోలు వైపు నుంచి వస్తున్న కారు డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు బైకుపైకి దూసుకెళ్లింది. దీంతో పెద్ద కుమార్తె నందిని (13) అక్కడికక్కడే మృతిచెందగా మిగిలిన వారికి గాయాలయ్యాయి. దీంతో స్థానికులు వీరిని 108లో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వైభవంగా దక్షిణామూర్తి, కాలభైరవ విగ్రహాల ప్రతిష్ఠ

టంగుటూరు, ఆగస్టు 19: టంగుటూరు శివాలయం ప్రాంగణంలో దక్షిణా మూర్తి, కాలభైర స్వామిల విగ్రహాల ప్రతిష్ఠ సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 6గంటల నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. 8.47 గంటలకు దక్షిణామూర్తి, కాలభైరవ స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం 12గంటల నుంచి అన్న సంతర్పణ జరిగింది. ప్రముఖ వ్యాపారి బెల్లం కోటయ్య, బెల్లం జయంత్‌బాబు, మక్కెన హరిబాబులు సతీసమేతంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

నీటి పారుదలంతా నిర్లక్ష్యమే..!



» జలవనరుల శాఖలో పర్యవేక్షణ అస్తవ్యస్తం

» కీలక అధికారుల నియామకాల్లో అడ్డగోలుగా వ్యవహరించిన గత ప్రభుత్వం

ఐదేళ్ల తమ పాలనలో సాగునీటి రంగానికి నిధులు ఇవ్వకుండా ప్రాజెక్టులు, ఇతర జలవనరులను ధ్వంసం చేసిన వైసీపీ ప్రభుత్వం చివరకు పర్యవేక్షణను గాలికొదిలేసింది. యంత్రాంగం నియామకాల్లోనూ అడ్డగోలుగా వ్యవహరించింది. అందుకు ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఇరిగేషన్ ఉన్నతాధికారుల నియామకాలే నిదర్శనం. పట్టించుకునేవారు లేక శాఖ పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు, వందలాది నీటివనరుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గతేడాది ఒకవైపు వర్షాలు లేక మరొకవైపు ప్రధాన సాగువనరులైన సాగర్ నీరు రాక జలవనరుల పర్యవేక్షణ పెద్దగా అవసరం పడలేదు. ఈ ఏడాది సాగునీటి పరిస్థితి ఆశాజనకంగా కనిపిస్తోంది. ఎన్నెస్పీ నీటి సరఫరాపై ఇప్పటికే స్పష్టత రాగా ఇతర వర్షాధార వనరులకు మరోనెల తర్వాత నీరు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని ఇరిగేషన్‌శాఖ పూర్తిస్థాయి అధికారులతో సిద్ధం కావాల్సి ఉంది.

ఒంగోలు, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఉన్న సాగునీటి వనరులు, ప్రాజెక్టుల నిర్వహణ ఒంగోలు కేంద్రంగానే సాగుతున్నాయి. ఇక్కడి సీఈ పర్యవేక్షణలో రెగ్యులర్ జలవనరులకు ఒక ఎస్ఈ, ప్రాజెక్టులకు మరొక ఎస్ఈ ఉండాలి. రెగ్యులర్ ఎస్ఈ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 4.42లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న ఎన్నెస్పీ, 43వేల ఎకరాలు ఉన్న మీడియం ఇరిగేషన్, మరో లక్ష 35వేల ఎకరాల ఆయకట్టు ఉన్న మైనర్ ఇరిగేషన్‌లోని 953 చెరువులు ఉంటాయి. వీటి పర్యవేక్షణ కోసం ఎస్ఈ పరిధిలో ఎన్నెస్పీ కోసం చీమకుర్తి, దర్శి అద్దంకి డివిజన్లు ఉండగా వాటికి ఈఈలు ఉన్నతాధికారులుగా ఉంటారు. ఇక మీడియం, మైనర్ ఇరిగేషన్ల నిర్వహణకు ఒంగోలు, మార్కాపురం కేంద్రాలుగా ఈఈలు ఉన్నతాధికారులుగా ఉండగా, రాళ్లపాడు ప్రాజెక్టుకు ప్రత్యేకంగా ఉంటారు.

ఆరకంగా మొత్తం రెగ్యులర్ జలవనరుల సర్కిల్ పరిధిలో ఒంగోలులోని ఎస్ఈతోపాటు ఐదు డివిజన్ల ఈఈలు కీలకం. కాగా ప్రాజెక్టుల సర్కిల్‌కు సంబంధించి ఎస్ఈ ఆ పరిధిలో గుండ్లకమ్మకు ఇద్దరు, వెలిగొండకు ముగ్గురు క్షేత్రస్థాయిలో ఈఈలు ఉంటారు.

వైసీపీ ప్రభుత్వం అన్నింటా వైఫల్యమే..

కాగా కీలకమైన రాష్ట్రవ్యాప్తంగా ఎస్ఈ, ఈఈ పోస్టులలో గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగోన్నతుల సీనియారిటిలో నెలకొన్న వివాదాలు పరిష్కరించడంలో వైఫల్యం చెందింది. దీంతో కిందిస్థాయి అధికారులకు అడహక్ పదోన్నతులు ఇచ్చి ఇన్‌చార్జీలుగా పూర్తి అదనపు బాధ్యతలతో కొనసాగించింది. అయితే ఉమ్మడి జిల్లాలో చేసిన నియామకాలు తలాతోక లేకుండా చేయగా వారే ఇప్పటికి కొనసాగుతున్నారు. ప్రస్తుతం రెగ్యులర్ విభాగం ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలలో ఉన్న నాగమురళీ మోహన్ ఉన్నారు. వాస్తవంగా ఆయన స్థానం గుండ్లకమ్మ ప్రాజెక్టు-2 విభాగం ఈఈ. కాగా ఎస్ఈతో పాటు అదే విభాగంలోని ఒంగోలు డివిజన్ ఈఈగా కూడా ఇన్‌చార్జీగా ఉన్నారు. అదే ప్రాజెక్టుల విభాగం ఎస్ఈగా అబుల్ సలీమ్ పరిస్థితి చూస్తే ఆయన అసలు పోస్టు రెగ్యులర్ విభాగం మార్కాపురం డివిజన్ ఈఈ. అంటే ఇద్దరు రెండు విభాగాలకు సమానంగా ఉన్న ఎస్ఈ స్థానాల్లో ఉన్నప్పటికి ఒక విభాగంలో ఒకరి కింద, ఒకరుగా పనిచేయాలి.

అవసరం కోసం అడ్‌హక్ ప్రమోషన్లు

రెగ్యులర్ ఎస్ఈగా ఉన్న నాగమురళీమోహన్ గుండ్లకమ్మ విషయంలో ప్రాజెక్టుల ఎస్ఈ అబుల్ సలీమ్‌కు కిందిస్థాయి అధికారిగా పనిచేయాలి. అదేసమయంలో ప్రాజెక్టుల ఎస్ఈ అయిన అబుల్ సలీమ్ తన వాస్తవ పోస్టు అయిన మార్కాపురం రెగ్యులర్ ఈఈ వ్యవహారంలో నాగమురళీమోహన్‌కు కింది అధికారిగా పనిచేయాలి. అవసరాల కోసం ఇలా అడ్డగోలుగా అడహక్ ప్రమోషన్లు ఇవ్వడం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదు. ఒకరి కింద మరొకరు పనిచేసేలా సమాన హోదా ఉన్న అధికారుల నియామకాలు చేపట్టలేదు. అలా చేయడంతో విధి నిర్వహణలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయన్న విషయాన్ని నాటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

పనిఒత్తిడితో పట్టించుకోలేరు

ఇక ఎన్నెస్పీ అద్దంకి డివిజన్ ఈఈ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అక్కడ ఈఈగా ఉన్న ఉమామహేశ్వరరావును ఉమ్మడి గుంటూరు జిల్లా రెగ్యులర్ ఎస్ఈగా నియమించారు. ఆ జిల్లా పరిధిలోని మీడియం, మైనర్ వనరులతోపాటు కేడబ్ల్యూడీ పరిధిలోని లక్షలాది ఎకరాల ఆయకట్టు పర్యవేక్షణ ఆయన పరిధిలో ఉంటుంది. ఒంగోలు ఎస్ఈ పరిధిలోని ఆయకట్టు కన్నా అధికంగా ఆయన పరిధిలో ఉండనుండగా అలాంటి సమాన హోదా కలిగిన సదరు అధికారి అద్దంకి ఈఈగా ఒంగోలు ఎస్ఈ కిందస్థాయి అధికారిగా పనిచేయాలి. అంతేకాక గుంటూరు జిల్లాలో ఉండి పనివత్తిడితో అద్దంకి డివిజన్ వ్యవహారాలు పట్టించుకునే అవకాశం లేదు.

రెండు పోస్టులు ఖాళీనే

ఇక ఎన్నెస్పీ దర్శి ఈఈ వెంకటరాజు గత నవంబరులో బదిలీ కాగా ముండ్లమూరు డీఈని ఇన్‌చార్జీగా నియమించారు. ఇదిలా ఉండగా రామతీర్థం రిజర్వాయర్ దర్శి ఎన్నెస్పీ-2 సబ్ డివిజన్. అలాగే చీమకుర్తి ఈఈ పర్యవేక్షణలో ఉంటుంది. ప్రస్తుతం ఆ రెండు పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. ఈ ఏడాది జూన్‌లో కడప జిల్లాకు చెందిన రమణారెడ్డిని చీమకుర్తి ఈఈగా నియమించగా ఆయన సెలవులో వెళ్లారు. అక్కడ ఎవరి నియామకం జరక్కపోగా దర్శి-2 సబ్ డివిజన్ డీఈగా చీమకుర్తి డీఈకి ఇన్‌చార్జీ ఇచ్చారు. ఇలా కీలక పోస్టులు ఇన్‌చార్జీలుగా అది కూడా అస్తవ్యస్తంగా ఉండటంతో ఎన్నెస్పీ, గుండ్లకమ్మ, రామతీర్థం, రిజర్వాయర్లు, కాలువల పర్యవేక్షణ అస్తవ్యస్తంగా మారాయి.

యూపీ స్కూళ్లకు సర్దుపోటు

» ఇద్దరు టీచర్లు.. ఎనిమిది తరగతులు

» ప్రభుత్వ పాఠశాలల మనుగడకే ముప్పు



ఒంగోలు (విద్య), ఆగస్టు 19: రాష్ట్ర విద్యాశాఖ చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు జిల్లాలోని ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుపోటుగా మారింది. అందరూ వ్యతిరేకిస్తున్నా గత ప్రభుత్వం తెచ్చిన 117 జీవో ప్రకారం జరుగుతున్న ప్రక్రియ పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపనుంది. అసంబద్ధమైన, అశాస్త్రీయమైన ఈ టీచర్ల సర్దుబాటు ప్రక్రియతో యూపీ స్కూళ్ల మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన జరుగుతున్న ఈ కార్యక్రమం వల్ల విద్యార్థులు తక్కు వమంది ఉన్న యూపీ స్కూళ్లలో ఇద్దరు టీచర్లు ఎనిమిది తరగతులు బోధించాల్సి వస్తుంది. అన్ని తరగతులకు ఇద్దరు టీచర్లు అసలు బోధించగలరా? విద్యార్థుల్లో ఏమేరకు ప్రమాణాలు పెంపొం దించగలరు? విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి మొత్తం స్కూలు అసిస్టెంట్లను తప్పించి ఇద్దరు, ముగ్గురు సెకండరీ గ్రేడ్ టీచర్లను అక్కడ కొనసాగించడం వల్ల ఉపయోగం ఉండదు. పిల్లలకు పాఠాలు చెప్పేం దుకు టీచర్లు లేక వారు కూడా ఇతర పాఠశాలలకు వెళితే అవన్నీ మూసివేతకు గురయ్యే ప్రమాదం ఉంది.

91 పాఠశాలలపై సర్దుబాటు పిడుగు

జిల్లాలోని 91 ప్రాథమికోన్నత పాఠశాలలపై సర్దుబాటు పిడుగు పడనుంది. జిల్లాలో అన్ని యాజమాన్యాల్లో మొత్తం 191 యూపీ పాఠశాలలు ఉన్నాయి. 1 నుంచి 8 తరగతులు ఉన్న పాఠశాలల్లో కనీసం 98 మంది విద్యార్థులు ఉంటేనే స్కూలు అసిస్టెంట్లను కొనసాగిస్తారు. అయితే జిల్లాలో 19 పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లను మిగులుగా చూపించి వారి స్థానంలో దామాషా పద్ధతిలో ఎస్జీటీలను నియమిస్తున్నారు. 10 యూపీ స్కూళ్లలో 6, 7, 8 తరగతుల్లో ఒక్క విద్యార్థి కూడా లేరు. 52 యూపీ స్కూళ్లలో 8వ తరగతిలో ఒక్క విద్యార్థి కూడా లేరు. జిల్లాలో మార్కాపురంలోని 10వ వార్డులోని మునిసిపల్ యూపీఎస్‌లో గరిష్ఠంగా 278 మంది విద్యార్థులు ఉండగా, పెళ్లూరు ఎంపీయూపీఎస్‌లో 1నుంచి 8 తరగతుల్లో కేవలం 23 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు.

కొన్నిచోట్ల పరిస్థితి ఇదీ.

ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం ఎంపీయూపీఎస్‌లో 1 నుంచి 8 తరగతులకు 93మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 1 నుంచి 5 తరగతులకు 68 మంది, 6వ తరగతిలో 16 మంది, 7లో ఐదుగురు, 8లో నలుగురు విద్యార్థులు ఉన్నారు. వీరికి ప్రస్తుతం తొమ్మిది మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు బోధిస్తున్నారు. ప్రస్తుతం వీరిలో ఐదుగురిని మిగులుగా గుర్తించారు. అంటే ఇక నుంచి అక్కడ నలుగురు టీచర్లే బోధించాల్సి ఉంది. అదే హైస్కూలులో 93 మంది విద్యార్థులు ఉంటే ఏడుగురు అసిస్టెంట్లు, ఒక హెచ్ఎం, ఒక పీడీ/పీఈటీని ఇస్తారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ఈ వివక్షతో యూపీఎస్‌లు కుదేలైపోనున్నాయి. అదేవిధంగా పెళ్లూరు ఎంపీయూపీ స్కూలులో 23 మంది విద్యార్థులు ఉండటంతో అక్కడ ఇద్దరు టీచర్లే ఎనిమిది తరగతులకు బోధించాల్సి ఉంది. విద్యార్థులు ఎంతమంది ఉన్నా ఆయా తరగతులకు అన్ని సబ్జెక్టులు బోధించాల్సిందే. ఈ వాస్తవాన్ని గుర్తించి యూపీ స్కూళ్ళకు టీచర్లను కేటాయించాలని సంఘాలు కోరు తున్నాయి.

యూపీఎస్‌లపై వివక్ష

విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకొని కేడర్ స్ట్రెంత్ నిర్వహణలో 117 జీవోలో యూపీ స్కూళ్లకు తీవ్ర అన్యాయం జరిగింది. యూపీఎస్‌లో 98 మంది విద్యార్థులు ఉంటేనే వాటిల్లో 3 నుంచి 8 వరకు అంటే ఆరు తరగతులకు ఆరుగురు స్కూలు అసిస్టెంట్లను కేటాయించమన్నారు. 98మంది కంటే తక్కువ మంది ఉంటే 1:30 ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఆధారం గా ఎస్జీటీలను కేటాయించమన్నారు. అంటే 97 మంది విద్యా ర్థులు ఉన్నా ఆ పాఠశా లలకు నలుగురు ఎస్జీటీలను మాత్రమే కేటాయిస్తారు. అదే హైస్కూళ్లలో అయితే 6 నుంచి 10 తరగతులకు 92మంది కంటే తక్కువ విద్యార్థులు ఉన్న ప్రతి సబ్జెక్టుకు కనీసం ఒకరు చొప్పున ఏడుగురు స్కూలు అసిస్టెంట్లను కొనసాగి స్తారు. ఈ వివక్షను టీచర్లు, సంఘాలు ప్రశ్నిస్తు న్నాయి.


చెక్కును అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

ప్రజారోగ్యానికి భరోసా

» మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి, ఆగస్టు 19 : ప్రజారోగ్యానికి టీడీపీ ప్రభుత్వం భరోసాగా ఉంటుందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలంలోని చెరువుకొమ్ముపాలెంకు చెందిన రామాంజనేయులు కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం డబ్బులు లేకపోవడంతో మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకుపోయారు. రవికుమార్ ప్రత్యేక చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15లక్షలు మంజూరు చేయించారు. చెక్కును రామాంజనేయులు బంధువులకు సోమవారం సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో అందజేశారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి గత ప్రభుత్వం వలే కాకుండా టీడీపీ కూటమి ప్రభుత్వం వీలైనంత ఎక్కువ మొత్తాన్ని అందిస్తుందన్నారు. ఎన్‌టీఆర్ వైద్య సేవ కింద రూ.25లక్షల వరకు ఒక్కో కుటుంబం ఏడాదిలో ఉచితంగా వైద్యం పొందవచ్చన్నారు. టీడీపీ నేత మలాది నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటకు చెందిన సోమేపల్లి వెంకటేశ్వర్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా మంత్రి రవికుమార్ సోమవారం ఇంటికి వెళ్లి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అక్రమ రవాణాలకు పాల్పడితే చర్యలు

చీరాలటౌన్, ఆగస్టు 19: నిషిద్ధ వస్తువుల అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈపూరుపాలెం ఎస్ఐ శివకుమార్ పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్టేషన్ పరిధిలోని కీర్తివారి పాలెం ప్రధాన రహదారిలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా అనుమానితుల నుంచి వివరాలు సేకరించారు. వాహనాలు తనిఖీలు చేశారు. సరైన పత్రాలు లేని వారికి తగు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. చట్టాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సమాచామివ్వాలని సూచించారు. ఎస్సై వెంట స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

వేతన వెతలు

» ఉపాధి కూలీలకు నిలిచిన చెల్లింపులు

» రెండున్నర నెలలుగా అందని వైనం

» జిల్లాలో రూ.88.50 కోట్లు పెండింగ్

» కేంద్రం నిధులు ఇవ్వకపోవడమే కారణం



జిల్లాలో మొత్తం మండలాలు	38
ఉపాధి పనులు జరిగే పంచాయతీలు	719
మొత్తం జాబ్‌కార్డులు (కుటుంబాలు)	4.36 లక్షలు
జాబ్‌కార్డుల్లో నమోదైన కూలీలు	8.03 లక్షలు
పనులకు వచ్చిన కుటుంబాలు	2.71 లక్షలు
పనులకు హాజరైన కూలీలు	4.60 లక్షలు
వార్షిక పని దినాల లక్ష్యం	1.56 కోట్లు
ఇప్పటి వరకు చేసిన పని దినాలు	1.06కోట్లు
మొత్తం కూలీలకు లభించిన వేతనం	రూ 221.62కోట్లు
పెండింగ్‌లో ఉన్న సొమ్ము	రూ 88.50 కోట్లు

ఒంగోలు, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వ్యవసాయ కూలీలకు ఊతం ఇచ్చే ఉపాధి పనులు చేసిన వారికి ఇంచుమించు రెండున్నర నెలలుగా వేతన చెల్లింపులు నిలిచిపోయాయి. దీంతో వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈఏడాది సాధారణ ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో పనులు జరిగిందే తక్కువ. వాటికి కూడా డబ్బులు రాక కూలీలు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా వారం వారం కూలి డబ్బులు చెల్లించాల్సి ఉండగా గత వైసీపీ పాలనలో నెలకు ఒకసారి ఇచ్చారు. ఈసారి దాదాపు రెండున్నర నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. ప్రస్తుతం సుమారు రూ.88.50 కోట్ల మేర వేతన బకాయిలు ఉన్నట్లు సమాచారం.

సగటున ఒక్కొక్కరికి రోజుకు రూ. 208 వేతనం

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి కోటి 56 లక్షల పని దినాలు లక్ష్యంగా నిర్దేశించారు. మొత్తం 38 మండలాల్లోని 729 గ్రామ పంచాయతీల పరిధిలో 4.36 లక్షల జాబ్ కార్డులు ఉండగా వాటిలో 8.03 లక్షల మంది కూలీల పేర్లు నమోదయ్యాయి. అందులో 2.71లక్షల కుటుంబాలకు సంబంధించి 4.60 లక్షల మంది పనులకు రాగా ఇప్పటి వరకు కోటి ఆరు లక్షల పనిదినాలు కల్పించారు వార్షిక లక్ష్యంలో 67.98శాతం పనిదినాలు కల్పించగా సగటు ఒక్కొక్కరికి రోజుకు రూ.208 వేతనం లభించింది. ఆ ప్రకారం మొత్తం చేసిన పని దినాలకు రూ221.62 కోట్ల మేర కూలి సొమ్ము రావాల్సి ఉంది. అయితే రెండున్నర నెలలుగా కూలీలకు వేతనాలు అందడం లేదు.

మే 20 నుంచి నిలిచిన చెల్లింపులు

అధికార వర్గాల నుంచి అందుతున్న సమాచారం మేరకు ఈ ఏడాది మే 20నుంచి జిల్లాలో ఉపాధి పనులు చేసిన కూలీలకు ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. కేంద్రం నుంచి నిధులు రావడంలో జాప్యం వల్ల ఈ పరిస్థితి నెలకొన్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రెండున్నర వేల కోట్ల మేర ఉపాధి వేతనాలు పెండింగ్‌లో ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది. అయితే తక్షణం ఆ నిధులను విడుదల చేసినా అవి రాష్ట్రానికి చేరి వాటిని జిల్లాల వారీ కేటాయించి కూలీల ఖాతాలకు జమ చేయడానికి కనీసం వారం పట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఎప్పటి నుంచి ఎప్పటి వరకు పెండింగ్ వేతనాలు చెల్లిస్తారన్న స్పష్టత కూడా ఆతర్వాత తేలనుంది. దాదాపు రెండున్నర నెలలుగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో కూలీలు కూడా ఉపాధి పనులకు ఆసక్తి చూపడం లేదు. ఈపరిస్థితుల్లో తక్షణం వేతన బకాయిలు చెల్లించి కూలీలకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. వేతన సొమ్ము విడుదల చేయాలని కోరుతూ కొన్నిచోట్ల ఆందోళనలు కూడా చేస్తున్నారు.

పేద మత్స్యకారులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

బాపట్లరూరల్, ఆగస్టు 19 : చీరాల మండలంలో వాడరేవు గ్రామపంచాయతీ పరిధిలో చిన్న బరప, పెద్దబరప కాలనీలలోని ఇంటి స్థలాలు లేని పేద మత్స్యకార కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించాలని సీపీఐ సీనియర్ నాయకులు జెబి.శ్రీధర్ ఆధ్వర్యంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మేడా వెంకట్రావుతో కలిసి కాలనీవాసులు ప్రజాసమస్యల పరిష్కారవేదికలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ద్వారా ఫిర్యాదును అందజేశారు. ఈసందర్భంగా జెబి.శ్రీధర్ విలేకర్లతో మాట్లాడుతూ వాడరేవు ప్రాంతంలో గత 32 సంవత్సరాలు నుంచి నివసిస్తూ చేపలవేట చేసుకుంటూ వేటలేని సమయంలో భవననిర్మాణ కార్మికులుగ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చిన్నబరప, పెద్దబరప కాలనీలలోని నేటికి కొన్ని కుటుంబాలు స్వంత ఇల్లు లేక అద్దె ఇంట్లో నివసిస్తూ జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2,3సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళిన కూడా ఎలాంటి ఫలితంలేదని వాపోయారు. ప్రభుత్వ అధికారులు ఇల్లులేనివారి వద్దకు వచ్చి వెరిఫికేషన్ మాత్రమే చుకొని వెళ్ళారని ఇళ్ళపట్టాలు మంజూరు జరగలేదని తెలిపారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ హయాంలోనైన ఈ సమస్య పరిష్కారం చూపి మత్స్యకారులకు ఇళ్ళపట్టాలు కేటాయించాలని కలెక్టర్‌ను కోరటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ మెంబరు కె.ఎల్.డి ప్రసాద్, చేపల నాగలక్ష్మీ, సురాడ శాంతి, రూతమ్మ తదితరులు పాల్గొన్నారు.


స్థూపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

దత్త క్షేత్రంలో ప్రత్యేక పూజలు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 19 : దత్త క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. షోడశ దత్త అవతార మండప నిర్మాణానికి మొదటగా భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీమహాలక్ష్మి అమ్మవారి పీఠం ఎదురుగా 18 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన మహాలక్ష్మి అమ్మవారి స్థూపాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కన్వీనర్ కె.ప్రమీలదేవి, అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు, నున్నా శివప్రసాదరావు, గుర్రం రంగనాయకులు, కె. మరళీకృష్ణ, కె. కోటేశ్వరరావు, సుఖర్దబాబు, పూర్ణచంద్రరావు, ఆదిలక్ష్మి, చంద్రకళ, రమాదేవి, కుమారి, భక్తులు పాల్గొన్నారు.

స్వామికి లక్ష తమలపాకుల అర్చన



అద్దంకి, ఆగస్టు 19 : పౌర్ణమి సందర్భంగా శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం లక్ష తమలపాకుల అర్చన నిర్వహించారు. వేదపండితులు, పూజారులు 11 ఆవృత్తములుగా లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా ఒంగోలు కు చెందిన నాగార్జున కన్‌స్ట్రక్షన్ అధినేత శ్రీనివాసరావు వ్యవహరించారు. అనంతరం భక్తులను పూజారులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.


తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు చెప్తున్న నేతలు

తహసీల్దార్, ఎస్ఐకు శుభాకాంక్షలు

పంగులూరు, ఆగస్టు 19 : మండలానికి బదిలీపై వచ్చిన తహసీల్దార్, నాగరాజారావు, ఎస్ఐ రవిబాబును టీడీపీ ఎస్సీసెల్ నాయకులు సోమవారం వారి కార్యాలయాలలో మర్యాదపూర్వకంగా కలిశారు. దళితుల సంక్షేమానికి, వారి హక్కుల పరిరక్షణకు సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఇరువురు అధికారులను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వరపర్ల సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొలకలూరి వెంకటరావు, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి ఉన్నం రవిబాబు, మాజీ కార్యదర్శి తెలగతోటి రాధాకృష్ణమూర్తి, రేణంగివరం మాజీ సర్పంచ్ అమృతలూరి ఏసోబు, నాయకులు పాల్గొన్నారు.

శింగరకొండకు జనరేటర్ అందజేత


జనరేటర్‌ను ప్రారంభిస్తున్న దాతలు

అద్దంకి, ఆగస్టు 19 : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం కు దాతలు జనరేటర్ అందజేశారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం ప్రతినిధి, అద్దంకి పట్టణంలోని కాకానిపాలెం కు చెందిన కూకట్ల శ్రీనివాసరావు సహకారం తో సమకూర్చిన 7 లక్షల రూపాయల విలువైన 125 కెవి జనరేటర్ ను తల్లిదం డ్రులు సుబ్బారావు, వింజావళి లు సోమవారం ప్రారంభించారు. 5 లక్షల రూపాయలతో జనరేటర్ కు అవసరమైన ప్యానల్ బోర్డు ను నర్సరావుపేట మండలం కాకానికి చెందిన దండా బ్రహ్మానందం, లక్ష్మీరాజ్యం దంపతులు ఏర్పాటు చేయించారు. జనరేటర్ ఉంచే షెడ్ ను దేవస్థానం నిధులతో నిర్మించినట్లు ఈవో సుభద్ర తెలిపారు.

సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు పనులు

మార్టూరు, ఆగస్టు 19 : మార్టూరు సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు పనులు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం సెంటర్లో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయనున్న పెద్ద అండరుపాస్ వద్ద స్థలాన్ని చదునుచేస్తున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శానిటేషన్‌కు సంబంధించి గుంతలు, నీటి పైపులైను, ఇంకా తదితర ఏర్పాట్లు చేయనున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు అత్యవసరంగా దీనిని ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. దాంతో గ్రామ పంచాయతీ 15వ ఫైనాన్స్ నిధులు రూ.10లక్షలతో కంటైనర్ సులాభ కాంప్లెక్స్ ఏర్పాటు కోసం హైదరాబాద్‌లోని ప్రైవేటు కంపెనీని సంప్రదించారు. దాదాపుగా మంగళవారం ఈ కంటైనర్ హైదరాబాద్ నుంచి మార్టూరుకు చేరే అవకాశం ఉంది. ఈ కంటైనర్‌లో మహిళలకు3, పురుషులకు 3 వంతున మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నారు. మూడు నాలుగురోజులలో పెద్ద అండరుపాస్ వద్ద పనులను పూర్తి చేసి, సులబ్ కాంపెక్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు తెలిపారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట్రావు

ఆదిపూడి(పర్చూరు), అగస్టు 19 : నేర నియంత్రకు ప్రజలు సహకరించాలని కారంచేడు ఎస్ఐ వెంకట్రావు అన్నారు. మండలంలోని ఆదిపూడి గ్రామంలో మంగళవారం గ్రామస్థులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. నేర నియంత్రణలో అవి ఎంతగానో దోహదపడతాయన్నారు. దీన్ని గుర్తించి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఆడిటర్ రాము మృతి


రాము (ఫైల్)

అద్దంకి, ఆగస్టు 19 : ఆడిటర్ కుందా వెంకటరామాంజనేయులు (రాము) (48) అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని చక్రాయపాలెంకు చెందిన కుందా రాము అద్దంకిలో ఆడిటర్‌గా స్థిరపడ్డారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో ఉన్న రాము సోమవారం ఉదయం గుంటూరులోని వైద్యశాలలో మృతి చెందారు. రాముకు ఇద్దరు కుమారులు కాగా, దశాబ్ద కాలం కిందట ఒక కుమారుడు గోడ కూలి మృతి చెందాడు. భార్య, కుమారుడు ఉన్నారు. రాము మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు.

రూ.50వేల అపరాధ రుసుము

» ఇసుక అక్రమ రవాణాపై స్పందించిన మైనింగ్ అధికారులు


పందిళ్లపల్లి, చినగంజాం మండలం కవడకుదురు సరిహద్దులో ట్రాక్టర్‌లోకి నింపుతున్న ఇసుక (ఫైల్)

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీరాల, ఆగస్టు 19 : ఆగని ఇసుక అక్రమ రవాణా శీర్షికన ఈనెల 13వ తేదీన ఆంధ్రజ్యోతి ప్రచురితమైన కథనంపై మైనింగ్ అధికారులు స్పందించారు. ఈనేపథ్యంలో ఈపురుపాలెం ప్రాంతంలో సాధారణ మట్టి అక్రమ తవ్వకాలకు సంబంధించి వాహనదారుని గుర్తించి రూ.50,000 అపరాధ రుసుము వసూలు చేసినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారి రాజేష్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈపురుపాలెం వీఆర్వో, తోటవారిపాలెం గ్రామ సర్వేయర్‌లు సంయుక్తంగా ఆ ప్రదేశాన్ని గుర్తించారు. సాధారణ మట్టిని అక్రమంగా తవ్వి, తరలించినట్లు ధ్రువీకరించారు. ఆ క్రమంలో టేపుతో కొలచి 975 క్యూబిక్ మీటర్ల సాధారణ మట్టిని తవ్వినట్లు నిర్ధారించినట్లు చెప్పారు. తవ్వి నిల్వ ఉంచిన 3 కుప్పలు 210 క్యూబిక్ మీటర్లు ఉన్నట్లు కొలత వేసినట్లు తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వకాలు, రవాణా చేసినట్లు ఆ నివేదికలో నిర్ధారించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు భూగర్భ, పోలీస్, రెవెన్యూ శాఖలతో కలసి నిరంతర నిఘా ఉంచి అక్రమ తవ్వకాలు, రవాణాదారులపై చట్టపరంగా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

భవనాసి చెరువులో ఆక్రమణలు తొలగిస్తాం

అద్దంకి, ఆగస్టు 19 : భవనాసి చెరువులో ఆక్రమణలు తొలగింపునకు చర్యలు చేపట్టనున్నట్లు ఇరిగేషన్ ఈఈ నాగమురళీమోహన్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ఇటీవల ప్రచురితమైన ఆక్రమణలు తొలగించేనా కథనంపై ఇరిగేషన్ అధికారులు స్పందించి ప్రకటన విడుదల చేశారు. భవనాసి చెరువు ను ఆక్రమించిన 7గురు రైతులపై చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్ అధికారులను కోరినట్లు తెలిపారు.

రేపు ఉచిత ఆయుర్వేద శిబిరం

ఇంకొల్లు, ఆగస్టు 19 : వంకాయలపాడు వలేవేటి సత్యవేణి గార్డెన్స్‌లో సత్యవాణి వర్ధంతి సందర్భంగా ఉచిత మోగా ఆయుర్వేద వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఏలూరి, పత్తిపాటి పుల్లారావు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

కాలువలను అభివృద్ధి చేస్తాం

బల్లికురవ, ఆగస్టు 19 : పంట కాలువల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజురు కాగానే పనులు చేప డతామని జలవనరుల శాఖ అద్దంకి డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ ఉమామహేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో పూడిపోయిన పంట కాలువలు అన్న కథ నంపై అధికారుల ఉస్పందించారు. బల్లికురవ మండలంలోని వెంపరాల, పసుమర్రు, జంగాలపల్లి, వైద, గుంటుపల్లి మేజర్లతో పాటు మైనర్ కాలువలలో తుమ్మ చెట్లు అధికంగా ఉన్నాయని ఈ కాలువల అభివృద్ధికి రూ.53.80 లక్షల నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. నిధులు మంజురు కాగానే కాలువలను అభివృద్ధి చేస్తామని ఉమామహేశ్వరరావు తెలిపారు.

వెంటనే మురుగు తొలగించండి

బల్లికురవలో పర్యటించిన జిల్లా పంచాయతీ అధికారి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్


అధికారులకు సూచనలు ఇస్తున్న డీపీవో రవికుమార్

బల్లికురవ, ఆగస్టు 19 : తక్షణమే మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ముందు ఉన్న మురుగు నిల్వలు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ ఆదేశించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన గ్రామాల్లో అటకెక్కిన పారిశుధ్యం వార్తపై కలెక్టర్ వెంకటమురళి ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్ బల్లికురవ మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల ముందు ఉన్న మురుగు నిల్వలను పరిశీలించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువలు లేకపోవడం వల్లే మురుగు నీరు నిల్వ ఉంటోందని, తక్షణమే రోడ్డు పక్కన కాలువలను తీయించి మురుగు నీరు లేకుండా చేయాలన్నారు. వారంరోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంచాయతీలలో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను వెచ్చించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ పరిశీలనలో ఇన్‌చార్జి తహసీల్దార్ రవికుమార్, ఈవోపీఆర్డీ సుమతి, పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్, సర్పంచ్ పందిరి అంజిబాబు, పలు గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ బాలరాజు

సీజనల్ వ్యాధులతో అప్రమత్తం

అద్దంకిటౌన్, ఆగస్టు 19 : సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని మోదేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె. బాలరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. సోమవారం మండలంలోని శింగరకొండపాలెం పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెంలో వైద్య శిబిరం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. తాగునీరు శుభ్రత, మురుగు నీరు నిల్వలు లేకుండా చూడాలని, దోమతెరలను వాడాలని సూచించారు. జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలను సేకరించారు.కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థాయి ఆధారంగా బోధన సాగాలి

అద్దంకిటౌన్, ఆగస్టు 19 : ఉపాధ్యాయులు విద్యార్థుల స్థాయిలను గుర్తించి, గ్రూపులుగా విభజించి బోధన సాగించాలని ఎంఈవో-2 బి.సుధాకరరావు అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ పీ గంగాధర్, సీఆర్పీ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ

రైతులకు అందుబాటులో ఉండాలి

సిబ్బందిని ఆదేశించిన ఏడీఏ మోహన్‌రావు

చెరుకూరు(పర్చూరు), ఆగస్టు 19 : రైతులకు వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలని పర్చూరు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎన్.మోహన్‌రావు ఆదేశించారు. సోమవారం మండలంలోని చెరుకూరు, కొత్తపాలెం గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ నేపథ్యంలో ఆర్‌బీకే వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను అందించే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం వరి పైర్లును ఆయన పరిశీలించి రైతులకు తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఆయనతోపాటు వీఏఏఎస్, రైతులు ఉన్నారు.

వైభవంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

వీరన్నపాలెం(పర్చూరు), అగస్టు 19 : పర్చూరు మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో దాతల సహకారంతో నిర్మించిన శ్రీ కృష్ణుని ఆలయంలో మంగళవారం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

మహిళలను సోదరభావంతో ఆదరించాలి

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి



కలెక్టర్‌కు రాఖీ కడుతున్న మహిళలు..కమిషనర్‌కు రాఖీ కడుతున్న ఆశ్రమ మహిళలు

చీరాలటౌన్, ఆగస్టు 19 : మానవ ప్రపంచంలో మహిళను ఆదరించి సోదరాభావంతో ముందుకు సాగాలని మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి పేర్కొన్నారు. సోమవారం పురపాలక సంఘ కార్యాలయంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు కార్యాలయ మహిళలు, స్వర్ణ రోడ్డులోని ప్రజాహిత ఆశ్రమం ప్రతినిధులు హాజరై కమిషనర్‌కు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. కమిషనర్ మాట్లాడుతూ నేటి ఆధునీకరణ ప్రపంచంలో మహిళలు, చిన్నారులపై దారుణంగా అత్యాచారాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువత మత్తుకు బానిసలు కావద్దన్నారు. కార్యక్రమంలో పలువురు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అనుబంధాలకు ప్రతీక రాఖీ

కలెక్టర్ వెంకటమురళి

చినగంజాం : అనుబంధాలకు ప్రతీక రాఖీ పండుగ అని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. మండలంలో సోమవారం రాఖీ పూర్ణిమను ఘనంగా నిర్వహించారు. రాఖీ పండుగను పురస్కరించుకొని అక్కలు, చెల్లెళ్లు తమ అన్నదమ్ములకు రక్షాబంధన్ కట్టి, మిఠాయిలు పెట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. యూనియన్ బ్యాంకు శాఖను ప్రారంభించడానికి వచ్చేసిన కలెక్టర్ జె.వెంకటమురళికి ఎంపీడీవో కేస్వరూపరాణి, సోపిరాల గ్రామానికి చెందిన పలువురు మహిళలు రాఖీలను కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

చెట్లకు రాఖీలు కట్టిన విద్యార్థులు

అద్దంకిటౌన్ : రాఖీ పండుగ సందర్భంగా కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాఖీ పండుగను వినూత్నంగా నిర్వహించారు. సోమవారం రాఖీ పండగ సందర్భంగా వృక్షశాస్త్ర విభాగం, ఎకో క్లబ్, ఇన్‌క్లూజివ్ సెంటర్ ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల ఆవరణలో ఉన్న మొక్కలకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా మొక్కలు ఆరోగ్యంగా పెరిగి మహావృక్షాలు కావాలని, వాటిని పెంచి పెద్దవి చేసే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు, అధ్యాపకులు డీ రాజశేఖర్, మస్తాన్‌వలి, రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటికి రాఖీ కట్టిన తెలుగు మహిళ

అద్దంకి : అన్నాచెలెళ్ల బంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను సోమవారం పలువురు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సోమవారం సచివాలయంలోని మంత్రి చాం బర్‌లో అద్దంకి పట్టణ తెలుగు మహిళ అధ్య క్షురాలు పిన్నింటి శ్రీదేవి రాఖీ కట్టారు. పాఠశాలల విద్యార్థులతోపాటు పలువురు అన్నాచెల్లెల్లు రాఖీలు కట్టుకున్నారు.


గొట్టిపాటికి రాఖీ కడుతున్న తెలుగు మహిళ అధ్యక్షురాలు


పత్తి పైరును పరిశీలిస్తున్న బాపట్ల డాట్ కేంద్రం కోఆర్డినేటర్

రసం పీల్చే పురుగుతో జాగ్రత్త

బల్లికురవ, ఆగస్టు 19 : వాతావరణంలో బెట్ట పరిస్థితుల ప్రభావం వలన పత్తి పైరులో రసం పీల్చే పురుగులు అధికంగా ఉన్నాయని రైతులంతా అప్రమత్తంగా ఉండాలని బాపట్ల డాట్ కేంద్రం కోఆర్డినేటర్ మురళీధర్‌నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని కె.రాజుపాలెంలో రైతులు సాగు చేసిన పత్తి పంటను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతు పత్తిలో గులాబీ పురుగు కూడా ఉందని రైతులు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో శాస్త్రవేత్త రాధాకృష్ణ, మార్టురు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో కుమారి, ఎంపీఈవో గుణశేఖర్, మౌలాలి, వీఏఏ వెంకటేష్ పాల్గొన్నారు.

మార్టూరు : పత్తిలో గులాబీ రంగు పురుగు వలన ఎక్కువ నష్టం జరుగుతుందని, దాని నివారణకు రైతులు కృషి చేస్తూ, దాని పట్ల అప్రమత్తంగా ఉండాలని డాట్ శాస్త్రవేత్త డాక్టరు జె.రాధాకృష్ణ రైతులకు సూచనలు చేశారు. సోమవారం మార్టూరులో తూర్పు పొలాల్లో రైతులకు చెందిన ప్రత్తి పంటలను డాట్ శాస్త్రవేత్తలు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు కమ్మ శివనాగేశ్వరరావు, స్వామి పత్తి పంటలో పురుగు కారణంగా నష్టపోతున్న వైనాన్ని శాస్త్రవేత్తల దృష్టికి తీసుకువచ్చారు. దాంతో డాట్ సెంటర్ కోఆర్డి నేటర్ డాక్టరు ఆర్. మురళీధర్‌నాయక్, శాస్త్రవేత్త రాధాకృష్ణ రైతులతో మాట్లాడుతూ ప్రత్తిలో రసం పీల్చే పురుగుల నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. ఎకరాకు 4 నుంచి 6 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి వీరగంధం కిరణ్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి మౌలాలి, వీఏఏ అమల, వీహెచ్ఏ సువర్చల రైతులు కిషోర్ పాల్గొన్నారు.

బైకు అదుపుతప్పి యువకుడి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

బల్లికురవ, ఆగస్టు 19 : అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి కొప్పెరపాడు వద్ద సోమవారం తెల్లవారుజామున ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా కొట్టిన ఘటనలో అద్దంకి మం డలం చక్రాయపాలెంకు చెందిన పిడతల నాగార్జున(32) మృతి చెందారు. ఎస్ఐ జీవీ చౌదరి తెలిపిన వివరాల మేరకు.. చక్రాయపాలెంకు చెందిన నాగార్జున మరో వ్యక్తితో కలిసి సంతమాగులూరు అడ్డరోడ్డులో ఉన్న మరో బైకు కోసం వెళ్లి తిరిగి తమ స్వగ్రామానికి వస్తుండగా నాగార్జున నడుపుతున్న బైకు ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డుపై పడిపోయింది. దీంతో నాగార్జున తలకు బలమైన గాయమై మృతిచెందారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతని సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్ఐ చౌదరి కేసు నమోదు చేశారు.

విద్యుత్ మోటార్ల చోరీ

» ఆందోళనలో రైతులు

» సింగిల్ ఫేస్ విద్యుత్ ఇస్తే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని విజ్ఞప్తి


చోరీకి గురైన కేబుల్ వైర్లు

బల్లికురవ, ఆగస్టు 19 : మండలంలోని కొనిదెన గ్రామంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్లను దొంగిలించారు. సోమవారం పొలానికి వెళ్లిన రైతులు మోటార్లు పని చేయకపోవడంతో కేబుల్ వైర్లు కట్ చేసి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురయ్యారు. కొంత కాలంగా దొంగలు వ్యవసాయ మోటార్లను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేస్తున్నారని రైతులు చెప్తున్నారు. దొంగతనాల కట్టడికి పొలాల్లో సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా అందుబాటులోకి తెస్తే వెంటనే తాము తమ సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటామని రైతులు అంటున్నారు. సమస్యను విద్యుత్ అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. కొణిదెన గ్రామంలో ఇన్నమూరి రాజేశ్వరరావు, వల్లెపు వెంకట్రావు, తోటకూర నాగయ్య, అడవి చిన బసవయ్య, పల్లపు నాగేంద్రం, ఆలా బ్రహ్మయ్య, పల్లెకొండ, పలువురు రైతులకు చెందిన 20 వరకు మోటార్ల కేబుల్ వైర్లు కట్ చేశారని, పంటలు పండించే సమయంలో విద్యుత్ సరఫరా లేకుండా పోయిందని పంటలు కూడా ఎండుముఖం పట్టే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. వ్యవసాయ మోటార్లు చోరీలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

హెచ్ఐవీపై అవగాహన



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్ఐ

మేదరమెట్ల, ఆగస్టు 19 : గ్రామాల్లో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా కొంతమేర నియంత్రణ సాధ్యమవుతుందని కొరిశపాడు ఎస్ఐ వై.సురేష్ అన్నారు. హెల్త్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొన్నారు. హెచ్ఐవీ నియంత్రణ కరపత్రాలను ఆవిష్కారించారు. హెచ్ఐవీకి గురి కాకుండా యువత తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంస్థ డైరెక్టర్ బీవీ సాగర్, సభ్యులు భార్గవ్, కృష్ణవేణి, సువార్త, శారద పాల్గొన్నారు.

సోపిరాలలో యూబీఐ శాఖ ప్రారంభం


బ్యాంక్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

చినగంజాం, ఆగస్టు 19 : చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చినగం జాం శాఖను కలెక్టర్ జె.వెంకట మురళి సోమవారం ప్రారంభించారు. ఒంగోలు రీజినల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 78వ శాఖను చినగంజాంలో ఏర్పాటు చేసినట్లు ఒంగోలు ప్రాంతీయ అధికారి వి.రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రవికుమార్ మాట్లాడుతూ విద్యా రుణాలు, డ్వాక్రా మహిళలకు రుణాలు, మహిళలకు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రోత్సాహక రుణాలను అర్హతను బట్టి వెంటనే మంజూరు చేయనున్నట్లు తెలిపారు. బ్యాంకు అభివృద్ధికి గ్రామస్థులు తోడ్పాటునందించాలని కోరారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బ్యాంకు ప్రారంభోత్సవానికి వచ్చిన కలెక్టర్‌ని పలువురు గ్రామ పెద్దలు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కమిషనర్ డాక్టర్ టీఎస్ఆర్ ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు డిప్యూటీ రీజినల్ హెడ్‌లు బి.శ్రీనివాసరావు, కే.రామలింగేశ్వరరావు, ఒంగోలు చీఫ్ మేనేజర్ సాయిని సాంబశివరావు, వేములపాడు మేనేజర్ ఎస్.శ్రీనివాసరావు, చినగంజాం శాఖ మేనేజర్ వి.ప్రదీప్‌చంద్ర, గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, తహసీల్దార్ జి.ప్రభాకరరావు, ఎంపీడీవో కే.స్వరూపరాణి, ఏపీఎం కే.అంజిబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం విశేష అలంకరణలో నెల్లూరు నగర నాయకి రాజరాజేశ్వరి అమ్మవారు



సోమశిల జలాశయాన్ని పరిశీలిస్తూ..
ప్రాజెక్టు పరిస్థితిని మ్యాప్ పాయింటింగ్ ద్వారా తెలుసుకుంటూ..
క్రస్ట్‌గేట్లను పరిశీలిస్తూ..

వర్షాకాలం లోపు ఆఫ్రాన్ నిర్మిస్తాం!

సోమశిల డ్యాం పరిరక్షణకు చర్యలు

మరమ్మతులకే రూ.140 కోట్లు అవసరం ● పొంగూరు, పడమటినాయుడుపల్లి రిజర్వాయర్ల నిర్మాణం ● కాంట్రాక్టర్లతో పనులు పూర్తి చేయిస్తాం! ● సోమశిలలో సీఎం చంద్రబాబు

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 19 : 'ఒక ఆస్తిని నిర్మించడం ఎంత ముఖ్యమో దానిని కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. చరిత్ర కలిగిన సోమశిల ప్రాజెక్టు పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. దెబ్బతిన్న గేట్లు రిపేరు చేయించి ఆఫ్రాన్ నిర్మిస్తాం. స్లూయిస్‌లో కూడా గోడ నిర్మిస్తాం. రాష్ట్రంలోని ప్రాజెక్టుల మరమ్మతులకు రూ.300 కోట్లు అవసరమవుతుంది. ఒక్క సోమశిలకే రూ140 కోట్లు ఖర్చవుతుందని ఇంజనీర్లు నివేదిక ఇచ్చారు. వర్షాకాలంలోపు ఆఫ్రాన్ నిర్మాణం పూర్తి చేస్తాం. అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటారన్న ఉద్దేశంతోనే నేనే స్వయంగా వచ్చి ప్రాజెక్టు భద్రతకు చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలిచ్చాను' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని శ్రీసిటీలో పర్యటన ముగించుకొని హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3:30 గంటలకు సోమశిలకు చంద్రబాబు చేరుకున్నారు. అక్కడ నుంచి జలాశయం మీదకు వెళ్లి మరమ్మతులకు గురైన గేట్లను, దెబ్బతిన్న ఆఫ్రాన్‌ను పరిశీలించారు. మ్యాప్ పాయింటింగ్ ద్వారా ప్రాజెక్టు పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సోమశిల గ్రామంలో ప్రజలతో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ 38 టీఎంసీల సామర్థ్యం ఉన్న సోమశిలను 78 టీఎంసీలకు పెంచిన ఘనత ఎన్టీ రామారావుకే దక్కుతుందని కొనియాడారు. సోమశిల, కండలేరు జలాశయాలను పరిరక్షించుకుంటే నెల్లూరు జిల్లా సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. 2018లో సోమశిలకు అనుకున్న స్థాయిలో నీళ్లు రానప్పుడు అప్పటి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితిని తన దృష్టికి తీసుకొచ్చారని, ఆ వెంటనే శ్రీశైలం నుంచి 48 టీఎంసీల కృష్ణా జలాలను సోమశిలకు తీసుకొచ్చి రైతులను ఆదుకున్నామని చంద్రబాబు గుర్తు చేశారు. ఇప్పుడు కూడా కృష్ణా బేసిన్‌లో వరద వస్తుండటంతో ముందుచూపుతో ఆలోచించి శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను సోమశిలకు తీసుకొస్తున్నామని చెప్పారు.

2021లో పోటెత్తిన వరదకు సోమశిల ఆఫ్రాన్ దెబ్బతింటే వైసీపీ ప్రభుత్వం కనీసం మరమ్మతులు కూడా చేయలేదని విమర్శించారు. నాడు బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పారిపోయారని అన్నారు. ఇప్పుడు పనులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామని, పారిపోతే పట్టుకొచ్చయినా పనులు చేయిస్తామని వ్యాఖ్యానించారు. ఇంజనీర్లు పాత రోజులు మర్చిపోయి ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలని సూచించారు. గేట్లు, ఆఫ్రాన్, కాలువల్లో పూడికతీత వంటి పనులు చూసుకోవాలని ఆదేశించారు. మెట్ట ప్రాంతంలో 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే పొంగూరు, పడమటినాయుడుపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.




ఇక 'సోమశిల'కు పూర్వ వైభవం : ఆనం

అనంతసాగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాకతో సోమశిల జలాశయానికి పూర్వ వైభవం వస్తుందని, అభివృద్ధికి అవసరమైన నిధులు విడుదలవుతాయని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. సోమశిలలో జరిగిన ప్రజావేదికలో మంత్రి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సోమశిల ప్రశ్నార్థకంగా మారిందని, దెబ్బతిన్న కట్టడాలతో ప్రమాదకరస్థితిలోకి ఉందని, డ్యాం అభివృద్ధికి సహకరించి రైతులను కాపాడాలంటూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబుకు విన్నవించుకోగా ఇప్పుడు రావడం ఆనందంగా ఉందన్నారు. ఇకపై ప్రాజెక్టు అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతాయని తెలిపారు. ఆనం సంజీవ్‌రెడ్డి హైలెవల్ కెనాల్ నిర్మాణంలో భాగంగా తొలుత పడమటినాయుడుపల్లి, పొంగూరు రిజర్వాయర్లు నిర్మించి 20 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చేలా ఆదేశాలు జారీ చేయడంపై రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు.

● సీఎంకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక తొలిసారి జిల్లాకు వచ్చిన నారా చంద్రబాబుకు జిల్లా నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి, కావ్య కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, పాశిం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, కలెక్టర్ ఓ ఆనంద్, ఐజీ ఎస్ఎస్ త్రిపాఠి, ఎస్పీ జీ కృష్ణకాంత్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రజా వేదిక కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా కూడా ప్రజలు కేరింతలతో సంతోషాన్ని వ్యక్తపరిచారు. గతానికి భిన్నంగా ప్రజల మధ్యలోనే చంద్రబాబు కూర్చున్నారు. ముందుగా అనుకున్న సమయం ప్రకారం 4.45 గంటలకు కార్యక్రమం ముగించాల్సి ఉన్నప్పటికీ మరో గంట పాటు ప్రజల మధ్యనే గడిపారు. ప్రజల నుంచి నేరుగా సమస్యలు తెలుసుకోవడంతోపాటు అర్జీలు స్వీకరించారు. షెడ్యూల్ ప్రకారం హెలికాప్టర్‌లో ఉండవల్లికి వెళ్లాల్సి ఉండగా చీకటి పడుతున్న నేపథ్యంలో తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి విమానంలో తిరుగుపయనమయ్యారు.


కలెక్టర్‌తో మాట్లాడుతూ..


వినతిపత్రాలు అందజేసేందుకు క్యూ కట్టిన జనం


సమాచార డీడీ సదారావుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సీఎం




సోమశిల గ్రామంలో జరిగిన ప్రజావేదికలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా!

● ప్రజావేదికలో సీఎం చంద్రబాబు హామీ



అనంతసాగరం, ఆగస్టు 19 : ప్రజావేదిక కార్యక్రమంలో తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రజలకు హామీ ఇచ్చారు. సోమవారం సోమశిల జలాశయం సందర్శనకు వచ్చిన సీఎం రామాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలపై ప్రస్తావించగా సీఎం సానుకూలంగా స్పందించి సమాధానం ఇచ్చారు. 'ఈ వేదికలో మీరు చెప్పిన సమస్యలు పరిష్కారం అయ్యేలా కలెక్టర్ గారికి ఆదేశాలు జారీ చేస్తాం. సోమశిల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు చేయిస్తాము. ఉత్తర కాలువ నీటి కేటాయింపులకు శాసనం చేయలేము. అయితే రైతులకు నీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకొంటా'మని హామీ ఇచ్చారు. ఇక ఇసుక రీచ్‌లో ఉపాధి కల్పన, అన్యాయం, దోపిడీ నిరావరణ చర్యలపై కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు సీఎం చెప్పారు.

సోమశిల ప్రమాదంలో ఉంది సార్!



సార్ గత ప్రభుత్వం సోమశిల ప్రాజెక్టును పట్టించుకోలేదు. ఎగువన కడప జిల్లాలో ఉన్న అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఆ వరద పోటెత్తి సోమశిలకు రావడంతో ప్రాజెక్టు కట్టడాలు ధ్వంసమయ్యాయి. అలాగే ఉత్తర, దక్షిణ కాలువల గట్లు కూడా దెబ్బతిని ఉన్నాయి. ఉత్తర కాలువ పరిధిలో కొంత మేరకు అటవీ అడ్డంకులతో పనులు నిలిచిపోయాయి పనులు పూర్తి చేయించండి సార్.

- కే మస్తాన్‌నాయుడు, ఆత్మకూరు

ఆసుపత్రి స్థాయి పెంచండి!



సోమశిలలో ప్రభుత్వ ఆసుపత్రి ఉంది. కానీ అత్యవసర సేవలు, కాన్పుల కోసం 50 కి.మీ దూరం ఉన్న ఆత్మకూరుకు వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడున్న ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేసేలా చూడండి సార్.

- భాగ్యమ్మ, సోమశిల

పశువైద్యశాల ఏర్పాటు చేయండి



సోమశిలలో పశువైద్యశాల లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వైద్యం కోసం అనంతసాగరానికి వెళ్తున్నాం. పాడి రైతులకు మేలు జరిగేలా సోమశిలలో పశువైద్యశాల తెప్పించండి..

- అనీల్, సోమశిల

నీటి ఇబ్బందులు తీర్చండి!



సోమశిల హిల్ కాలనీలో మాఎస్టీ కాలనీ ఉంది సార్. అక్కడ గతంలో చిన్న ట్యాంక్ నిర్మించారు అయితే, ఆ నీరు మాకు చాలడం లేదు. నీటి ఇబ్బందులతో అవస్థలు పడుతున్నాం. ఆ ట్యాంక్‌ను పెద్దదిగా కట్టించి ఇవ్వండి సార్..

- పెంచలమ్మ, సోమశిల

ఉద్యోగం ఇప్పించండి!



సార్ మాది కావలి. 2002లో వలంటీర్ రిటైర్డుమెంట్ జీవోతో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకొన్నాను. అప్పట్లో మా కమిషనర్ పట్టించుకోలేదు. ఇప్పటికీ ఉద్యోగం రాక ఇబ్బందులు పడుతున్నాం. సాయం చేయండి సార్..

- శ్రీధర్, కావలి

నీటి కేటాయింపులకు చట్టబద్ధత



సోమశిల ఉత్తర కాలువ నీటి కేటాయింపునకు చట్టబద్ధత కల్పించి నీటి ఇబ్బందులు లేకుండా చేయాలని కోరుతున్నాం సార్. ఆ దిశగా చర్యలు తీసుకొంటే నాన్‌డెల్టా రైతులకు మేలు జరుగుతుంది.

- ఓబుల్‌రెడ్డి, సర్పంచి పాతాళపల్లి

రీచ్‌లో కూలీలకు పని కల్పించండి



గతంలో టీడీపీ ప్రభుత్వంలో రీచ్‌లలో వాహనాలకు ఇసుక నింపేందుకు కూలీలతో పనులు చేయించేవారు. దీంతో మా పంచాయతీ పరిధిలోని మూడు గ్రామాలకు చెందిన 900 కుటుంబాలకు పని లభించి రాజుల్లాగా బతికాం. ఈసారి కూడా యంత్రాలు లేకుండా కూలీలతో పనులు కల్పిస్తే ఉపాధితోపాటు భూగర్భజలాలు ఇంకిపోయే ప్రమాదం ఉండదు. ఆ దిశగా చర్యలు తీసుకోండి సార్.

- సురేష్, పడమటికంభంపాడు


ప్రజా వేదిక వద్ద మహిళలతో రాఖీ కట్టించుకుంటున్న చంద్రబాబు

ముప్పుతిప్పలు పెడుతున్న '2.0'

● రిజిస్ట్రేషన్ల కోసం గంటల తరబడి నిరీక్షణ

నెల్లూరు (హరనాథపురం) : డాక్యుమెంటు రిజిస్ట్రేషన్ విధానంలో గత వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 2.0 పద్ధతి వల్ల రిజిస్ట్రేషన్ చేసుకునే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. సోమవారం నగరంలోని ప్రధాన రిజిస్ట్రార్ కార్యాలయానికి రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి నిరీక్షణ తప్పలేదు. ఉదయం రిజిస్ట్రేషన్ కోసం డాక్యుమెంటు ఇస్తే సాయంత్రానికి కూడా పని కావడం లేదు. ఒక్కో రిజిస్ట్రేషన్‌కు పది మంది రావడం వల్ల రిజిస్ట్రేషన్ కార్యాలయంలో కుర్చీలు కూడా సరిపోవటం లేదు. దీంతో ఎండలో నిలబడలేక, లోపల ఉండలేక వృద్ధులు అవస్థలు పడుతున్నారు. పాత విధానం 1.0 పద్ధతిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


రిజిస్ట్రేషన్ల కోసం నిరీక్షిస్తున్న జనం

నిమ్మ ధరకు రెక్కలు

● 80 కిలోల బస్తా రూ.7వేలు

● తుఫాన్ల ప్రభావం, వర్షాభావంతో తగ్గిన దిగుబడి

పొదలకూరు, ఆగస్టు 19 : తగ్గుముఖం పట్టని ఉష్ణోగ్రతలు, శ్రావణ మాసం ప్రభావంతో నిమ్మ ధరలు ఎగబాకుతున్నాయి. గతంలో కేజీ రూ.29 నుంచి 40 ఉండగా, ప్రస్తుతం రూ.60 (హోల్‌సేల్) పలుకుతున్నాయి. ఇదే ధర రిటైల్‌గా రూ.120 వరకు ఉంటోంది. పొదలకూరు నిమ్మ మార్కెట్‌లో లూజు బస్తా (80 కేజీలు) రూ.5 వేల నుంచి 7వేల వరకు ఉంటోంది. దేశవ్యాప్తంగా నిమ్మకాయలకు బాగా డిమాండ్ ఉండటంతో న్యూఢిల్లీ, జైపూర్, ఆగ్రా, లక్నో, గోరఖ్‌పూర్, గయా, పాట్నా, రాంచీ, బిహార్, చెన్నై, కోయంబత్తూర్ ప్రాంతాలకు పొదలకూరు మార్కెట్ నుంచే ఎగుమతి చేస్తున్నారు. ఎండలు, పర్వదినాల నేపథ్యంలో డిమాండ్‌కు తగ్గ సరఫరా లేదు. ఇటీవల తుఫాన్‌ల ప్రభావంతో ఉత్పత్తి తగ్గడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. నిమ్మకాయలు అత్యధికంగా ఎగుమతి చేసే పొదలకూరు, ఉమ్మడి జిల్లాలోని గూడూరు ప్రాంతాల్లో దిగుబడి బాగా పడిపోయింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణం. దీంతో నాణ్యమైన కాయలు మార్కెట్‌కు సక్రమంగా రావడంలేదు. ఈ కారణంగా నిమ్మ పిందెలకు కూడా డిమాండ్ ఏర్పడింది.



సూర్య, చంద్రప్రభలపై వెంకయ్య వైభోగం

వెంకటాచలం : గొలగమూడిలో వెలసిన అవధూత వెంకయ్యస్వామి 42వ ఆరాధనోత్సవాల్లో భాగంగా వెంకయ్య స్వామి సోమవారం సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగారు. వేకువజాము నుంచే స్వామివారికి వివిధ రకాల సేవలను చేసిన అర్చకులు 10 గంటల నుంచి సూర్యప్రభ వాహన సేవకు ఉత్సవర్లను సిద్ధం చేశారు. ఆదిత్యుడిపై కొలువుదీరిన స్వామివారిని గొలగమూడి గ్రామ వీధుల్లో ఊరేగించారు. రాత్రి చల్లని వెన్నెలలో వెంకయ్యస్వామి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సన్నాయి వాయిద్యాల నడుమ 'ఓం నారాయణ.. ఆదినారాయణ' అంటూ భక్తుల భజనల నడుమ విహరించారు. గ్రామస్థులు స్వామివారిని గడప గడపలోనూ ఆపి కర్పూర హారతులు అందచేశారు.

● ఉత్సవాల్లో నేడు

ఆరాధనోత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం ఉదయం హనుమంత సేవ, రాత్రి హంస వాహన సేవ జరుగుతుందని ఆశ్రమ ఈవో బాలసుబ్రహ్మణ్యం తెలిపారు.


చంద్రప్రభ వాహనంపై వెంకయ్య స్వామి


సూర్యప్రభ వాహనంపై కొలువైన వెంకయ్య స్వామికి హారతి ఇస్తున్న అర్చకులు

బస్‌షెల్టర్ల ఊసేలేదు!



జిల్లా వైద్యశాల ఎదుట రోడ్డుపైన ఉన్న పయాణికులు

ఆత్మకూరు, ఆగస్టు 19: పట్టణం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా, మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. చుట్టుపక్కల 80గ్రామాలకు ప్రధాన కూడలిగా ఆత్మకూరు ఉంది. 30కిపైగా పాఠశాలలు ఉన్నాయి. ప్రతి నిత్యం వివిధ ప్రాంతాల నుంచి 5వేల మందికిపైగా ప్రజలు వివిధ పనుల మీద ఆటోలు, బస్సుల్లో పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత ప్రాధాన్యం ఉన్న ఆత్మకూరు ప్రధానకూడళ్లలో సంబంధిత అధికారులు బస్‌షెల్టర్ల నిర్మాణం చేప ట్టలేదు. ఈ సమస్యతో ప్రయాణికులకు నిలువ నీడ కరువై చెట్ల కింద, వ్యాపార సముదాయాల వద్ద నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. మరికొన్ని కూడళ్ల వద్ద రోడ్డుపైనే ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

షెల్టర్లు లేని కొన్ని ప్రధాన కూడళ్లు ఇవే..

- పట్టణంలోని వైద్యశాలకు ఎదురుగా బస్ షెల్టర్ లేదు. వివిధరకాల రోగాలతో వైద్య సేవలకు వచ్చేవారు ఎండలో రోడ్డుపైనే నిలబడుతున్నారు.
- బీఎస్ఆర్ సెంటర్, సోమశిల రోడ్డు సెంటరు, నాగులపాడు రోడ్డు సెంటరు, జాతీయ రహదారికి పక్కనే ఉన్న నెల్లూరుపాళెం, ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాల సెంటర్లలో బస్సుషెల్టర్లు లేవు.
- పట్టణ ప్రధాన కూడళ్లలో మోడల్ బస్‌షెల్టర్లు ఏర్పాటు చేయలేదు.

వైభవంగా సీతారాముల గ్రామోత్సవం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: కృష్ణంపల్లి సీతారామచంద్ర ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా సోమవారం గ్రామ పురవీధుల్లో స్వామివారిని హనుమంతు వాహనంపై ప్రతిష్ఠించి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారి వాహనం వెంట వారుకడవతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఎద్దులు బండలాగుడు పోటీల్లో ఆరు జతలు పాల్గొన్నాయి. వీటిలో ప్రథమస్థానంలో కడప జిల్లా రంగసానిపల్లికి చెందిన మార్తాల వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు, ద్వితీయస్థానంలో అదే జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన మూలె సూరారెడ్డి ఎద్దులు, తృతీయస్థానంలో కడప జిల్లా పోతిరెడ్డిపల్లికి చెందిన మూలె ప్రసాద్‌రెడ్డి, కుమ్మరకొట్టాలకు చెందిన రవీ ఎద్దులు నిలిచాయి. ఆలయ నిర్వాహకులు విజేతలకు రూ.40,116 వేలు, రూ.30,116వేలు, రూ.20.116వేల చొప్పున నగదును అందజేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న మిగిలిన ఎద్దుల నిర్వాహకులకు ప్రోత్సాహక బహుమతి కింద ఒక్కొక్కరికి రూ.10వేలు అందజేశారు. పోటీలను తిలకించేందుకు గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

- అట్టహాసంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



బండలాగుతున్న ఎడ్లు

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిగుడిసె దగ్ధం

- రూ.లక్ష నష్టం • బాధితులకు బీజేపీ నేతల సాయం

ఏఎస్ పేట, ఆగస్టు 19: గుంపార్లపాడు ఎస్టీ కాలనీకి చెందిన యాకసిరి వెంకటరమణయ్య, చెంచులక్ష్మి దంపతుల పూరిగుడిసె సోమవారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిబుడిదైంది. ఈ విషయం గుర్తించిన వారు తేరుకొని బయటకు పరుగుల తిసి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ లోగా మంటలు పూర్తిగా వ్యాపించడంలో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంటిలో ఉన్న వస్తువులు, నిత్యావసర సరుకులతో సుమారు రూ.లక్ష ఆర్థికనష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. అధికారులు స్పందించి తనకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. విషయం తెలుసుకున్న బేజేపీ మండలాధ్యక్షుడు చెంచులరెడ్డి, ఉపాధ్యక్షుడు సిరిగిరి మహేష్‌లు బాధితులను పరామర్శించి 15రోజులకు సరిపడ నిత్యవసర సరుకులను అందజేశారు. తహసీల్దారుతో మాట్లాడి ఎన్‌టీఆర్ గృహకల్ప పథకం కింద నూతన గృహం మంజూరు చేసేందుకు కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: రాఖీ పర్వదినాన్ని సోమవారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు సోదరీమణులు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సోదరులు వారికి కానుకలను అందజేశారు. నడింపల్లి నాగా రప్పమ్మ కొలుపు కార్యక్రమానికి హాజరైన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్నలకు స్థానిక మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చెంచలబాబుకు రాఖీ కడుతున్న టీడీపీ మహిళ నాయకురాలు

వరికుంటపాడు: గ్రామాల్లో పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఇతర ప్రాంతాల్లో నివాసాలు ఉంటున్న వారు స్వగ్రామాలకు చేరుకొని తన అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టారు. సోదరులు అక్కా, చెల్లెళ్లకు అన్నివేళలా అండగా ఉంటామంటూ భరోసా కల్పించి బహుమతులు అందజేశారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని, విద్యార్థులు స్నేహపూర్వక వాతావరణంలో చదువుకోవాలని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. ర్యాగింగ్ నిరోధక వార్షికోత్సవంలో భాగంగా సోమవారం స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జూనియర్, సీనియర్ అనే బేధం లేకుండా విద్యార్థులంతా కలిసిమెలిసి విద్యాభ్యాసాన్ని కొనసాగించాలన్నారు. ర్యాగింగ్ చేయడం మంచి విద్యార్థుల లక్ష్యం కాదన్నారు. ర్యాగింగ్ చేస్తే ఇబ్బందులకు గురవుతారని, ఏ విద్యార్థి అలాంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ యాక్ట్‌పై విపులీకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ రమేష్, ప్రొఫెసర్లు కిషన్‌తేజ, హీన, పాల్, వార్డెన్‌లు సునీత, బాలచందర్ పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణలు నిలిపివేయండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలు నిలిపివేయాలని మండల ఆవాజ్ కమిటీ సభ్యులు సోమవారం డిప్యూటీ తహసీల్దారు జహీర్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్‌లో వక్ఫ్ చట్టాలను మార్చేందుకు ఇటీవల బిల్లులను ప్రవేశపెట్టారని, ముస్లింలోని పేద, బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి ఎవరైతే భూములు ఇచ్చారో వారి లక్ష్యాలకు అనుగుణంగా ఈ బిల్లు లేదన్నారు. రాజ్యాంగంలోని మతస్వేచ్ఛ ఆర్టికల్స్ 25, 26, 27, 28లకు ఈ బిల్లు వ్యతిరేకమన్నారు. కావున ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు ఫరుద్దీన్‌బాషా, నాయబ్, మహ్మద్‌రఫీ, హుసేన్, షబ్బీర్, నాగేశ్వరరావు, రసూల్, నజీర్ పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రం అందజేస్తున్న ఆవాజ్ కమిటీ సభ్యులు

మిఠాయిలు, పండ్ల పంపిణీ



విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న మండల ఏవో రేణుక

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: షుబ్‌దిన్ భోజన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక దళితవాడ పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్ మనవరాలు మన హేతబస్సుమ్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు మధ్యాహ్న భోజన సమయంలో మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. దాతలు కార్యక్రమానికి సహ కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యాలయ ఏవో రేణుక, విశ్రాంత హెచ్ఎం సయ్యద్ కలీం, ఉపాధ్యాయు లు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞాపకమే ఫొటో

నెల్లూరు(వైద్యం) : కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞాపకాలే ఫొటో అని ఫోటోగ్రఫీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొంతు శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరులోని రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, వీహెచ్‌పీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రస్ట్ కార్యాలయంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీ నిర్మాణ కర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, వీహెచ్‌పీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు షేక్ సత్తార్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, శ్రీలక్ష్మి స్టూడియో శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హనుమంతుడి విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమిపూజలో పాల్గొన్న గ్రామస్థులు

సంగం, ఆగస్టు 19: అమరపనాయుడు కండ్రిక సమీపంలోని ల్యాంకో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి వెళ్లే రహదారి కూడలిలో హనుమంతుడి విగ్రహ ఏర్పాటుకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకురాలు లగడపాటి రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోశ్చరణల మధ్య భూమి పూజ చేశారు. 20అడుగుల విగ్రహంతోపాటు ప్రయాణికుల బస్‌షెల్టర్ కూడా నిర్మించనున్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు

సంగం, ఆగస్టు 19: స్థానిక తిరుమనకొండలో వెలసిన రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరాలయంలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు అభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో కలశ స్థాపన, షోడశ లక్ష్మీనారాయణ, కుంకుమార్చన, లలితాయజ్ఞంను నిర్వహించారు. భక్తులు హోమంలో పూర్ణాహుతి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వింజమూరు: నడిమూరు గురప్పస్వామి, అంకాలమ్మ అమ్మవారు, నాగవరపు అమ్మవారికి సోమవారం గురువారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు పసుపులేటి శివశంకర శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు, భక్తులు ఉదయాన్నే పూజలు, మధ్యాహ్నం అన్నదానం చేశారు.

1982 మోడల్ జీపు వేలానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోని 1982 మోడల్ ప్రభుత్వ జీపుకు ఉన్నతాధికారుల సూచన మేరకు వేలం నిర్వహించనున్నట్లు సీడీపీవో పచ్చవ లావణ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు 21 నుంచి 30 లోపు సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం అధికారి పేరున రూ.300డీడీతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

ఉదయగిరి రూరల్, ఆగస్టు 19: గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి ప్రతికార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పెంచలయ్య కోరారు. సోమవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు నెల్లూరు వెంకటస్వామినాయుడు అధ్యక్షతన పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కదిరి వెంకటరం గారావు, చల్లా సుబ్బరత్నం, షాజహాన్ పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ర్యాలీ



కలువాయి, ఆగస్టు 19: కోల్‌కతాలో మెడికల్ కాలేజీ జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనకు నిరసనగా సోమవారం శివసాయి కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండులో మానవహారంగా ఏర్పడి నిరసన చేపట్టారు. కార్యక్రమంలో వైద్యులు సరళకుమారి, మనస్వి, నాయకులు దండు పెంచలయ్య, ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలువ మరమ్మతులపై వినతి

కలువాయి, ఆగస్టు 19: స్థానిక చెరువు రెండు తూములతో పాటు ప్రధాన పంట కాలువకు మరమ్మతులు చేపట్టాలని రైతులు సోమశిల సీఎం ప్రజావేదికలో సీఎం చంద్రబాబునాయుడుకు వినతిపత్రం అందజేశారు. రెండు తూములు దెబ్బతిని నీరు లీకేజీ అవుతుందని, ఈ సమస్యతో పంటలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ఊరేగింపు విశిష్టతపై ప్రచారం

ఏఎస్ పేట, ఆగస్టు 19: త్రైత సిద్ధాంతం ఇందూజ్ఞాన వేదిక ప్రబోధ సేవాసమితి పొదలకూరు కమిటీ సభ్యులు శ్రీకృష్ణజన్మాష్టమి ఊరేగింపు విశిష్టతపై సోమవారం చారమణలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పెంచల నరసయ్య, సభ్యులు పెంచలయ్య, శేషాద్రి, సుధాకర ఆచారి, జాహ్నవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలోని 4వార్డు పసుపులేటి వేణు, 9వ వార్డు రాగి వెంకటమ్మ, పోకూరు లక్ష్మమ్మ, 8వార్డు పఠాన్ నసీబలు ఇటీవల మరణించారు. వారి కుటుంబాల సభ్యులను సోమవారం సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి కలిసి పరామర్శించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.10వేలు చొప్పున రూ.40 వేలను అందజేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్ రెడ్డి, ట్రస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

పార్కింగ్ ఇలా... రాకపోకలు ఎలా ?



క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేసిన వాహనాలు

కావలి,ఆగస్టు 19 : పట్టణంలోని క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రాకపోకలు సాగించాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో అన్నీ ప్రైవేట్ వైద్యశాలలు, విద్యాసంస్థలతోపాటు పలు వ్యాపారసంస్థలు ఉన్నాయి. విద్యాసంస్థలు వదిలిన తర్వాత ఇసుక వేస్తే రాలనంత రద్దీగా ఉంటుంది. ఆ సమయంలో వైద్యశాలలకు వెళ్లే రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ట్రాఫిక్ సమస్యను పోలీసులు గాలికి వదిలేశారు. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు ఈ రోడ్డుపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శంకుస్థాపన జరిగినా ప్రారంభం కాని పనులు

లింగసముద్రం, ఆగస్టు 19 : శంకుస్థాపన జరిగి ఆరు నెలలు దాటినా, మండలంలోని తిమ్మారెడ్డిపాలెం- అయ్యవారిపల్లిరోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాలేదు.దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ప్రధానమంత్రి గ్రామసడక్ యోజన కింద తారురోడ్డు నిర్మాణానికి కేంద్రం రూ.7.77 కోట్లు మంజూరు చేసింది..తిమ్మారెడ్డిపాలెం నుంచి వెంగళాపురం మీదుగా ఎర్రారెడ్డిపాలెం, ఉట్లవారిపాలెం, అయ్యవారిపల్లి వరకు 10.2కి.మీ దూరం తారురోడ్డు నిర్మాణంతోపాటు 13 చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంది.అయితే ఈ పనులకు 2023 నవంబరు 16న టెండర్లు జరగ్గా, 2024 ఫిబ్రవరి 22న కాంట్రాక్టరు అగ్రిమెంటు చేశారు. అదేనెల 24న పనుల ప్రారంభానికి శంకుస్థాపన చేశారు.ఈ పనులను కాంట్రాక్టరు 21.02.2025 ఫిబ్రవరి 21కి పూర్తి చేయాల్సి ఉంది.కానీ నేటికీ ప్రారంభించలేదు. త్వరగా ప్రారంభించేం దుకు చర్యలు తీసుకుంటామని పీఆర్ ఏఈ ఏ హనుమంతరావు చెప్పారు.



అభివృద్ధికి నోచని తిమ్మారెడ్డిపాలెం రోడ్డు

సీఎం దృష్టికి కావలి, కందుకూరు సాగునీటి సమస్యలు

కావలి, ఆగస్టు19: నియోజకవర్గంలోని సాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. సోమశిలను సందర్శించటానికి సోమవారం వచ్చిన సీఎంకు బొకే అందచేసి స్వాగతం పలికారు. అనంతరం నియోజకవర్గ సాగునీటి సమస్యలను తెలియచేస్తూ వినతిపత్రం అందచేశారు. డెల్టా ప్రాంతంలో చాలావరకు ఆయకట్టు భూముల్లో పలు నిర్మాణాలు చేపట్టడంతో అక్కడ సాగు విస్తీర్ణం తగ్గిందని, నాన్ డెల్టాలో వ్యవసాయానికి అనుకూలమైన భూములు ఉండటంతో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. ప్రస్తుత సాగును బట్టి ఆయకట్టు స్థిరీకరణ చేయాలని కోరారు.



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సీఎంకు సాగునీటి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

- రాళ్లపాడు రైతులను ఆదుకోవాలి

కందుకూరు : నియోజకవర్గానికి సాగు, తాగునీరు అందిస్తున్న రాళ్లపాడు ప్రాజెక్టుకు నీటిసమస్యను తీర్చి, ఆయకట్టు రైతులను ఆదుకోవాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేసినట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం సోమశిలకు వచ్చిన సీఎంను కలిసి సోమశిల ప్రాజెక్టు నుంచి రాళ్లపాడు రిజర్వాయరుకు ఇవ్వాల్సిన 1.5 టీఎంసీల నీటిని ప్రతిఏటా క్రమం తప్పకుండా అందించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అండజేసినట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. అంతేకాక రాళ్లపాడు రిజర్వాయరు గేట్ల నిర్వహణ, పంట కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని, రాళ్లపాడు ఎడమకాలువ పొడిగింపు పనులకు నిధులు విడుదల చేయాల్సిన అవసరాన్ని సీఎంకి వివరించామన్నారు. ఈ సమస్యలపై దృష్టిపెట్టి వాటిని పూర్తికి ప్రతిపాదనలు పంపాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారని ఇంటూరి ఈ సందర్భంగా తెలిపారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు

లింగసముద్రం, ఆగస్టు 19: మండలంలోని అన్నెబోయినపల్లి సమీపంలోని మన్నేరు వాగు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు.ముందుగా అందిన సమాచారం మేరకు ఎస్సై ఎం బాజీబాబు, సిబ్బంది ఆదివారం అర్ధరాత్రి మన్నేరు వాగులో ఇసుక నింపుకుంటున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. అనంతరం ట్రాక్టర్లను, డ్రైవర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈ సంఘటనపై కేసు నమోదు చేశామని, అపరాధ రుసుం విధించేందుకు ఈ కేసును నెల్లూరు మైనింగ్ అధికారులకు బదిలీ చేశామని ఎస్సై తెలిపారు.

రూరల్ సీఐ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన సీఐ

కావలి రూరల్, ఆగస్టు19: రూరల్ సీఐగా జీ. రాజేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంటిలిజెన్స్ విభాగంలో చిలకలూరిపేట సీఐగా పనిచేసిన ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ సీఐగా పనిచేసిన కాటూరి శ్రీనివాసరావు గుంటూరు వీఆర్‌కు బదిలీ అయ్యాడు. కాగా బదిలీపై వెళ్తున్న సీఐ శ్రీనివాసరావును డీఎస్పీ వెంకటరమణ, రెండవ పట్టణ సీఐ శ్రీనివాసరావు, రూరల్ సీఐ రాజేశ్వరరావు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు.

మొబైల్ రీచార్జి ధరలు తగ్గించాలి



మాట్లాడుతున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కావలిటౌన్ : మొబైల్ రీచార్జి ధరలు తగ్గించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాళ్ళూరు మాల్యాద్రి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జియో, ఎయిర్‌టెల్, తదితర కంపెనీలు ముందుగా తక్కువ ధరకే కనెక్షన్లు ఇచ్చుకుని, తీరా ప్రజలు అలవాటు పడ్డాక రీచార్జి ధరలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికైనా సామాన్యులను దృష్టిలో పెట్టుకుని చార్జిలు తగ్గించాలని కోరారు. సమావేశంలో ఎం రాధాకృష్ణయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్‌ల ఆగడాలు అరికట్టాలి

కావలి, ఆగస్టు19: పేదల ఉసురు తీస్తున్న ప్రైయివేట్ ఫైనాన్స్‌ల ఆగడాలను అరికట్టాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లి పేర్కొన్నారు. సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఆర్డీవోకు వినతిపత్రం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ ఫైనాన్స్ వారు, తండల వ్యాపారులు, ప్రైవేట్ బ్యాంకర్లు పేదవారికి అధికవడ్డీలకు అప్పులు ఇస్తూ వారిని వేధింపులకు గురి చేస్తున్నార న్నారు. వారి ఆగడాల నుంచి పేదలకు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, జరుగుమల్లి విజయరత్నం, శ్రీనివాసులు, వెంకటస్వామి, లక్ష్మీనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్

కందుకూరు, ఆగస్టు 19: రక్షాబంధన్ వేడుకలను సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. అనేక మంది సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల, నాగార్జున పబ్లిక్ స్కూల్, విజ్ఞాన్ విహార్ తదితర పాఠశాలల్లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టారు.



కందుకూరు : విద్యార్థులకు రాఖీ కడుతున్న విద్యార్థినులు

కొండాపురం: రాఖీ పండుగను మండల పరిధిలోని అన్నీ గ్రామాల్లో సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ప్రతి సోదరి తన సోదరుడికి రాఖీ కట్టి, స్వీట్లు తినిపించుకున్నారు. దూరప్రాంతాల్లో ఉన్న వారికి పోస్టులు రాఖీలు పంపి పండుగ జరుపుకున్నారు.

'ఉపాధి'లో అవినీతిపై నిగ్గుతేల్చండి

కలిగిరి, ఆగస్టు 19: మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవినీతి చోటుచేసుకున్నదని, ఈ విషయమై పూర్తి స్థాయిలో నిగ్గుతేల్చాలని టీడీపీ రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ రామారావు డిమాండ్ చేశారు. 2023-24 సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులపై సోమవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బహిరంగ విచారణ జరిగింది. ఈ సందర్భంగా పెదకొండూరు, చినఅన్నలూరు, గంగిరెడ్డిపాలెం, కావలిముస్తాపురం, రావులకొల్లు, ఏపినాపి గ్రామాల్లో పంచాయతీల తీర్మానాలు లేకుండా చేపట్టిన పనులపై ఏపీవో శ్రీనివాసులుతో సర్పంచులు వాగ్వాదానికి దిగారు. తీర్మానాలపై సంతకం లేకుండా చేపట్టిన పనులపై ఫిర్యాదుచేశారు. మొత్తం 23 పంచాయతీల ఆడిట్ పూర్తికావడానికి అర్ధరాత్రి వరకు సమయం పట్టవచ్చని, పూర్తి వివరాలు మంగళవారం వెల్లడిస్తామని ప్రిసైడింగ్ అధికారిణి వీ విజయలక్ష్మి తెలిపారు.



ఏపీవోపై ఫిర్యాదు చేస్తున్న సర్పంచులు

శ్రావణ పౌర్ణమికి ప్రత్యేక పూజలు

కందుకూరు, ఆగస్టు 19: శ్రావణ పౌర్ణమి సందర్భంగా సోమవారం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. పట్టణంలోని జనార్దన, స్కందపురి సోమేశ్వరాలయాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అలాగే పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న విఖనసమహర్షి మూలమూర్తికి వైభవంగా స్నపన తిరుమంజనాది కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం రాత్రి వరలక్ష్మీవ్రతాన్ని నిర్వహించారు.



కందుకూరు : ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

- విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు

బిట్రగుంట : బోగోలు మండలం సుందగిరివారికండ్రికలో సోమవారం అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు ప్రారంభమ య్యాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా చిల్లకూరుకి చెందిన సిద్ధాంతి బ్రహ్మశ్రీ ఈపూరు గోవిందరాజు ఆచారి, బృందం దిష్టితుడుపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన పూజలు నిర్వహించారు.

గ్రంథాలయానికి సొంత భవనం నిర్మించాలి

కావలి : ప్రభుత్వ గ్రంథాలయానికి స్థలం కేటాయించి, భవనం నిర్మించాలని బీసీ ఐక్యతా భవన్ అధ్యక్షుడు అద్దంకి ప్రభాకర్ తెలిపారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో జరిగిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతిపత్రం అందచేశారు.అనంతరం ప్రభాకర్ మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ గ్రంథాలయం అద్దె భవనంలో ఉండటంతో తరచూ భవనాన్ని మారుస్తుండటంతో పాఠకులు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్థలం మంజూరు చేసినా భవన నిర్మాణానికి దాతలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, బీసీ ఐక్యతా భవన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు యూ.గోవింద్,ఇతర బాధ్యులు మధు, ఏ. శ్రీనివాసులు, చిన్ని ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంటు వితరణ

కొండాపురం : మండలంలోని దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం మినరల్ వాటర్ ప్లాంటును వితరణ చేశారు.హెచ్ఎం ఐ.బాలక్రిష్ణయ్య,ఎస్ఎంసీ చైర్‌పర్సన్ ఓర్స్ మమత, సభ్యులు వల్లూరి వెంకటేశ్వర్లు కోరిక మేరకు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఇర్ల మహేష్ రూ.80 వేల విలువచేసే వాటర్‌ప్లాంటును ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థుల తాగునీటి సమస్య తీరుతుందని హెచ్ఎం అన్నారు. ఈ సందర్భంగా దాత మహేష్‌ను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

లోడ్ పెరగడంతోనే విద్యుత్ లోవోల్టేజీ సమస్య

బిట్రగుంట : విద్యుత్ కనెక్షన్ల లోడ్ పెరగడం తోనే ఓల్టేజీ సమస్య ఏర్పడిందని విద్యుత్ ఏఈ నాగూరువల్లి తెలిపారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటలో ఓల్టేజీతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలియచేయడంతో ఆయన సోమవారం పరిశీలించారు. టౌన్‌లైన్‌మన్ రమేష్‌బాబు, జేఎల్ఎం ఏలియాలతో లైన్, ట్రాన్స్‌ఫార్మర్ అవుట్ పుట్‌ను పరిశీలించారు. అదనపు గృహోపకరణాల వినియోగం కారణంగా సమస్య ఏర్పడినట్లు గుర్తించారు. త్వరలో అదనపు త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.